

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 16-2-2025 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 302 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా. 2.16 తదుపరి పంచమి; నక్షత్రం: హస్త తె. 4.31 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ. 11.03 -12.50; దుర్ముహూర్తం: సా. 4.41-5.27; అమృతఘడియలు: రా. 9.48-11.35; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 6.13 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేతలు.. నేల విడిచి సాములు

కొత్త పలుకు



ప్రాంతీయ పార్టీల అధినేతలు తమ చుట్టూ ఇనుప తెరలను ఏర్పాటు చేసుకొని ప్రజల మనోభావాలను తెలుసుకొనే ప్రయత్నం చేయరు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజలే తప్పు చేశారు అన్నట్టుగా వ్యాఖ్యానించడం పరిపాటిగా మారుతోంది.

అధికారం మత్తు తలకెక్కి కేసీఆర్ ప్రజలకు దూరమయ్యారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూట గట్టుకున్న ఎమ్మెల్యేలను సైతం మార్చకుండా ఎన్నికల్లో వారికే మళ్లీ టికెట్లు ఇచ్చారు. కేసీఆర్ అండ్ కోకు అహం తలకెక్కిందనే అభిప్రాయానికి ప్రజలు వచ్చారు. ఫలితంగా ఉద్యమ సమయంలో నెత్తిన పెట్టుకున్న ప్రజలే ఆయనను నేలకేసి కొట్టారు.

కేసీఆర్ పాలనలో ఏం జరిగింది? అని చెప్పడానికి కొన్ని మంచి పనులు ఉన్నాయి. అలాగే కొన్ని చెడ్డ పనులు కూడా ఉన్నాయి. కానీ, కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. రేవంత్ నలుగురైదుగురు మంత్రులతోనే సంప్రదింపులు చేస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మంత్రులతో ఎప్పుడైనా మాట్లాడ వచ్చు! శాసనసభ్యులు, కింది స్థాయి పార్టీ నాయకుల అభిప్రాయాలు తీసుకుంటే ఉపయోగపడతాయి. మొత్తం మీద ప్రభుత్వం ఆశించిన మేర పనిచేయడం లేదన్న అభిప్రాయం వ్యాపిస్తోంది. ఈ వ్యతిరేక భావనను మొగ్గలోనే తొలగించని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్రతిష్ఠపాలవుతుంది.

2019లో చంద్రబాబు ఓడిపోవడానికి కానీ.. ఆ తర్వాత కేసీఆర్, జగన్ ఓటమికిగానీ స్పష్టమైన కారణాలు ఉన్నాయి. 2019కి ముందు అధికారంలో ఉండిన చంద్రబాబు నేల విడిచి సాము చేశారు. రాజకీయాన్ని విస్మరించి ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో ఘోరంగా విఫలమయ్యారు.

"కాంగ్రెస్ పాలనను ఏడాదిగా గమనిస్తున్నా. నేను కొడితే మామూలుగా ఉండదు. గట్టిగా కొడతాను" అని కేసీఆర్ ఇటీవలే రేవంత్ సర్కార్‌ను హెచ్చరించారు. రేవంత్ కూడా ఇందుకు తగు విధంగానే స్పందించారు. 'నువ్వు గట్టిగా కొట్టేది ఏమిటి? ఫుల్లా - హాఫా?' అని వేరే అర్థంలో సెటైర్ వేశారు. ఈ సెటైర్లు వినడానికి బాగుంటాయి కానీ ప్రజలను మాత్రం సంతృప్తి పరచవు. రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు అవుతోంది. కేసీఆర్ అన్నారని కాదుగానీ ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా బాలారిష్టాలను అధిగమించలేదన్న భావన విస్తృతంగా ఉంది. ఎన్నికల ఫలితాల తర్వాత డీలా పడిపోయిన బీఆర్ఎస్‌లో భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే ప్రమాదం పొంచి ఉండటం కూడా రేవంత్ సర్కార్‌కు సవాలు కానుంది. వారిలో కొందరు ఘర్ వాపసీ ఆలోచన చేస్తున్నారు. కేసీఆర్ పట్ల వ్యతిరేకత క్రమంగా తొలగిపోతోంది. రేవంత్ ఇప్పటికైనా పరిస్థితులను మదింపు చేసుకొని విరుగుడు చర్యలు చేపట్టని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయినా ఆశ్చర్యపోవాల్సింది ఉండదు.



సొమ్మసిల్లిన ఓ మహిళను బోగిలోంచి తీసుకొస్తున్న సహాయక సిబ్బంది; రైల్వేస్టేషన్‌లో నెలకొన్న ప్రయాణికుల రద్దీ

న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట

15 మంది మృతి

మృతుల్లో ముగ్గురు పిల్లలు.. 10 మంది మహిళలు

- 30 మందికిపైగా గాయాలు.. పలువురు విషమం
- మహా కుంభమేళా కోసం ప్రత్యేక రైళ్లు
- ప్రయాణికులు భారీగా రావడంతో తొక్కిసలాట
- ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ఘోరం జరిగింది. మహాకుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. ఈ రైళ్ల కోసం ప్రయాణికులు భారీ సంఖ్యలో స్టేషన్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ తొక్కిసలాటలో 15 మంది మరణించారు. మృతుల్లో 10 మంది మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు ఢిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. దాదాపు 30 మందికి పైగా గాయపడినట్లు తెలిపాయి. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు

మిగతా 2వ పేజీలో...



బీసీ రిజర్వేషన్ల పెంపు..

క్యాటగిరీల వారీగా!

- గంపగుత్తగా 13 శాతం కాకుండా ఏ, బీ, సీ, డీ, ఈ క్యాటగిరీలకు పెంచే చాన్స్
- అసెంబ్లీలో చట్టం చేయడం ద్వారా అమలు
- ఎవరైనా కోర్టుకు వెళితే రద్దుకు ఆస్కారం
- ఇదే చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించి షెడ్యూల్ 9లో పెడితే నిలిచే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలనుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. బీసీ కులాలన్నింటికీ కలిపి గంపగుత్తగా కాకుండా సబ్ క్యాటగిరీల వారీగా పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 29 శాతం రిజర్వేషన్లు అమలవుతుండగా.. వీటికి అదనంగా మరో 13 శాతం పెంచుతామని ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే. అయితే.. మొత్తంగా బీసీలకు ఇంతమేర పెంచామని బిల్లులో పేర్కొంటారా లేక బీసీల్లో ఉన్న ఏ, బీ, సీ, డీ, ఈ.. క్యాటగిరీల వారీగా పెంచుతారా అన్నది తేలాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం న్యాయనిపుణులు, మేధావులు, బీసీ సంఘాల నేతలతో చర్చలు జరుపుతోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఏ, బీ, సీ, డీ, ఈ క్యాటగిరీల వారీగానే రిజర్వేషన్‌ను పెంచే యోచనలో ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...

నేటి నుంచి మరోసారి కుల గణన!

ఈ నెల 28 వరకు వివరాలు ఇవ్వొచ్చు 12

రాహుల్ మాటే వేదవాక్కు




ఎవరేమనుకున్నా పట్టించుకోను

- తను చెప్పిందే చేస్తా.. ఎన్ని కష్టాలొచ్చినా భరిస్తా
- రాహుల్‌గాంధీతో నాకు గ్యాప్ అసత్య ప్రచారం
- పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచీ జరుగుతోంది
- కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
- 42% రిజర్వేషన్ కోసం పార్లమెంటు చట్టం కోరతాం
- దాన్ని నెరవేర్చే బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌దే
- పార్టీ పరంగా 42% అంటే కాదు చట్టం అన్నారు
- ఇక కుల గణన ఆధారంగానే సంక్షేమ పథకాలు
- ప్రధాని పదవిని కించపరచలేదు
- చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన చేర్చాలి
- మార్చి 31 లోపు వంద శాతం రైతు భరోసా
- సబిత, తలసాని ఏ పార్టీలో గెలిచి మంత్రులయ్యారు?
- కేంద్రం చట్టం చేస్తే సభాపతికి గడువు పెట్టొచ్చు
- యమునా ప్రక్షాళనలా మూసీ ఎందుకు వద్దు?
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ చిట్‌చాట్

రాహుల్‌తో 50 నిమిషాల పాటు రేవంత్ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాటే తనకు వేదవాక్కని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేయడమే తన కర్తవ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ ఏం చెప్పారో అది మాత్రమే చేస్తానని, దానివల్ల ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, ఎవరు ఏమనుకున్నా పట్టించుకోనని తేల్చిచెప్పారు. రాహుల్‌తో తనకు దూరం పెరిగిందన్న ఆరోపణలను కొట్టిపారేశారు. తన వ్యతిరేకుల పైశాచిక ఆనందం ఎప్పటికీ నెరవేరదని చెప్పారు. శనివారం ఢిల్లీలోని జన్‌పథ్‌లో రాహుల్ గాంధీతో 50 నిమిషాల పాటు ముఖాముఖి సమావేశమైన రేవంత్‌రెడ్డి తెలంగాణలో కుల గణన, ఎస్సీ వర్గీకరణ కోసం తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి తన అధికారిక నివాసంలో మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఢిల్లీలో తనకు ప్రాధాన్యం తగ్గిందని, రాహుల్‌గాంధీతో ఎడం పెరిగిందని ప్రతిపక్షం చేస్తున్న ప్రచారం కొత్తదేమీ కాదన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా నియామకం జరగక ముందు నుంచి తనపై ఇలాంటి ప్రచారం జరుగుతోందని, అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ముఖ్యమంత్రి అవుతడా? అంటూ ఇలాంటి చర్చలే పెట్టారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే టికెట్లు, రాజ్యసభ టికెట్ల విషయంలోనూ ఏవేవో కథలు ప్రచారం చేశారని చెప్పారు. అవన్నీ తాను పట్టించుకోనన్నారు. పీసీసీ అధ్యక్షుడయ్యాక ఎన్నో ఒడుదొడుకులు ఎదురయ్యాయని, అన్నింటినీ సమర్థంగా ఎదుర్కొన్నానని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతల ప్రకారం ప్రజల్లోకి వెళ్లానని, ప్రజలు

మిగతా 13వ పేజీలో...



3,500 సంవత్సరాల కల్పవృక్షం

అబ్బురపరిచే అద్భుత లోకం

ఒక చెట్టు ఖరీదు రూ.4 కోట్లు! మరి అది ఎప్పటిదో తెలుసా!? 3500 ఏళ్లనాటిది! సినీ నటుడు ప్రభాస్, ఆసియా కుబేరుడు ముఖేశ్ అంబానీ ఇంట్లో ఇలాంటి చెట్టు ఉంది. వివిధ దేశాలకు చెందిన ఇటువంటి అరుదైన వృక్షాలు అక్కడ ఎన్నో!! అదే.. చిలుకూరులో 150 ఎకరాల్లో రూ.450 కోట్లతో ఏర్పాటు చేసిన **ఎక్స్‌పీరియం** పార్కు!

ఆ విశేషాలు.. నవ్య పేజీలో





నిమ్స్‌లో పిల్లలకు క్యాన్సర్ చికిత్స విభాగం 3

20 పడకలతో ఏర్పాటు: నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప



18 మెట్లు ఎక్కగానే అయ్యప్ప దర్శనం 2

- ఫ్లైఓవర్ బ్రిడ్జి తొలగింపు.. ఇరుముడితో వస్తే నేరుగా
- మార్చి 14 నుంచి కొత్త విధానం అమలు



ఎన్నికలు లేవు.. నిధులు రావు

- పంచాయతీలకు సర్పంచులు లేక నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు 14
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రావాల్సిన రూ.1,514 కోట్లు
- పాలకమండళ్లు ఉంటేనే నిధుల విడుదల
- మార్చి 31లోపు ఎన్నికలయ్యే అవకాశం మృగ్యం
- ఏడాది నిధులను కోల్పోయే ప్రమాదం



ఛత్తీస్‌గఢ్ 'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ హవా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఛత్తీస్‌గఢ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో జయకేతనం ఎగరవేసిన కాషాయ పార్టీ తాజాగా 10 మున్సిపల్ కార్పొరేషన్లను సునాయాసంగా కైవసం చేసుకుంది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 49 మున్సిపల్ కౌన్సిల్, 114 నగర పంచాయతీలతో సహా 173 పట్టణ, స్థానిక సంస్థలకు ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహించగా.. శనివారం ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ విజయం రాష్ట్ర బీజేపీ చరిత్రలో మరిచిపోలేని రోజుగా అభివర్ణించారు. కాగా, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ 8 మున్సిపల్ కౌన్సిల్, 22 నగర పంచాయతీలను గెలుచుకుంది.

'శీష్ మహల్'పై విచారణకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌పై కేంద్ర ప్రభుత్వం గురి పెట్టింది. కేజ్రీవాల్ హయాంలో ఢిల్లీలోని 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులో ఉన్న సీఎం అధికారిక నివాసాన్ని పునరుద్ధరించే పనులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే.. ఈ క్రమంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, శీష్ మహల్(అద్దాల మేడ)ను నిర్మించుకున్నారని బీజేపీ నాయకులు విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు భవనం పునర్నిర్మాణంపై ప్రాథమిక పరిశీలన చేసిన సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఈ నెల 13న కేంద్రానికి నివేదిక ఇచ్చింది. భవన నిర్మాణ విషయంలో నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంది. ఈ క్రమంలో పూర్తి స్థాయి విచారణ కు కేంద్రం ఆదేశించింది.

మహారాష్ట్రలో లవ్ జిహాద్ నియంత్రణకు చట్టం!

ముంబై, ఫిబ్రవరి 15: లవ్ జిహాద్, బలవంతపు మతమార్పిడులను నిరోధించడానికి చట్టం తీసుకురావాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై అధ్యయనం చేసేందుకు ఏడుగురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. డీజీపీ అధ్యక్షుడిగా ఉండే ఈ కమిటీలో మహిళ, శిశు సంక్షేమం, మైనార్టీ వ్యవహారాలు, న్యాయ, సామాజిక న్యాయం శాఖల కార్యదర్శులు, హోం శాఖ డిప్యూటీ కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో లవ్ జిహాద్, మత మార్పిడిలు ఎంతవరకు ఉన్నాయి, వాటిని అరికట్టడానికి చట్టపరంగా ఏమి చేయాలన్నదానిపై అధ్యయనం చేసి సిఫార్సులు చేయనుంది.

కొత్త టెక్నాలజీ ఉత్పత్తికి విజన్ కావాలి

- ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: వట్టి మాటలు చెప్పడం కాదు.. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్పత్తి చేయాలంటే స్పష్టమైన విజన్ భారత్‌కు అవసరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో అపారమైన ప్రతిభ అందుబాటులో ఉందన్న ఆయన.. యువతకు ఉద్యోగాలు కల్పించడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు బలమైన పునాది అవసరమని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అలాగే ఆయన తొమ్మిది నిమిషాల వీడియోలో డ్రోన్ టెక్నాలజీ గురించి చెప్పుకొచ్చారు. ఈ రంగంలో పోటీగా నిలిచేందుకు ఒక వ్యూహం రచించాల్సిన అవసరం ఉందన్నారు. దురదృష్టవశాత్తు ప్రధాని మోదీ దీన్ని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. కృత్రిమ మేధ(ఏఐ)పై ఆయన టెలీప్రాంప్టర్‌లో ప్రసంగాలు చేస్తుంటే.. మన పోటీదారులు కొత్త టెక్నాలజీల్లో ప్రావీణ్యం సంపాదిస్తున్నారని పేర్కొన్నారు.

కేంద్రం ఇచ్చిన రాయితీల్లో సగం ఆహారంపైనే..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, డిసెంబరు నెలల మధ్య కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల రాయితీలపై రూ.3.07 లక్షల కోట్ల వరకు ఖర్చు చేసింది. ఇందులో ఆహార సబ్సిడీ వ్యయాలు అత్యధికంగా 50 శాతానికి పైగా ఉండగా, ఎరువులపై రాయితీ స్వల్పంగా తగ్గిందని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు(9 నెలల్లో) ఆహార రాయితీలకు రూ.1.64 లక్షల కోట్లు కేటాయించారు. అయితే ఇదే సమయంలో ఎరువుల సబ్సిడీలు గతేడాది రూ.1.41 లక్షల కోట్ల నుంచి రూ.1.36 లక్షల కోట్లకు తగ్గాయి. భారత్‌లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం కూడా తగ్గిందని నివేదిక తెలిపింది .

జస్టిస్ గవాయ్ 'పరాన్నజీవుల' వ్యాఖ్య నిరుపేదలపై కాఠిన్యానికి నిదర్శనం

- 300 మందికి పైగా సామాజిక కార్యకర్తల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: "ఉచిత' పథకాల ద్వారా ఒక పరాన్నజీవుల వర్గాన్ని సృష్టించట్లేదూ' అని ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను 300 మందికి పైగా సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, పాత్రికేయులు ఒక బహిరంగ లేఖలో ఖండించారు. ఢిల్లీలో ఇళ్లులేని వారికి ఆశ్రయం కల్పించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ చేసిన ఈ వ్యాఖ్యలు పేదల పట్ల న్యాయ వ్యవస్థలో ఉన్న వ్యతిరేకతను ప్రతిఫలిస్తున్నాయని ఆ లేఖ విమర్శించింది. 'ఇళ్లు లేని వారంటే పట్టణ పేదల్లో అతిపేదలు. భవన నిర్మాణ కూలీలుగా, పారిశుధ్య కార్మికులుగా, బరువులు మోయడం వంటి కష్టమైన పనులు చేసుకుని జీవిస్తుంటారు. అలాంటి వారిని పరాన్నజీవులుగా వ్యాఖ్యానించడం కాఠిన్యతకు నిదర్శనమ'ని పేర్కొంది. అత్యంత బలహీన వర్గాలపై నిందలు వేయడం, వారిని వెక్కిరించడం తగదని సూచించింది.

పాక్ నుంచి డ్రోన్లతో మాదకద్రవ్యాలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా అంతర్జాతీయ సరిహద్దు మీదుగా భారత్‌లోకి పెద్ద ఎత్తున మాదకద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాల రవాణా జరుగుతోంది. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) గత నాలుగేళ్లుగా అమృత్‌సర్‌లో కూల్చేసిన డ్రోన్లలో 75% వరకు పాకిస్థాన్‌లోని లాహోర్ నుంచి ప్రయోగించినవేనని విశ్లేషణలో వెల్లడైంది. గతేడాది అంతర్జాతీయ సరిహద్దు మీదుగా 251 వరకు డ్రోన్లు భారత్‌లోకి ప్రవేశించగా, వాటిలో 184 డ్రోన్లు(75 శాతం) పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోకి, మరో 42 డ్రోన్లు పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోకి, ఇంకో 14 డ్రోన్లు గురుదాస్‌పూర్‌లోకి వచ్చినట్టు భద్రతాదళాలు గుర్తించాయి. 2019 నుంచే పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలు డ్రోన్ల ద్వారా మాదకద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలను భారత భూభాగంలోకి పంపిస్తున్నట్టు భద్రతా దళాలు పేర్కొన్నాయి.

పెన్సిల్ ఎత్తినా వ్యాయామం చేసినట్టే..!

న్యూయార్క్, ఫిబ్రవరి 15: గతేడాది జూన్‌లో అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు వెళ్లిన ఇద్దరు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ మార్చి 19న భూమి మీదకు బయల్దేరనున్నారు. జీరో గ్రావిటీ నుంచి గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలోకి దాదాపు 8 నెలల తర్వాత రానున్న వారికి.. భూమి మీదకొచ్చాక పలు రకాల సమస్యలు ఎదురు కానున్నట్లు తెలుస్తోంది. తాము భూమి మీదకు తిరిగొచ్చాక చిన్న పెన్సిల్ లేపినా పెద్ద బరువులు ఎత్తి వ్యాయామం చేసిన అనుభూతే ఉంటుందని విల్‌మోర్ మీడియాకు వెల్లడించారు.

జేఈఈ మెయిన్ బీఆర్క్ ప్రాథమిక కీ విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో బీఆర్క్, బీ ప్లానింగ్ అడ్మిషన్లకు నిర్వహించిన జేఈఈ మెయిన్ తొలి విడత పేపర్ 2ఏ, 2బీ ప్రాథమిక కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది. ఈ కీపై అభ్యర్థులు ఆదివారం వరకు తమ అభ్యంతరాలను తెలపవచ్చు. 2025 జనవరి 30వ తేదీన ఈ పరీక్ష జరిగింది. ఇటీవలే జేఈఈ మెయిన్స్ పేపర్ 1 ఫలితాలు వెల్లడైన విషయం తెలిసిందే.



బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ దంపతులు శనివారం కుటుంబసమేతంగా తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తన సతీమణి అక్షతతో దిగిన ఫొటో.



ఉద్యోగ యంత్రాంగంలో ఊచకోతలే!

ఒకేసారి 9,500 మందిని తొలగించిన ట్రంప్.. ఎక్కువమంది ప్రొబేషన్‌లో ఉన్న సిబ్బందే

- ఉద్యోగస్వామ్యం స్థిరీకరణలో భాగమన్న ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 15 : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉద్యోగ యంత్రాంగంలో పూర్తి స్థాయి ప్రక్షాళన మొదలుపెట్టారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న 9,500 మంది సిబ్బందిని ఒకేసారి తొలగించారు. వీరిలో ప్రభుత్వ భూములు, వయోవృద్ధుల సేవలు, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న కీలక విభాగాల సిబ్బంది కూడా ఉన్నారు. ఇంకా.. అంతర్గత వ్యవహారాల విభాగం, ఇంధన విభాగం, వ్యవసాయ విభాగం, ఆరోగ్య, మానవ సేవల విభాగాల్లోనూ సిబ్బందికి కోత విధించారు. ఫెడరల్ ఉద్యోగస్వామ్యాన్ని స్థిరీకరిస్తామని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పదేపదే చెప్పేవారు. ఇందులో భాగంగానే ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలో 'డోజ్' చేసిన సిఫారసుల ఆధారంగా ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఏకంగా వేల మందిని ఒకేసారి తొలగించింది. ఉద్వాసనకు గురైన వారిలో ఏడాదికాలంగా ప్రొబేషన్‌లో ఉంటూ ఇంకా పర్మినెంట్ కానివారే ఎక్కువమంది ఉన్నారు. ఇక.. కన్స్యూమర్ ఫైనాన్షియల్ ప్రొటెక్షన్ బ్యూరో వంటి స్వతంత్ర సంస్థలు సిబ్బంది కొరతతో దాదాపు మూతబడే పరిస్థితి వచ్చింది. బ్యూరోలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందికి సైతం ఉద్యోగాలు ఊడాయి. ఉద్యోగులను పెద్దఎత్తున కోల్పోయిన ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసు విభాగంలో వచ్చేవారం మరిన్ని కోతలు ఉంటాయని రాయిటర్స్ సంస్థ కథనం ప్రచురించింది. కాగా, స్వచ్ఛంద పదవీవిరమణకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఆఫర్‌ను ఇప్పటివరకు 75వేలమంది అంగీకరించారని వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి.

ఆర్మీలో ట్రాన్స్‌జెండర్లపై నిషేధం

సైన్యంలో ట్రాన్స్‌జెండర్ల నియామకాన్ని అమెరికా నిషేధించింది. అలాగే, మిలిటరీలో లింగ మార్పిడి వైద్య ప్రక్రియపైనా వేటు వేసింది. ఈ మేరకు ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీల్లో మరొకదాన్ని డోనాల్డ్ ట్రంప్ నెరవేర్చారు. రెండోసారి శ్వేత సౌధంలో అడుగుపెట్టిన తర్వాత ట్రంప్ పలు కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. సైన్యంలో ట్రాన్స్‌జెండర్ భావజాలాన్ని అనుమతించబోమన్నది ఆ ఉత్తర్వుల్లో ఒకటి. దీనిపై మిలిటరీ 'ఎక్స్'లో ఒక ప్రకటన విడుదల చేసింది. "తమను తాము ట్రాన్స్‌జెండర్లుగా భావించుకునేవారి నియామకాన్ని సైన్యంలో తొలగిస్తున్నాం. సర్వీసులో ఉండగా లింగ మార్పిడి విధానాలను అనుమతించబోం. అమెరికాకు నిస్వార్థంగా సేవలు అందించాలనుకునే జెండర్ డిస్ఫోరియా వ్యక్తులను మాత్రం యథాతథంగా గౌరవిస్తాం" అని తెలిపింది. కాగా, సైన్యంలో ట్రాన్స్‌జెండర్ల నియామకంపై ఉన్న నిషేధాన్ని 2016లో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా తొలగించారు. తాను అధికారంలోకి రాగానే తిరిగి వారిపై నిషేధం విధిస్తానని ట్రంప్ ప్రకటించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతక మిలిటరీ శక్తి కలిగిన దేశంగా అమెరికా ఎదగాలంటే ట్రాన్స్‌జెండర్ భావజాలాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిందేనని అప్పట్లో ఆయన పేర్కొన్నారు. కాగా, మహిళల క్రీడాపోటీల్లో ట్రాన్స్‌జెండర్లకు ప్రవేశాన్ని ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం నిషేధించింది. అలాగే, ఇటీవలి ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరఫున గెలిచిన ట్రాన్స్‌జెండర్ ఎంపీ సారా మెక్‌బ్రైడ్‌ను మహిళల బాత్రూమ్‌లోకి అనుమతించరాదంటూ అధికారిక రిపబ్లికన్లు ఏకంగా తీర్మానమే చేశారు.

119 మంది అక్రమ వలసదారులతో అమృత్‌సర్‌కు మరో విమానం

- 67 మంది పంజాబ్ వాసులు, 33 మంది హరియాణా వాసులు
- అమృత్‌సర్‌లో విమానం దిగడంపై పంజాబ్ సీఎం మాన్ అభ్యంతరం

అమృత్‌సర్, ఫిబ్రవరి15: అక్రమ వలసదారుల తరలింపులో భాగంగా అమెరికా నుంచి మరో విమానం అమృత్‌సర్ విమానాశ్రయంలో దిగింది. ఈ విమానంలో మొత్తం 119 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో 67 మంది పంజాబ్‌కు చెందినవారున్నారు. హరియాణాకు చెందిన వారు 33 మంది, గుజరాత్ 8, యూపీ 3, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల నుంచి ఇద్దరేసి ఉన్నారు. హిమాచల్, జమ్మూకశ్మీర్ కు చెందిన ఒక్కొక్కరున్నారు. మరోవైపు తమ రాష్ట్రంలో విమానాలు దిగడాన్ని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ వ్యతిరేకించారు. పంజాబీలు మాత్రమే అక్రమంగా వలస వెళ్తారని చెప్పడానికా అని ఆయన ప్రశ్నించారు. అయితే ఇలాంటి సున్నితమైన విషయాల నుంచి రాజకీయ ప్రయోజనం పొందాలని చూడటం సరికాదని బీజేపీ విమర్శించింది.

లోకం తీరు



ఒక్క చుక్క రక్తంతో క్లోమ క్యాన్సర్ నిర్ధారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రాణాంతకమైన క్లోమ క్యాన్సర్‌ను కేవలం ఒక చుక్క రక్తంతో, అతి తక్కువ ఖర్చుతో గుర్తించే పరీక్ష త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ దిశగా ఒరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ (ఓహెచ్ఎస్‌యూ) పరిశోధకులు పీఏసీ-ఎంఏఎన్(ప్యాక్‌మాన్) అనే రక్తపరీక్షను అభివృద్ధి చేశారు. పరిశోధనల్లో భాగంగా ప్యాంక్రియాటిక్ డక్టల్ అడెనోకార్సినోమా (పీడీఏసీ) రోగుల్లో మరింత చురుగ్గా ఉండే నిర్దిష్ట ప్రొటీన్లు, ప్రధానంగా ప్రొటీజెస్ కోసం 350మంది రక్త నమూనాలను పరిశీలించారు. పీడీఏసీ అనేది క్లోమ క్యాన్సర్‌లో అత్యంత ప్రాణాంతకమైన రకం. ఇది సంధాన కణజాలాన్ని బలహీనపర్చడం ద్వారా కేన్సర్ కణితులు పెరగడానికి దోహదం చేస్తుంది. ఈ ప్రొటీన్లను గుర్తించడం ద్వారా క్లోమ క్యాన్సర్‌ను 98శాతం కచ్చితత్వంతో నిర్ధారించగల పరీక్షను రూపొందించారు. ఈ అధ్యయనం వివరాలు సైన్స్ ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్ జర్నల్‌లో తాజాగా ప్రచురితమయ్యాయి. కేవలం ఒక్క చుక్క రక్తాన్ని పరీక్షించడం ద్వారా 45 నిమిషాల్లోనే ఫలితం వెలువడే ఈ పరీక్షకు రూపాయి కంటే తక్కువ ఖర్చవుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. శరీరంపై కోత పెట్టాల్సిన అవసరం లేకుండా అతి తక్కువ సమయంలో క్యాన్సర్‌ను గుర్తించే ఈ పరీక్ష.. వ్యాధి నిర్ధారణలో మేలిమలుపు కాగలదని, క్యాన్సర్ మరణాల నివారణకు తోడ్పడుతుందని భావిస్తున్నారు. కాగా, క్లోమ క్యాన్సర్ సోకిన తర్వాత బతికి బయటపడిన వారు చాలా తక్కువ. ప్రతి నలుగురిలో ఒక్కరే ఏడాది అంతకంటే ఎక్కువ కాలం జీవిస్తారని అంచనా. వ్యాధిని త్వరగా గుర్తించలేకపోవడమే దీనికి ప్రధాన కారణం. 2024లో క్లోమ క్యాన్సర్ బారిన పడి 50వేల మందికి పైగా మరణించారు.

డ్రోన్ల యుగంలో ఎఫ్-35లు అవసరమా?

వాషింగ్టన్, ఫిబ్రవరి 15: ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు అమ్మడానికి మార్గం సుగమం చేస్తామని రెండు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో ప్రతిపాదించిన నేపథ్యంలో ఆ విమానాల ప్రత్యేకతపై చర్చ మొదలైంది. దాంతోపాటు శరవేగంగా మారుతున్న యుద్ధ రీతుల్లో అంత ఖరీదు పెట్టి ఆ విమానాలను కొనాల్సిన అవసరం ఉందా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో భారీ ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా భారతదేశానికి చెందిన స్వతంత్ర రక్షణ నిపుణులు ఎఫ్-35కి అనుకూలంగా, ప్రతికూలంగా తమ వాదనలకు పదును పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఎఫ్-35కి వ్యతిరేకంగా ఐటీ దిగ్గజం ఎలాన్ మస్క్ గత ఏడాది నవంబర్లో పెట్టిన పోస్టులు ఇప్పుడు చర్చకు వచ్చాయి. చరిత్ర గతిలో అమెరికా పెట్టిన సొమ్ముకు మిలిటరీపరంగా అతితక్కువ ఫలితం ఇచ్చిన విమానాలు ఎఫ్-35 అని మస్క్ పేర్కొన్నారు. అదే రోజు మరో సందర్భంలో చిన్న మిలిటరీ డ్రోన్ల వీడియోను పోస్ట్ చేస్తూ "ఈ కాలంలో కూడా కొంతమంది మూర్ఖులు ఎఫ్-35ల తరహాలో మనుషులు ఉన్న యుద్ధ విమానాలను తయారు చేస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. "ఎఫ్-35లో ఏమేం ఉండాలనేది నిర్ణయించే సమయంలోనే దాని లక్ష్యం దెబ్బతింది. ఒక్క దాంతోనే చాలా పనులు చేయించాలి అనుకున్నారు. దాంతో అది అత్యంత ఖరీదైనదిగా, సంక్లిష్టమైనదిగా తయారైంది. అన్నిట్లో ప్రవేశం ఉంది. ఎందులోనూ నిష్ణాతురాలు కాదు అన్నట్లు తయారైంది. దాడిలో విజయం సాధించడం ఆ విమానానికి నిర్దేశించిన లక్ష్యాల్లో ఉన్నట్లు అనిపించడం లేదు. డ్రోన్ల యుగంలో పైలట్ ఫైటర్ జెట్‌లు పైలట్ల ప్రాణాలను పణంగా పెట్టడం తప్ప ఇంకెందుకూ పనికిరావు" అని మరో పోస్టులో అన్నారు. క్షిపణులు, డ్రాప్ బాంబ్‌ల రేంజ్‌లు పెంచుకోవాలంటే పైలట్లున్న ఫైటర్ జెట్‌లు సెట్ కావని చెప్పారు. తిరిగి వాడగల డ్రోన్లు ఆ పని తేలిగ్గా చేయగలవన్నారు. శత్రుపక్షానికి అధునాతన డ్రోన్లు, భూమి మీద నుంచి ప్రయోగించే అధునాతన క్షిపణులు ఉంటే పైలట్ సహిత ఫైటర్ జెట్‌లను ఇట్టే కూల్చేయగలవని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధమే ఇందుకు ఉదాహరణ అన్నారు. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించే ఫైటర్ జెట్‌లు పైలట్లకు అందమైన ప్రియురాళ్లను తెచ్చిపెట్టగలదని వ్యంగ్యంగా అన్నారు.

నిమ్మకాయకు రూ. 5.9 లక్షలు

చెన్నై, ఫిబ్రవరి 15: హైదరాబాద్‌లో గణేశుని చేతిలోని లడ్డూకు ఎంత ప్రాధాన్యం ఉందో తమిళనాడులోని పళనిలో మురుగన్ పాదాల చెంత పెట్టే నిమ్మకాలకు కూడా అంత ప్రాశస్త్యం ఉంది. తాజాగా జరిగిన వేలంలో ఒక నిమ్మకాయను రూ.5.90 లక్షలకు పాడి ఓ భక్తుడు సొంతం చేసుకున్నాడు. పుదుక్కోట్టై జిల్లా తిరువరుంగుళం వల్లనాట్టు చెట్టియార్ వర్గీయులు పళనిలో ఏటా మూడు రోజుల పాటు థైపూస ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేసే సమయాల్లో స్వామి పాదాల వద్ద ఒక్కో నిమ్మకాయ పెట్టి పూజ చేస్తుంటారు. వాటిని గురువారం వేలం వేశారు. ఒక్కో నిమ్మకాయ రూ.16 వేలు నుంచి 40 వేలు వరకు పలికింది. థైపూసం రోజున మురుగన్ అభిషేకం సమయంలో పాదాల వద్ద ఉంచిన నిమ్మకాయను రూ.5.09 లక్షలకు ఓ భక్తుడు సొంతం చేసుకున్నారు. వేలంలో కేవలం వల్లనాట్టు చెట్టియార్లు మాత్రమే పాల్గొంటారు.

ఏకంగా సీబీఐ ఆఫీసులోనే చోరీ

అగర్తల, ఫిబ్రవరి 15: ఏకంగా సీబీఐ క్యాంపు కార్యాలయంలోనే చోరీ జరిగింది. త్రిపుర రాజధాని అగర్తలలో..అదీ కట్టుదిట్టమైన భద్రత ఉండే శ్యామిలీ బజారులో చోటు చేసుకుంది. 5 నెలలుగా మూతపడి ఉన్న ఈ కార్యాలయానికి మంగళవారం అధికారులు వెళ్లి చూడగా ఆశ్చర్యకర దృశ్యం కనిపించింది. కార్యాలయ గోడలు తప్ప ఇంకేమీ అక్కడ లేవు. ద్వారాలు, కిటీకీలు, కప్‌బోర్డులు, ఇనుప బీరువాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు అన్నీ అపహరణకు గురయ్యాయి. దీనిపై సీబీఐ ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. 8 ఇనుప బీరువాలు, 7 చెక్క కుర్చీలు, 4 ఇతర కుర్చీలు, 4 కిటికీలు, గీజర్‌ను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట.. 15 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. ప్రయాగరాజ్‌కు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన 15-20 నిమిషాల్లోనే భారీగా ప్రయాణికులు ప్లాట్‌ఫాం 14, 15పైకి చేరుకున్నారు. దీంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటన రాత్రి 10 గంటల సమయంలో జరిగిందని చెప్పారు. ప్రయాణికులంతా ఒక్కసారిగా రైల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగినట్లు పేర్కొన్నారు. రైల్వే శాఖ తొలుత ఎలాంటి తొక్కిసలాట జరగలేదని, వదంతులను నమ్మొద్దని ప్రకటించింది. తర్వాత పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించామని పేర్కొంది. ఘటన జరిగిన వెంటనే ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రైల్వే స్టేషన్‌కు చేరుకొన్నాయి. గాయపడినవారిని వివిధ ఆసుపత్రులకు తరలించారు. తొక్కిసలాటలో మరణాలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. కాగా, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ.. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. ఘటన జరిగిన సమయంలో భద్రతా సిబ్బంది ఎవరూ లేరని ప్రత్యక్ష సాక్షులు ఆరోపించారు. రెండు రైళ్లు ఆలస్యంగా రావడం, 15-20 నిమిషాల్లోనే ప్రయాణికులు పెద్దఎత్తున



రైల్లోకి ఎక్కడానికి ఒక్కసారిగా దూసుకువెళ్తున్న ప్రయాణికులు

ప్లాట్‌ఫాంపైకి తోసుకురావడంతోనే తొక్కిసలాట జరిగిందని రైల్వే పోలీసులు తెలిపారు. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 15 మంది మరణించడం పట్ల ప్రధాని మోదీ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తన హృదయాన్ని కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు ఇంకా భారీ సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో.. కుంభమేళాను మరికొన్ని రోజుల పాటు పొడిగించాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. కుంభమేళాలో భాగంగా ఇప్పటివరకు 50 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారని యూపీ ప్రభుత్వం తెలిపింది. ఇదిలా ఉండగా, మహాకుంభమేళాలో శనివారం మరో అగ్ని ప్రమాదం జరిగింది. పలు టెంట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తూ ఎవరికేమీ కాలేదు. ప్రయాగ్‌రాజ్-మిర్జాపూర్ జాతీయ రహదారిపై భక్తులు ప్రయాణిస్తున్న బస్సు-బొలెరో వాహనం ఢీకొని పది మంది చనిపోయారు.

18 మెట్లు ఎక్కగానే దర్శనం

- శబరిమల అయ్యప్ప సన్నిధానంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి తొలగింపు
- మార్చి 14 నుంచి అమలు

(సెంట్రల్ డెస్క్)



అయ్యప్ప భక్తులకు శుభవార్త..! ఇకపై ఇరుముడితో వెళ్లే భక్తులు పవిత్ర పద్దెనిమిది మెట్లు ఎక్కగానే.. అయ్యప్ప సన్నిధిలో దర్శనానికి అనుమతిస్తారు. ఇంతకు ముందు పదునెట్టాంబడి ఎక్కగానే.. భక్తులను ఎడమవైపునకు మళ్లించేవారు. అక్కడి నుంచి ఆలయం చుట్టూ.. సుమారు 500 మీటర్ల దూరం ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా.. సన్నిధానాన్ని చేరుకోవాల్సి వచ్చేది. శబరిమల ఆలయ అభివృద్ధిలో భాగంగా.. అధికారులు కొత్త లేఅవుట్‌ను డిజైన్ చేశారు. దీని ప్రకారం సన్నిధానం చుట్టూ ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని తొలగిస్తారు. వచ్చేనెల 14న మీన మాస పూజల కోసం అయ్యప్ప ఆలయాన్ని తెరుస్తారు. ఆ సీజన్‌లో ఇరుముడితో వెళ్లే భక్తులు.. 18 మెట్లు ఎక్కగానే.. నేరుగా ధ్వజస్తంభానికి ఇరువైపులా రెండు లేదా నాలుగు లైన్లను ఏర్పాటు చేస్తారు. భక్తులు బలికల్‌పుర(కణిక్క వంచి-నైవేద్య పాత్ర) మీదుగా ఎదురుగా ఉండే అయ్యప్ప సన్నిధికి చేరుకోవచ్చు. ఇంతకు ముందు ఫ్లైఓవర్ దిగాక.. అయ్యప్ప సన్నిధి ఎడమ వైపు నుంచి దర్శనానికి అనుమతించేవారు. దీని వల్ల.. సన్నిధానానికి ఎదురుగా వచ్చినప్పుడు మాత్రమే రెండు లేదా మూడు సెకన్ల పాటు అయ్యప్ప దర్శనం లభించేది. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు తోపులాట, పోలీసులు లాగేయడం వల్ల మండలకాలం కఠిన దీక్షను పూర్తిచేసుకుని, అంతదూరం వెళ్లినా.. దర్శనం సరిగ్గా జరగలేదనే బాధ భక్తుల్లో ఉండేది. కణిక్కవంచి నుంచి వెళ్లేప్పుడు 30 సెకన్ల నుంచి నిమిషం వరకు అలా అయ్యప్పను దర్శించుకుంటూ ముందుకు సాగే అవకాశాలుంటాయి. ప్రస్తుతం శబరిమలలో కుంభమాస పూజలు జరుగుతున్నాయి. ఈ నెల 21 వరకు ఆలయం తెరిచే ఉంటుంది. 17వ తేదీ నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జి తొలగింపు, ఇతర అభివృద్ధి పనులను చేపడతారు. హైకోర్టు కూడా కొత్త ప్రణాళికకు ఆమోదముద్ర వేసింది. హైకోర్టు నియమించిన శబరిమల ప్రత్యేక కమిషనర్ ఆర్.జయకృష్ణన్, ట్రావెన్‌కోర్ బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ పర్యవేక్షణలో పనులు ప్రారంభమవుతాయి. కాగా.. ప్రస్తుతం ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిని భక్తుల రద్దీ నేపథ్యంలో 1989లో ఏర్పాటు చేశారు.

అపహరణ.. అత్యాచారం.. అమ్మకం!

ఆగ్రా, ఫిబ్రవరి 15: ఆ బాలిక వయస్సు 17 ఏళ్లు. ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. రాజస్థాన్‌లోని మెయిన్‌పురి వాళ్ల స్వగ్రామం. గతేడాది మే 18న ఎప్పటిలాగే ఆమె ట్యూషన్ కోసం ఇంటి నుంచి బయల్దేరింది. మళ్లీ రాలేదు. వాళ్ల ఊరి పక్కన ఉండే ఓ వ్యక్తి ఆ బాలికను కిడ్నాప్ చేశాడు. ఇటావాకు తీసుకువెళ్లి డ్రగ్స్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత, బాలికను ఆగ్రాలోని రవి, బాబీ అనే వాళ్లకు అమ్మేశాడు. వాళ్లిద్దరూ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తరువాత ఆమెను అజ్మేర్ తీసుకువెళ్లి.. అక్కడ ఆశా జైన్ అనే మహిళకు అమ్మేశారు. ఆశా జైన్ సదరు బాలికను అజ్మేర్‌కే చెందిన విష్ణు మాలీ అనే వ్యక్తికి రూ.3.5లక్షలకు అమ్మేసింది. విష్ణు మాలీకి టీనేజ్ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కోరిక. ఎక్కడా సంబంధం సెట్ కాలేదు. అందుకే, అతడు ఆశా జైన్ దగ్గర బాలికను కొనుక్కొని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. అదే బాలికకు అదృష్టమైంది. టీనేజ్ అమ్మాయితో పెళ్లిపై ఎంతో మక్కువగా ఉన్న విష్ణు.. తన పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో విరివిగా పోస్టు చేశాడు. ఆ పోస్టులు మెయిన్‌పురి వాళ్ల కంటపడ్డాయి. అప్పటికే, బాలిక అదృశ్యంపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు వెంటనే అజ్మేర్ వెళ్లి విష్ణు మాలీని, కిడ్నాపర్ నీరజ్‌ను అరెస్టు చేశారు.

గొంతు కోసినా.. మేకులా బతికింది

- నెల రోజులు శ్రమించి బాలికకు ప్రాణం పోసిన ప్రభుత్వ వైద్యులు

భోపాల్, ఫిబ్రవరి 15: ఆడపిల్ల ఇంటికి భారమని పురుట్లోనే చంపేసే ఎన్నో ఘటనలు చూశాం. మధ్యప్రదేశ్‌లోని రాయ్‌గఢ్‌కు చెందిన ఓ తల్లి తన నెల వయస్సున్న పసిపాప గొంతు కోసింది. రక్తం ధారగా కారుతున్న పసిగుడ్డును ఆ తర్వాత చెత్త కుండీలో పడేసింది. ఈ పాపంలో ఆ కఠినాత్మురాలి తల్లి కూడా పాలు పంచుకొంది. జనవరి 11న రక్తం మడుగులో ఉన్న ఆ పాపను చూసిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమెను 100 కి.మీ.దూరంలోని భోపాల్‌లో ఉన్న కమలా నెహ్రూ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ సమయానికి ఆమె గొంతు నుంచి రక్తం కారుతునే ఉంది. ఆమెకు చుట్టిన బట్ట కూడా రక్తంతో తడిచి ఎర్రగా మారింది. సత్వర వైద్యం అందించిన వైద్యులు పలు ఆపరేషన్లు చేశారు. తెగిన శిరలు, ధమనులు, నరాలు, ఇతర భాగాలను తిరిగి అతికించి కాపాడారు. ప్రభుత్వం నిర్వహించే శరణాలయానికి అప్పగించారు. సీసీటీవీ కెమేరాల ఆధారంగా దర్యాప్తు జరిపిన పోలీసులు పసిపాప తల్లి, అమ్మమ్మలను గుర్తించి అరెస్టు చేశారు. కాగా, బాలికకు శరణాలయంలోనే 'పిహు' అని నామకరణం చేశారు.

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి విస్తరణ

పీడియాట్రిక్ ఐసీయూ, వార్డు ప్రారంభం

చిన్నారుల కోసం ప్రత్యేకంగా సహాయ నిధి

త్వరలో ఏపీలోనూ ఆస్పత్రి నిర్మాణం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని విస్తరిస్తున్నామని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో ఆస్పత్రి నిర్మాణం ప్రారంభిస్తామని ఆ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ తెలిపారు. ప్రపంచ చిన్నారుల క్యాన్సర్ రోజును పురస్కరించుకుని శనివారం ఆస్పత్రిలో కొత్త పీడియాట్రిక్ ఐసీయూ, వార్డును, క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేక సహాయ నిధిని ప్రారంభించారు. ఈ నిధి ద్వారా పేద కుటుంబాల చిన్నారుల చికిత్సకు ఆర్థిక సహాయం అందించనున్నారు. దాతలు ఈ నిధికి తోడ్పాటు అందించాలని బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. 12 పడకలతో ప్రారంభమైన పీడియాట్రిక్ వార్డును ప్రస్తుతం 120 పడకలకు విస్తరించామని చెప్పారు. సాధారణ కీమోథెరపీ నుంచి అత్యాధునిక బీఎంటీ చికిత్స వరకూ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు దాదాపు 200పైగా బీఎంటీ చికిత్సలు అందించామని, ఇది దేశంలోనే అత్యధికమని తెలిపారు. చికిత్స పొందుతున్న చిన్నారులకు బాలకృష్ణ బహుమతులు అందజేశారు.


బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో పీడియాట్రిక్ ఐసీయూ, వార్డును ప్రారంభిస్తున్న బాలకృష్ణ

ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆటో డ్రైవర్ బలి

» రూ.50 లక్షల అప్పు చెల్లించలేక ఆత్మహత్య

» పెద్దపల్లి జిల్లాలో ఘటన


దేవేందర్ (ఫైల్)

ఫైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై ఆర్థిక ఇబ్బందులలో కూరుకుపోయిన ఓ ఆటో డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లాలో జరిగింది. ఫైటింక్లయిన్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ చొప్పరి దేవేందర్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. కొన్నేళ్ళుగా ఆడుతూ సుమారు రూ.50 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకోవడం, అప్పులు చెల్లించే మార్గం లేక శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు కిందకు దించి హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే దేవేందర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దేవేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నాగ్‌పూర్ వందేభారత్ కోచ్‌లు కట్

» ప్రయాణికుల ఆదరణ లేక రైల్వే నిర్ణయం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్-సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య నడిచే వందేభారత్ రైలు విషయంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది సెప్టెంబరు 14న ప్రారంభమైన ఈ రైలు సర్వీసుకు ప్రయాణికుల నుంచి తగినంత ఆదరణ లభించడం లేదు. 18 చైర్‌కార్లు, 2 ఎగ్జిక్యూటివ్ కార్లు కలిపి మొత్తం 20 బోగీలతో నడిచే ఈ రైలు ప్రారంభమై శుక్రవారానికి(14వ తేదీకి) ఆరు నెలలు పూర్తయింది. కానీ, రోజు కేవలం 20 నుంచి 25 శాతం ఆక్యుపెన్సీతోనే నడుస్తోంది. ప్రతిరోజూ నాగ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య 1,480 సీట్లతో ప్రయాణిస్తున్న రైలులో (వారాంతాల్లో మినహాయిస్తే) 1,000కి పైగా సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. ఫలితంగా రైల్వేకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీంతో నష్టనివారణకు దిగిన రైల్వే శాఖ.. ఈ రైలు బోగీల సంఖ్యను 20 నుంచి ఎనిమిదికి తగ్గించింది. వచ్చే 19వ తేదీ నుంచి ఈ రైలు ఏడు చైర్‌కార్, ఒక ఎగ్జిక్యూటివ్ కార్‌తో కలిపి ఎనిమిది బోగీలతో ప్రయాణిస్తుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.

GHMC హైదరాబాద్ మహానగర పాలక సంస్థ మల్కాజ్‌గిరి సర్కిల్-28

టెండరు కోరుతూ ప్రకటన

NIT No.: 55/EE-28/SBZ/GHMC/2024-25, పని పేరు:- నిర్వహణ పనులు: ఐతరములు-07, అంచనా మొత్తం: 217.20 లక్షలు, బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం: 17.02.2025న మ.12.30 గం.లకు బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 24.02.2025న మ.12.30 గం.లకు. అధికారి పేరు & చిరునామా సెల్ నం.: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 9154796465, 7331189186. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.inకు వంపగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.28, GHMC

DIPR RO No.10315-PP/CL/ADVT/1/2024-25, తేది:15.02.2025

నిమ్స్‌లో పిల్లలకు ప్రత్యేక క్యాన్సర్ విభాగం


నిమ్స్‌లో క్యాన్సర్‌పై నిర్వహించిన సింపోజియం ప్రారంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న పిల్లలకు మెరుగైన చికిత్స అందించడానికి నిమ్స్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయబోతున్నామని ఆ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి తెలిపారు. అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం (ఐసీసీడీ) సందర్భంగా శనివారం నిమ్స్ లో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ ప్రారంభించారు. బీరప్ప మాట్లాడుతూ పిల్లల కోసం 20 పడకలతో ఈ ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిమ్స్ అంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ సదాశివుడు గుండేటి మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో బోన్‌మారో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కూడా పిల్లలకు క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతీర్ జీ యుప్పిన్, ఐఏపీ జంట నగరాల శాఖ అధ్యక్షుడు డాక్టర్ జీవీఎల్ఎన్ చారి, నిలోఫర్ ఆస్పత్రి ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ (ఐఏపీ) ప్రతినిధులు, నిలోఫర్, గాంధీ, కాకతీయ వైద్య కళాశాలలు, బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రికి చెందిన విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో రాజాపేట తహసీల్దార్

» ఏసీబీ అధికారులమంటూ

ఫోన్ చేసి రూ.3.30లక్షల కాజేత

రాజాపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి రాజాపేట తహసీల్దార్ రూ.3.30 లక్షలు పోగొట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట తహసీల్దార్ దామోదర్‌కు ఈ నెల 9వ తేదీన ఏసీబీ అధికారులమంటూ సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. అవినీతికి పాల్పడుతున్నావు త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయనను భయపెట్టిన కేటుగాళ్లు, రూ.3.30లక్షలు పంపిస్తే అరెస్టు చేయబోమని హామీ ఇచ్చారు. దాంతో భయపడిన తహసీల్దార్ తన కుమారుడు, బంధువుల ఖాతాల నుంచి రూ.3.30 లక్షలను మూడు దఫాల్లో కేటుగాళ్లకు పంపించారు. అనంతరం తనకు వచ్చిన నెంబర్‌కు తహసీల్దార్ తిరిగి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దాంతో మోసపోయానని గ్రహించిన ఆయన.. తన కుమారుడి ద్వారా సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదు చేయించారు. ఈ ఘటనపై తహసీల్దార్ దామోదర్‌ను వివరణ కోరగా, పొంతన లేని సమాధానం చెప్పారు. రూ. 3.30 లక్షలు కాదని, రూ. 2.80 లక్షలు తన కుమారుడు పంపించాడని విలేకరులకు తెలిపారు.

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్

కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్: U40109TG2000SGC034119.

టెండరు ప్రకటన

TGNPDCL వారు తయారీదారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా మెటీరియల్‌లు కొనుగోలు చేయాలని ఉద్దేశిస్తున్నారు.

స్పెసిఫికేషన్ నం. CGM/P&MM/STN-186 to STN-215/2024-25

మెటీరియల్ పేరు: వివిధ మెటీరియల్‌లు, బిడ్ సెక్యూరిటీ : ఎక్స్-పనులపై @2%, ఆన్‌లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 15.02.2025న ఉ.11.00 గం.ల. నుండి. తదుపరి వివరాలకు వెబ్‌సైట్ www.tender.telangana.gov.in & www.tgnpdcl.com ను దర్శించగలరు. డిజిటల్ కీ www.tsts.telangana.gov.in లో పొందగలరు. ఫోన్: 9490610271, ఇ-మెయిల్: cgmpmm@tgnpdcl.com.

సం/- చీఫ్ ఇంజనీర్ (P&MM)

DIPR RO No. 10311-PP/CL/ADVT/1/2024-25 తేది: 15.02.2025

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి మార్కెటింగ్ శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

తి.తి.దేవస్థానములు, తిరుపతి, మార్కెటింగ్ శాఖకు దిగువ వస్తువుల సరఫరా కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు (1) సబీనా పౌడర్ 40,000 ప్యాకెట్లు సేకరణ, (2) బయో-కంపోస్టబుల్ లడ్డూ క్యారీ కవర్లు 25,00,000 నం.లు సేకరణ మరియు, (3) కొత్త ఖాళీ గోనె సంచులు (50 కిలోలు) 10,000 నం.లు సేకరణ. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in కు లాగాన్ కాగలరు. తదుపరి వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నం.లు: 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నం.0877-2264554.

TTD-40021(31)/1/2024-PRO SEC (Adv.No.327) Dt.:15.02.2025 సం/-కార్యనిర్వహణాధికారి

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి

చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004, తెలంగాణ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇ-టెండరు నం. & తేది	పని పేరు	వ్యయం (సుమారు)	బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది
EP No. 95 / CGM(E) / TC / T3 / TD.No.III / 2024-25 Dtd:15.02.2025.	SD-IV, TD-III, సాహెబ్‌నగర్ ట్రంక్ విద్యుత్ వినిమయం మరియు శుద్ధి చేయబడిన నీటి ప్రవాహ నివారించుటకు షట్ డౌన్ సమయంలో N పల్లి క్రాంపస్ వద్ద ఫేజ్-I, II & III 2375mm డయా పంపింగ్ పైప్‌లైన్స్ నుండి ఫేజ్-I, II & III రిజర్వాయర్‌కు క్రాస్ అరేంజ్‌మెంట్ ఏర్పాటు కొరకు 600mm డయా MS లైన్ M, S,D,L,L,J,T మరియు పని చేయుంచుట.	రూ.344.75 లక్షలు.	17.02.2025 @ 02.00 PM

టెండరుదారులు ప్రాధాన్యంగా Zip ఫార్మేట్‌లో మాత్రమే సమాచారమును అప్‌లోడ్ చేయవలసిందిగా కోరబడుతున్నారు. తదుపరి వివరాలను www.eprocurement.gov.in లో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి

చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, O&M సర్కిల్-IV, SR నగర్, హైదరాబాద్-38, T.G.

ఇ-టెండరు ప్రకటన

విషయం, ఇ-టెండరు ప్రకటన నం. మరియు తేది	O&M డివిజన్	పనుల సంఖ్య	శ్రేణి
O&M Div-XII పరిధిలోని వివిధ ప్రదేశాల వద్దగల వివిధ ప్రాంతాల వద్ద S/v చాంబర్ల రీప్లేస్/మరమ్మతులు PPCs పునరుద్ధరణ, వాటర్ పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, ఎయిర్ వాల్వ్‌ల సరఫరా మరియు బిగ్వాడా, పాడైన స్లూయిస్ వాల్వ్‌ల రీప్లేస్, కలుషిత నీటి సరఫరా ఫిర్యాదులు నివారించడానికి నీటి లీకేజీలను అరికట్టుట కొరకు ఒక సంవత్సర (2024-25) వార్షిక నిర్వహణ పనులు. EP No.234 to 243/CGM(E)/O&MC-IV/2024-25, Dt: 14.02.2025	O&M డివిజన్-XII	10	రూ.11.46 నుండి 21.83 లక్షలు

(1) టెండరు డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో తేది 14.02.2025 మ.03:00 గం. నుండి లభిస్తాయి మరియు టెండర్ల స్వీకరణకు చివరి తేది 20.02.2025 మ.03:00 గం. (2) సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) పేరు మరియు చిరునామా - చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-IV, HMWSSB, SR నగర్, హైదరాబాద్-38. (3) సమాచారాన్ని ప్రాధాన్యంగా 'జిప్' ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని కాంట్రాక్టర్లను/ సంస్థలను కోరడమైనది. (4) తదుపరి వివరాలను https://www.tender.telangana.gov.in లో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-IV, SR నగర్, హైదరాబాద్-500038, T.G.

సూపరింటెండెంట్ కార్యాలయం, గాంధీ హాస్పిటల్, సికింద్రాబాద్, తెలంగాణ

Rc.No./Misc.stores/GHS/2025/704 **సంక్షిప్త టెండరు ప్రకటన** తేది:15.02.2025

విషయం: గాంధీ హాస్పిటల్ సికింద్రాబాద్-Misc స్టోర్స్- ఈ హాస్పిటల్ కొరకు స్టేషనరీ/ఎలక్ట్రికల్/సకల విధ (మెకానికల్/ప్లంబింగ్/కార్పెంట్రీ) ఐటంల సరఫరా కొరకు సీల్డ్ టెండరుకు ఆహ్వానం.- ఇందుకు సంబంధించి. ఒక సంవత్సరం కాలానికి స్టేషనరీ, ఎలక్ట్రికల్ మరియు సకల విధ ఐటమ్‌ల సరఫరా కొరకు పేరొందిన సంస్థల నుండి సీల్డ్ టెండర్లకు ఆహ్వానం. నియమనిబంధనలతో పాటు టెండరు ఫారాలను సూపరింటెండెంట్ కార్యాలయం, గాంధీ హాస్పిటల్ సికింద్రాబాద్ నుండి పొందవచ్చును. ఇందుకు గాను టెండరు ఫారాల అమ్మకం తేది 17.02.2025 నుండి 24.02.2025 వరకు పనిచేసే పని రోజుల్లో నగదు రూపంలో ఒక్కో గ్రూప్‌కు రూ. 2000/- (రూపాయలు రెండు వేలు మాత్రమే) చెల్లించవలెను. సదరు మొత్తం బదిలీ చేయబడదు మరియు వాపసు రాదు. టెండరు ఫారాల దాఖలుకు ఆఖరి తేది 03.03.2025న సా.4.00 గం.ల్లోగా. టెండర్లు అడ్మినిస్ట్రేటివ్ వింగ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో తేది 04.03.2025న మ.3.00 గం.లకు తెరవబడును. సం/- సూపరింటెండెంట్, గాంధీ హాస్పిటల్, సికింద్రాబాద్.

DIPR RO No.10319-PP/CL/ADVT/1/2024-25, తేది:15.02.2025

hmda హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ

చీఫ్ ఇంజనీర్ కార్యాలయం

ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్ - 500038

NIT. No.: HMDA/DEV/CE/21/2024-25 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 13.02.2025

దిగువ తెలిపిన వివిధ పనుల కోసం రిజిస్టర్డ్ గల కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు కోరబడుచున్నవి.

క్ర. సం	పని పేరు	టెండరు కోరుచున్న అధికారి
1	మేడ్చల్-మల్కాజిగిరి (జి), ఘట్‌కేసర్ (మం), ప్రతాప్ సింగారం, (గ్రా) యొక్క లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి.	చీఫ్ ఇంజనీర్, HMDA
2	ఎన్‌హెచ్-44 పై సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యొక్క ప్యారడైజ్ సమీపాన బలంరాయ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల రీలొకేషన్, ప్రస్తుత 40 కెడబ్ల్యు సోలార్ ప్లాంటు యొక్క బదిలీపై పునఃస్థాపన, స్టాఫ్ క్వార్టర్‌తో మీటింగ్ హాల్ పునర్నిర్మాణం మరియు సంప్ నిర్మాణం.	
3	బోయిన్‌పల్లి జంక్షన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల రీలొకేషన్, 6 1/2 బోర్‌వెల్ డ్రిల్లింగ్, యాక్సెసరీలు, స్టాఫ్ రూమ్, స్టోర్ రూమ్, వాష్‌రూమ్, ప్రహరీ గోడ మరియు పంపింగ్ ఎక్విప్‌మెంట్ కలుపుకుని పంప్‌హౌస్ సహిత సంప్ నిర్మాణం.	

బిడ్ల దాఖలుకు ఆఖరు తేది: 07.03.2025న మ. 03.00 గం.ల వరకు. తదుపరి వివరాలకు https://tender.telangana.gov.in దర్శించగలరు. సం/- చీఫ్ ఇంజనీర్, HMDA

DIPR RO.No.10304-PP/CL/ADVT/1/2024-25, Dt: 15.02.2025

కణితిలో జన్యువును గుర్తించి చికిత్స

» కొలోరెక్టల్ క్యాన్సర్‌కు చికిత్సలో కొత్త విధానాలు

» ఆధునిక జీవనశైలితో పెరిగిన ఉదరకోశ వ్యాధులు

» సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): 'కొలోరెక్టల్ క్యాన్సర్‌కు సరికొత్త శస్త్రచికిత్స, కీమోథెరపీలు అందుబాటులోకి వచ్చాయని, ఇంతకుముందు ఆ వ్యాధిగ్రస్తులు ఎవరికైనా ఒకే రకమైన చికిత్స చేసేవాళ్లం. ఇప్పుడు ఎవరికి వారికి తగిన చికిత్సా విధానాలు పాటిస్తున్నామ'ని వైద్యులు తెలిపారు. కిమ్స్, కిమ్స్‌సన్‌షైన్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ వార్షిక సదస్సు నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు సదస్సును ప్రారంభించారు. కిమ్స్ ఆస్పత్రి సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా వ్యాధులు ఎక్కువ కావడంతో పాటు చికిత్సా పద్ధతులు కూడా గణనీయంగా మారిపోయాయని తెలిపారు. కణితిలో ఏ జన్యువు ఉందో, దాన్ని ప్రభావితం చేసే మందులు ఏమిటన్నది గుర్తించి, వాటినే ఇస్తున్నామని వివరించారు. ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ (ఐబీడీ), క్రాన్స్ వ్యాధి, ఇతర సమస్యలూ ఎక్కువవుతున్నాయన్నారు. ఐబీడీకి ఒకప్పుడు స్టెరాయిడ్లు ఇచ్చి, శస్త్రచికిత్సలు చేసేవాళ్లమని, కానీ ఇప్పుడు మోనోక్లోనల్ యాంటీబాడీస్‌లాంటివి ఇచ్చి నయం చేస్తున్నామని చెప్పారు. ఆధునిక జీవన శైలి, కదలకుండా ఎక్కువసేపు ఒకేచోట కూర్చుండిపోవడం, పాశ్చాత్య తరహా ఆహారపు అలవాట్ల వల్ల మన దేశంలోనూ ఉదరకోశ వ్యాధులు చాలా ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన దశాబ్దకాలంగా మన దేశంలో కొలోరెక్టల్ క్యాన్సర్ కేసుల సంఖ్య బాగా పెరిగిపోయిందన్నారు. వైద్యులు విమలాకర్, ఆర్‌పి శాస్త్రి, జీవీ రావు, పీయూస్ సాహ్ని, సుజోయ్ పాల్‌తో పాటు తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా వైద్యులు హాజరయ్యారు.



ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ కుల అస్తి పట్టింపు లేదు / చౌదరి / లేట్ మ్యారేజ్ / 40y/ 5'6" / వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ / MS జనరల్ మెడిసిన్ / Fair / మంచి ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. వాట్సాప్ : 9160371954 AJH-002794

★ కుల ఆస్తి పట్టింపు లేదు / కమ్మ / 43y / 5'5"/ డైవర్సీ / డాక్టర్ గైనకాలజిస్ట్ / వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ / మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 7036453550 AJH-002794

★ చౌదరి / విడో Govt. 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి పట్టింపు లేదు / వయస్సు: 45, కలర్: తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. ఫోన్ : 9676896226 AJH-003037

★ 58y / రెండవ పెళ్ళి / విడో / Govt. ఫ్యామిలీ పెన్షనర్ / సొంత ఇల్లు రెంట్స్ / పిల్లలు లేరు / ఎలాంటి బాధ్యతలులేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 7995376808 AJH-003039

★ 60y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / Govt. రిటైర్డ్ / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ / ల్యాండ్స్ / ఎలాంటి బాధ్యతలులేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 9030858858 AJH-003039

★ కమ్మ /కుల ఆస్తి పట్టింపు లేదు / 30y / 5'5"/ లేట్ మ్యారేజ్ / Fair / ఓన్ సూపర్ మార్కెట్ / మంచి అగ్రికల్చర్ ల్యాండ్ / ఓన్‌హౌస్ ఉన్న సింగిల్ వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 7036754709 AJH-002794

★ రెడ్డి / విడో / కుల, అస్తి ప్రసక్తి లేదు /Q: డిగ్రీ / Age: 31 / సొంత బిజినెస్, అందమైన వధువుకి వరుడు కావలెను. 1st / 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్ : 8143011223 AJH-15457

★ రెండోపెళ్ళి / విడో / 58y / Fair / కోటీశ్వరుడైన / Govt. Job / వెల్ సెటిల్ పిల్లలు లేని ఏ బాధ్యతలులేని వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్ : 8519803423 AJH-15457

★ రెడ్డి 2nd మ్యారేజ్ (కుల/అస్తి) పట్టింపు లేదు /30y / Q: డిగ్రీ / సొంత వ్యాపారం, ల్యాండ్స్, వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి 1st, 2nd సంబంధాలు కలవు. ఫోన్ : 9030062353 AJH-15457

★ అస్తి కుల పట్టింపు లేదు / రెడ్డి / 28y / 5'3" / B.Tech / 4 కోట్ల అస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. ఫోన్ : 9885492498 AJH-15457

★ రెడ్డి /విడో / కుల, అస్తి ప్రసక్తి లేదు / AGE: 35y / B.Com / Pvt. Job గల అందమయిన వధువుకి వరుడు కావలెను. All Caste Marriages Available. Ph: 8121347478 AJH-15457

★ అర్చవైశ్య /22y & 24y & 25y & 27y & 29y & 31y & 32y & 34y & 35y & 37y & 38y & 39y & 40y & 42y & 44y & 45y & 47y & 49y & 51y & 52y & 54y & 56y & 58y & 59y / జి.సుబ్రహ్మణ్యశాస్త్రి "మహేష్" (Since 1998) PH/WA:9291503949 AJH-002913

★ పద్మశాలి / ఏకైక కుమార్తె / M.Sc / C. Govt. టీచర్ / కేంద్రీయ విద్యాలయ / మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15458

★ ముదిరాజ్ / ఏకైక కుమార్తె / MBBS, PG / Govt. మెడికల్ ఆఫీసర్ / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15458

★ SC మాల / B.Tech / C. Govt. బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్ / మంచి జీతము / 5'4" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8341650195 AJH-15458

★ యాదవ / ఏకైక కుమార్తె / B.Tech / C. Govt. Asst. మేనేజర్ / బ్యాంక్ ఆఫ్ ఇండియా / మంచి జీతము / 5'5" ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618579861 AJH-15458

★ ముదిరాజ్ / M.Tech / C. Govt. సీనియర్ సెక్షన్ ఇంజనీర్ / మంచి జీతము / 5'4" ఎత్తు / 28 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618579861 AJH-15458

★ పద్మశాలి / B.Tech / Govt. జాబ్ / బ్యాంక్ ఆఫీసర్ / మంచి జీతము / 5'5" ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8790689274 AJH-15458

★ గౌడ / B.Tech / Govt. Sr. అసిస్టెంట్ / రెవెన్యూ Dept. / మంచి జీతము / 5'5" ఎత్తు / 28 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8790689274 AJH-15458

★ దేవాంగ, పద్మశాలి, 26 సం.లు డిగ్రీ 5'4" సొంత ఇల్లు స్థిరాస్తి / ఫాదర్ కులవృత్తి / బ్రదర్ మ్యారేజ్ గా ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్ : 9100579008 AJH-003039

★ యాదవ్స్, (ఎర), పూజ, ఆళ్ల) శాఖ 25 సం.లు Inter టైలరింగ్, ఫాదర్ టైలరింగ్, వ్యవసాయం ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్ : 9100579008 AJH-003039

★ మున్నూరుకాపు, కమ్మ 25 to 38 సం.లు మెడిసిన్ సంవత్సరం డిగ్రీ. సొంత ఇల్లు. ఆంధ్ర, తెలంగాణలలో ఉన్న అమ్మాయిలకి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. ఫోన్ : 9100579008 AJH-003039

★ బలిజ, 1st మ్యారేజ్ / 26సం.లు / డిగ్రీ / సొంత ఇల్లు / ఫాదర్ వ్యవసాయం / బ్రదర్ మ్యారేజ్ / స్థిరాస్తి ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. ఫోన్ : 9100579008 AJH-003039

★ కుల పట్టింపు లేదు / 52y / Widow / ఆంధ్ర / పిల్లలు లేరు / ఫ్యామిలీ పెన్షన్ / మంచి జీతము / సొంత ఇల్లు / అందమైన వధువుకు వరుడు కావలెను / కర్నూల్ సంధ్యా, జమిందార్ ప్రాధాన్యత. డైరెక్ట్ సంబంధం కలిగించుటకు ఫోన్ : 7075948409 AJH-003037

★ బ్రాహ్మణ / 29y /5'4"/1st మ్యారేజ్ / Qua: Inter / No Job / కట్నం ప్రసక్తి లేని వధువుకి వరుడు కావలెను. /2nd మ్యారేజ్ also OK / పౌరోహితం also OK. ఫోన్ : 8333086124 AJH-003037

★ కుల పట్టింపు లేదు / విడో / 45y /Tirupathi / Vijayawada / Guntur / Govt. Employee / Family Pensioner / Good Salary / Own House Lands / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8374476725 AJH-003036

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు / విడో / 50y /Andhra / Bank Employee / One Girl Settled / Own House / Agriculture Lands అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9581155315 AJH-003036

★ కులపట్టింపు లేదు / 40y /Widow / ANDHRA / పిల్లలు లేరు / సొంత ఇల్లు / పొలాలు / ఓన్ షోరూం / బిజినెస్, చదువు ప్రసక్తి లేదు / అందమైన వధువుకు వరుడు కావలెను. డైరెక్ట్ మీటింగ్ పెట్టబడును. (HYD OK) ఫోన్ : 9989350417 AJH-003036

★ బ్రాహ్మణ / 25y /Qua: 7th Class / 1st మ్యారేజ్ / శాఖ పట్టింపు లేదు / పౌరోహితం also OK. 2nd మ్యారేజ్ also OK / వరుడు కావలెను. ఫోన్ : 7207552927 AJH-003036

★ కుల పట్టింపు లేదు / విడో / 57 Y / Govt. HM / రెంట్స్ / లాండ్స్ / మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 99631 36481 AJB-862

వధువు కావలెను



★ కమ్మ / 48y / 5'6" / బిజినెస్ / సొంత ఇల్లు / లేట్ మ్యారేజ్ / వరుడికి 2nd విడో / తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ : 7093960377 AJH-003039

★ KHATIKA 32/5'10"/B.TECH, MBA, BUSINESS, 13+ LPA, HYD SEEKS WELL SETTLED BRIDE INTER / DEGREE FROM GOOD FAMILY. NO BROKERS. CALL PH: 9014416597 AJH-1754

★ డైరెక్ట్: కుల పట్టింపు లేదు 49y, BC, 2వ పెళ్ళి 60k pm, డిగ్రీ, ప్రై. జాబ్ Hyd లో స్వంత ఇల్లు & ప్రాపర్టీ ఉన్న వరునికి తగిన వధువు కావలెను. ఫోన్ : 9618346855 AJH-99846

★ గౌడ / B.Tech / Govt. Sr. Asst in లోకో పైలట్ / రైల్వే Dept / మంచి జీతం / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9985551454 AJH-15457

★ కమ్మ / 27y / 5'11"/ Fair / B.Tech (CS) 16.5L P/A / B'LORE / ★ 29y / 5'8"/ Fair / B.Tech (CSE) 21L P/A Hyd. ఫోన్ : 8019658575 AJH-002913

★ పద్మశాలి / C.A. / C.Govt. Asst. మేనేజర్ / మిథాని / మంచి జీతము / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15458

★ యాదవ / B.Tech / Govt. Asst. ఇంజనీర్ / SPDCL / మంచి జీతము / 5'11 ఎత్తు / 28 సం.ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15458

★ కమ్మ డాక్టర్ MD (DERM) 56Y/5'11" ఎత్తు సొంత Pharma Company, మంచి ఆస్తి గల కమ్మ డాక్టర్‌కి FC Caste వారు లేక విడాకులు పొందిన వధువు కావలెను. Phone Direct: 9492099220 Contact చేయగలరు. AJS-174968

★ బ్రాహ్మణ /పెన్షనర్ / సీనియర్ సిటిజన్ / చెడు అలవాట్లు లేవు / మంచి ఆరోగ్యం కలిగిన వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ - సంప్ర: 8179898506 AJH-003039

★ SC మాదిగ / కట్నం ప్రసక్తి లేదు / M.Tech (NIT) / Govt. వెహికల్ ఇన్‌స్పెక్టర్ / మంచి జీతము / 5'8" ఎత్తు / 31 సం.ల వరునికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-15458

★ SC మాల / ఏకైక కుమారుడు / M.Tech / Govt. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ / మంచి జీతము / 5'10" ఎత్తు / 31 సం.ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్ : 9505667050 AJH-15458

★ 2వ పెళ్ళి / కమ్మ /కుల ప్రసక్తి లేదు / B.Tech / C.Govt. బ్యాంక్ మేనేజర్ / SBI / మంచి జీతము / 5'10" ఎత్తు / 40 సం.ల వరునికి వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-15458

★ వైశ్య : B.A, ప్రైవేట్ జాబ్, ఒంటరి, వరునికి వధువు కావలెను. కుల, మత, కట్నం ప్రసక్తి లేదు, చదువు అందంతో పని లేదు. 36 to 42 Yrs ఉండాలి. డైరెక్ట్ : 9494604396.AJG-210213

కళ్యాణ వేదిక

★ కమ్మ, కాపు, రెడ్డి, ఇతర అన్ని కులముల NRI / డాక్టర్ / బిజినెస్ / GOVT / SWE 1వ, 2వ పెళ్లి సంబంధాలకై మెరుగైన సర్వీస్ సంప్ర: 9505283919 AJH-003037

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matches కై సంప్ర: Ph: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-003039

★ బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం Free Register 13/April 2025న / Kamalanagar Welfare Office, ECIL, Hyd. Ph: 9704656103 / 9533608887 Whatsapp No. AJH-003039

★ సెకండ్ మ్యారేజ్ లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 9885144375 AJH-003039

★ రజక / డాక్టర్స్ / ఇంజనీర్స్ / Govt. Jobs / Abroads / పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి. కోట్ల శ్రీనివాస్. ఫోన్ : 8106303155 / 9391265304 AJH-003039

★ Brahmin, పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas, Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002795

★ Padmashali - పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Shyam Ph: 7032712544 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002795

★ Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas Ph: 7093969457/ Blue Trend Matri Monial (P) Ltd. AJH-002795

★ Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Shyam. Ph: 7032712544 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002795

★ సికింద్రాబాద్‌లో మాదిగ వివాహ పరిచయ వేదిక / 23/02/25 ఆదివారం 10-6 PM ఫీ-1 వేయి. ముందుగా మీ ఫోటో బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫోన్: 9347046175 AJH-002794

★ రెడ్డి & BC, ఇతర అన్ని కులాలకు సంవత్సరాల నుండి సంబంధాలు చూస్తున్నాం. కాబట్టి మీకు కావాలనుకుంటే మంచి సంబంధాల కొరకు సంప్ర: 9502732389 AJH-15457

★ కమ్మ, కాపు, రెడ్డి, మున్నూరుకాపు, రాజులు, వెలమ & అన్ని కులాల 1వ, 2వ లేటు, NRI, Govt, Doctors, VIP Matches, ఫాస్ట్ సెటిల్ కొరకు సంప్రదించండి. స్త్రీలకు ఫ్రీ. ఫోన్: 6304448107, 7095422426 AJH-15457

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506 / 9705588313 AJH-002913

★ "MSR మ్యారేజ్ బ్యూరో" / USA సంబంధాలు / IT, డాక్టర్స్ మరియు సీనియర్ సిటిజెన్స్ కోసం సంబంధాలు కలవు. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. ఫోన్ : 9247976631 AJH-002913

★ మధువర్షిణి మ్యారేజస్, అన్ని కులముల వారికి సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, గ్రూప్ ఆఫీసర్స్, అబ్రాడ్, VIP, వారికి 1వ, 2వ పెళ్లి సంబంధంలు త్వరగా కుదర్చబడును. సంప్ర: కోట వినాయకుడు, ఒంగోలు. సెల్ 93921 92193 AJO-211228

★ కమ్మ, కాపు, క్షత్రియ ఆంధ్ర పద్మశాలీలకు, గౌడలకు, సాఫ్ట్‌వేర్, పారిశ్రామిక వేత్తలకు, వ్యాపారులకు తగిన సంబంధములు కలవు. అత్యంత సంపన్నులకు కూడా సంబంధములు కలవు. USA, UK,ఆస్ట్రేలియా, దుబాయ్ సంబంధములు కలవు. డైవర్సీలకు మా ప్రత్యేకత తాడేపల్లిగూడెం 99127 11669. AJN 228204

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9985921386, 9703618806.

శ్రీ శ్రీరస్తు శుభమస్తు మ్యారేజ్ బ్యూరో

(కమ్మ చౌదరీస్ వారికి)

సి. ప్రభాకర్: 9100404026/9866619191

ప్రొఫైల్స్: డాక్టర్స్ / సాఫ్ట్‌వేర్స్ / బిజినెస్ / గవర్నమెంట్ / సివిల్స్ / B.Tech / M.Tech/ MBA / MCA / MS / ఇండియా & అబ్రాడ్స్ 1వ, 2వ సంబంధాలు కలవు.

వధువు కావలెను

★ కమ్మ : 1996 / 5'11" / MBA / Own Pharma Company / 600 Crs ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ డైవర్సీ : 1987 / 5'10" / MBA / Real Estate Own / 150 Crs ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ USA : 1995 / 6'1" / MS Engg./ H1B / I140 / USD 300K / గల వరుడికి USAలో ఉన్న Software వధువు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ : 1995 / 5'10" / BTECH / Own Business / 500 Crs ప్రాపర్టీ గల వరుడుకి Well Settled వధువు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ రిచ్ : 1997 / 6 feet / B.Tech MBA / 500 Crs Property / Well Settled Family గల వరుడుకి good looking సాఫ్ట్‌వేర్ (or) డాక్టర్ వధువు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ డాక్టర్ : 1991 / 5'10" / DM Oncology / 200 Crs Share Property గల వరుడుకి Well Settled Family డాక్టర్ (or) సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ లేట్ : 1986 / 5'7" / B.Sc., LLB / 40 Crs Share Property గల వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ డాక్టర్ : 1996 / 5'11" / MD Radiology / 20 Crs Share Propertyగల వరుడికి డాక్టర్ వధువు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ డాక్టర్ : 1995 / 5'10" / MCH Gastroentrology / 50 Crs ప్రాపర్టీ గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ USA : 1994 / 5'11" / MS (Engg) US Citizen / Only Son / 25 Crs Property గల వరుడికి USA లో ఉన్న వధువు కావలెను. సంప్ర: 9866619191

వరుడు కావలెను

★ కమ్మ : 1998 / 5'4" / B.Tech / Software Job / 10 Crs Share Property గల వధువుకి సాఫ్ట్‌వేర్ (or) బిజినెస్ వరుడు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ డైవర్సీ : 1995 / 5'7" / M.Tech / Software Job / 30 Crs Property గల వధువుకి తగిన వరుడు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ రిచ్ : 1996 / 5'6" / B.Tech , MBA /60 Crs Share Property గల వధువుకి డాక్టర్స్ (or) సాఫ్ట్‌వేర్ (or) బిజినెస్ వరుడు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ USA : 1998 / 5'6" / MS (Engg)/Washington State / H1B Visa / 10 Crs Property గల వధువుకి USA లో ఉన్న వరుడు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ డాక్టర్ : 1995 / 5'1" / MD Radiology / 200 Crs Property / Well Settled Family గల వధువుకి డాక్టర్ (or) బిజినెస్ వరుడు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ డైవర్సీ : 1994 / 5'7" / B.Tech M.Tech / 20 Crs Share Property గల వధువుకి ఇండియా (or) USA లో ఉన్న వరుడు కావలెను. సంప్ర: 9866619191

★ కమ్మ : 1997 / 5'6" / MBA / Own Business / 500 Crs. ప్రాపర్టీ గల వధువుకి Well settled Business వరుడు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ : 1996 / 5'5" / DM Nuro / 200 Crs. ప్రాపర్టీ గల వధువుకి డాక్టర్స్ (or) Business వరుడు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ డైవర్సీ : 1990 / 5'5" / MS Eng / Own Pharma Company / Well Settled వధువుకి Business వరుడు కావలెను. సంప్ర: 9100404026

★ కమ్మ : 1995 / 5'5" / B.Tech / Software Job / 50 Crs ప్రాపర్టీ గల వధువుకి Software Job గల వరుడు కావలెను. సంప్ర: 9100404026

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

నేతలు... నేల విడిచి సాములు!

'ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకొని ఇప్పుడు గోసపడుతున్నారు'... అని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలందరూ తన పాలనకోసం చూస్తున్నారని కూడా ఆయన చెప్పుకొన్నారు. 'బటన్లు నొక్కడం ద్వారా ప్రజలకు డబ్బు పంచాను. అయినా నన్ను ఎందుకు ఓడించారో అర్థం కావడం లేదు. ఈవీఎంల ద్వారా ఏదో గోల్‌మాల్ చేసి ఉంటారు' అని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ఫలితాల అనంతరం ఎనిమిది నెలల క్రితం వ్యాఖ్యానించారు. "ప్రజలకు ఏం తక్కువ చేశాను. అయినా మరీ 23 సీట్లు ఇవ్వడం ఏమిటి? ఈవీఎంలను మేనేజ్ చేసి ఉంటారు" అని ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2019లో ఓటమి అనంతరం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను బట్టి అధికారంలో ఉన్నప్పుడు తాము ఏ తప్పూ చేయలేదని, ప్రజలే తమను ఓడించి తప్పు చేశారని ప్రాంతీయ పార్టీలకు నాయకత్వం వహిస్తున్న ఈ ముగ్గురు నాయకులూ అభిప్రాయపడ్డారని అర్థమవుతోంది. ఇది కచ్చితంగా ఆత్మవంచనే అవుతుంది. ప్రభుత్వాలు మారాయంటే అందుకు కారణం ఉండకుండా ఉండదు. అధికారంలోకి వచ్చినవారు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల అధినేతలు తమ చుట్టూ ఇనుప తెరలను ఏర్పాటు చేసుకొని ప్రజల మనోభావాలను తెలుసుకొనే ప్రయత్నం చేయరు. ఎవరెవరితోనో సర్వేలు చేయించుకొని అంతా బాగుందని తమను తాము మోసం చేసుకుంటుంటారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజలే తప్పు చేశారు అన్నట్టుగా వ్యాఖ్యానించడం పరిపాటిగా మారుతోంది. ఎన్నికల్లో ఓటమికి కారణాలేమిటో తెలుసుకొనే ప్రయత్నం ఎందుకు చేయరో తెలియదు. కారణాలు తెలిసినా వాటిని అంగీకరించడానికి సిద్ధపడకపోవడం వింతగానూ ఉంటుంది.

> ఒకప్పుడు మన దేశంలో లైసెన్స్‌రాజ్ ఉండేది. పరిపాలనా సంస్కరణల వల్ల అది క్రమంగా పోయింది కానీ... ఇప్పటికీ ప్రభుత్వాల వద్ద ఉండే విచక్షణాధికారాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా చట్టబద్ధంగా ఉండే వ్యవహారాల్లో కూడా ప్రజలకు ఉపశమనం లభించనప్పుడు అది గుడ్ గవర్నెన్స్ ఎలా అవుతుంది? రెవెన్యూ శాఖలో ఈ సమస్య అధికంగా ఉంది. వారసత్వంగా లభించే భూములను మ్యుటేషన్ చేయించుకోవాలన్నా లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఎందుకుంది? ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు హ్యాపీగా ఉండాలంటే ఏం చేయాలో గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఎవరికీ ఏ ఒత్తిడీ ఉండదు. అలా జరిగినప్పుడు ప్రజల నాడి తెలుసుకోవడానికి ప్రశాంత్ కిశోర్ వంటి వారి అవసరం ఉండదు. మంత్రి లోకేశ్ ఇటీవల ఢిల్లీ వెళ్లి మరీ ప్రశాంత్ కిశోర్‌ను కలిశారు. ఆ సమయమేదో పార్టీ కార్యకర్తలకు కేటాయించి ఉంటే అద్భుతమైన, నిఖార్సయిన ఫీడ్ బ్యాక్ లభించి ఉండేది కదా!

'వ్యూహాత్మక' తప్పిదాలు

2019లో చంద్రబాబు ఓడిపోవడానికి కానీ... ఆ తర్వాత కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి ఓటమికిగానీ స్పష్టమైన కారణాలు ఉన్నాయి. ఆ కారణాలు ప్రజలకు తెలుసు. 2019కి ముందు అధికారంలో ఉండిన చంద్రబాబు నేల విడిచి సాము చేశారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని పట్టించుకోలేదు. రాజకీయాన్ని విస్మరించి ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో ఘోరంగా విఫలమయ్యారు. ఈ విషయాలను తెలుగుదేశం నాయకులు అప్పట్లో బాహాటంగానే చెప్పేవారు. అయినా వాటిని అంగీకరించడానికి అప్పట్లో చంద్రబాబు సిద్ధపడలేదు. కేసీఆర్ విషయంలో కూడా ఓటమికి కారణాలు స్పష్టంగా ఉన్నాయి. అధికారం మత్తు తలకెక్కి ఆయన ప్రజలకు దూరమయ్యారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న ఎమ్మెల్యేలను సైతం మార్చకుండా ఎన్నికల్లో వారికే మళ్లీ టికెట్లు ఇచ్చారు. కేసీఆర్ అండ్ కోకు అహం తలకెక్కిందనే అభిప్రాయానికి ప్రజలు వచ్చారు. ఫలితంగా తెలంగాణ ఉద్యమ సమయంలో నెత్తిన పెట్టుకున్న ప్రజలే ఆయనను నేలకేసి కొట్టారు. అంతేగానీ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నచ్చి, అత్యాశకు పోయి కేసీఆర్‌ను ఓడించలేదు. ఇక జగన్మోహన్‌రెడ్డి విషయం అందరికీ తెలిసిందే. బటన్లు నొక్కి డబ్బులు పంచితే చాలు– తాను ఏమి చేసినా ప్రజలు పట్టించుకోరని జగన్‌రెడ్డి భావించారు. ప్రభుత్వంలో అరాచకం ప్రబలి ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. ప్రజల బాగోగులను విస్మరించి కక్ష సాధింపులకు ప్రాధాన్యతను ఇవ్వడంతో ఎన్నికలలో ఆయనను 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారు. చంద్రబాబు మరికొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉండివుంటే జగన్‌రెడ్డికి ఐదారు సీట్లకు మించి వచ్చివుండేవి కావు. ప్రజల్లో తమ పట్ల వ్యతిరేకత ఏర్పడిన విషయాన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలు ఎందుకు తెలుసుకోరో అర్థం కాదు. ఎన్నికల వ్యూహకర్తలను నియమించుకొని వందల కోట్లు తగలేసే బదులు పార్టీ కార్యకర్తల మనోభావాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తే తాము ఎక్కడ ఉన్నామో తెలిసిపోతుంది. సదరు వ్యూహకర్తలే తమను అధికారంలోకి తీసుకొస్తారని గుడ్డిగా నమ్ముతారు. 2019లో ఐ-ప్యాక్‌ను నమ్ముకున్న జగన్‌రెడ్డి 2024లో కూడా ఐ-ప్యాక్‌నే నమ్ముకొని మునిగిపోయారు. ఐ-ప్యాక్ వంటి సంస్థ తమకు దొరకనందున 2019లో ఓడిపోయామని భావించిన చంద్రబాబు 2024లో రాబిన్ శర్మ అనే ఆయనను నమ్ముకున్నారు. రాబిన్ శర్మ సేవలు అందించి ఉండకపోయినా కూటమి గెలిచేది. ఇక కేసీఆర్ ఎవరెవరితోనో సర్వేలు చేయించుకొని సంతృప్తిపడుతుండేవారు. ఆ సర్వే రిపోర్టులు చూపించి అంతా బాగుందని పార్టీ నాయకుల నోళ్లు మూయించేవారు. కర్ణాటకలో బీజేపీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ రాష్ట్రంతో సంబంధం లేని వాళ్లు కూడా ముందే చెప్పారు. అయినా, సునీల్ కనుగోలు వ్యూహం వల్లే తాము గెలిచామని కాంగ్రెస్ పార్టీ నమ్మింది. అదే నమ్మకంతో తెలంగాణలో కూడా కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చే బాధ్యతను ఆ పార్టీ పెద్దలు ఆయనకు అప్పగించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 50 సీట్ల వరకు రావచ్చునని ఆయన లెక్కలు వేసుకున్నారు కానీ, కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాల వరకు లభించే అవకాశం ఉందని గుర్తించలేకపోయారు. అభ్యర్థుల ఎంపికలో తప్పులు చేసి ఉండకపోతే కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాలు దాటి ఉండేవి. హరియాణా, మహారాష్ట్రలో ఈ సునీల్ కనుగోలు వ్యూహం ఎందుకు పనిచేయలేదో? ఎన్నికల వ్యూహాలు అవసరమేగానీ, అవి మాత్రమే ఎన్నికల్లో విజయాలను తెచ్చిపెట్టవు. ఎన్నికలు ఏవైనా ప్రజలు తప్పు చేయరు. నాయకులే తాము చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తారు. అయితే ఆ విషయం అంగీకరించే ధైర్యం కొరవడి ప్రజలే తప్పు చేశారని ఆత్మవంచన చేసుకుంటూ ఉంటారు.

ప్రస్తుత పాలకుల పరిస్థితి..

కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి ఓటమికి కారణాలు తెలిసినవే కనుక చర్వితచరణం అవసరం లేదు. ఇప్పుడు వారి స్థానంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి విషయానికి వద్దాం! 2019కి ముందు చంద్రబాబు పాలనలోని వాసనలు ఇప్పుడు కూడా వస్తున్నాయన్నది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభిప్రాయంగా ఉంది. అప్పట్లో రియల్ టైం గవర్నెన్స్, ఐవీఆర్ఎస్ సర్వే అంటూ ఆయన జపం చేసేవారు. తన పాలన పట్ల 70 శాతానికి పైగా ప్రజలు సంతృప్తితో ఉన్నారని చంద్రబాబు చెప్పుకొనేవారు. ఎన్నికల్లో మాత్రం 60 శాతం ప్రజలు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. హ్యాపీ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అంటూ కబుర్లు చెప్పేవారు. కోటి మంది జనాభా కూడా లేని దేశాలలోని పరిస్థితులను వివరించి ఆంధ్రప్రదేశ్ కూడా అలా ఉండాలని కోరుకునేవారు. దోమల నిర్మూలన అంటూ ఒక పెద్ద కార్యక్రమం నిర్వహించారు. ఇవన్నీ ప్రజలను మెప్పించలేకపోయాయి. తిన్నామా, పడుకున్నామా, లేచామా అని భావించే సమాజంలో ఉండి కూడా 'హ్యాపీ ఇండెక్స్' వంటి వాటి గురించి మాట్లాడితే ప్రజల చెవికెక్కుతుందా? గత అనుభవాలను విస్మరించి ఇప్పుడు మళ్లీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అని కలవరిస్తున్నారు. ఏఐ అంటే ఏమిటో 90 శాతం ప్రజలకు తెలియదు. వాటివల్ల కలిగే ప్రయోజనాలేమిటో అంతకంటే తెలియదు. 90 శాతానికి పైగా ప్రజలకు తెలియని అంశాన్ని పదేపదే వల్లెవేయడం వల్ల ప్రయోజనం ఏమిటో ఆయనకే తెలియాలి. ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి సంతోషంగా ఉండేందుకు ప్రతి ఆదివారం అమలు జరిగేలా ఒక కార్యక్రమం రూపొందిస్తామని చంద్రబాబు తాజాగా ప్రకటించారు. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఇప్పుడు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. కొంతమంది మినహా మెజారిటీ ప్రభుత్వ ఉద్యోగులపై పని భారం కూడా అధికంగా ఉండటం లేదు. ఆదివారం సెలవురోజున కుటుంబ సభ్యులతో సంతోషంగా ఎలా గడపాలో ప్రభుత్వ ఉద్యోగులకు తెలియదా? అందుకోసం ఒక కార్యక్రమాన్ని రూపొందించవలసిన అవసరం ముఖ్యమంత్రికి ఏమిటి? చంద్రబాబు పాలనలో సమీక్షల వల్లనే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అధిక ఒత్తిడికి గురవుతారన్న విషయం అందరికీ తెలిసిందే. ఆయన ఈ సమీక్షలు తగ్గించుకుంటే ఎవరికీ ఏ ఒత్తిడీ ఉండదు. ఉదాహరణకు, ప్రభుత్వ కార్యదర్శులతో చంద్రబాబు ఇటీవలే ఒక సమీక్ష నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ సమీక్ష రాత్రి వరకు సాగింది. దాదాపు పన్నెండు గంటల పాటు సాగిన ఈ సమీక్షలో సాధించింది ఏమిటో తెలియదు. 2019కి ముందు కూడా ఇలాంటి సమీక్షలు జరిగినప్పుడు పలువురు అధికారులు రక్తంలో చక్కెర శాతం తగ్గి ఇబ్బంది పడటం చూశాం. ఇటువంటి సమీక్షలకు సీనియర్ అధికారులు కోటూ బూటూ వేసుకొని వస్తుంటారు. ప్రొటోకాల్ ప్రకారం అలా చేయాలేమో తెలియదు. నిజానికి టై కట్టుకొని, కోటు వేసుకొని గంటలకొద్దీ సమీక్షల్లో పాల్గొనడాన్ని మించిన శిక్ష ఉండదు. అధికారులు సమీక్షలో పాల్గొంటే ఉద్యోగులు కార్యాలయాలను వదిలి వెళ్లలేరు కదా? ప్రభుత్వాలు సరైన ప్రాధాన్యాలను నిర్దేశించుకొని సత్వర నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగులపై ఒత్తిడి ఉండదు. అటు ప్రజలు కూడా సంతోషంగా ఉంటారు. పలు దేశాలలో ఉద్యోగులు పని వేళల తర్వాత ఫోన్లో కూడా అందుబాటులో ఉండరు. ఇందుకు ఆయా ప్రభుత్వాలు అనుమతిస్తాయి. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సాయంత్రం 5 గంటల తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో లైట్లు కూడా వెలిగేవి కావు. ఉద్యోగులు ఇళ్లకు వెళ్లిపోయి కుటుంబ సభ్యులతో గడిపేవారు. అయినా ప్రభుత్వ అధికారులు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి కారణాలు వేరే ఉన్నాయి. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం వంటి కారణాల వల్ల వారిలో వ్యతిరేకత ఏర్పడింది. ఉద్యోగుల కోసం హ్యాపీ సండే ప్రోగ్రాంను రూపొందిస్తామని చంద్రబాబు ప్రకటించగానే సామాన్యుడి పేరిట ఒక ప్రభుత్వ ఉద్యోగి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు ఆలోచింపజేసేలా ఉంది. "సెలవు దినాల్లో డ్యూటీ చేయనవసరం లేదని మీరు అంటున్నారు. కలెక్టర్లు, ఆపై స్థాయి అధికారులు ఆదివారాల్లో కూడా పనిచేయకపోతే మెమోలు ఇస్తామంటున్నారు. ఎప్పుడో సంగతి ఎందుకు? పంచాయతీరాజ్ శాఖ యాప్ అప్‌డేట్ చేయకపోతే మామూలుగా ఉండదని ఈ మధ్య పంచాయతీరాజ్ ఉద్యోగులకు మెసేజ్ పెట్టారు. అయ్యా చంద్రబాబు నాయుడుగారూ! ప్రజల్లో సంతృప్తి స్థాయి, అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఐవీఆర్ సిస్టమ్‌లో కాల్ చేసి ఎలా తెలుసుకుంటున్నారో... అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కాల్ చేసి వాళ్ల సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకొనే ప్రయత్నం చేయండి సార్. విద్యా శాఖలో ఒకే యాప్ తీసుకొస్తామని మంత్రి లోకేశ్‌గారు చెప్పాక ఉపాధ్యాయులందరూ సంతోషంగా ఉన్నారు. అలాగే పంచాయతీరాజ్‌లో కూడా చేయండి. వర్క్ ఫ్రం హోంలాగా వర్క్ ఫ్రం యాప్‌గా కాకుండా, పనిచేయకుండానే చేసినట్టు నమోదు చేసే 90కి పైగా యాప్‌లను వీలైనంత వరకు కుదించి... పవర్ పాయింట్లు, ఎక్సెల్ షీట్లపై పనిచేయించుకోవడం కాకుండా క్షేత్ర స్థాయిలో నిజంగా పని జరిగేలా చూడాలని విన్నపం".. ఇదీ ఆ ఉద్యోగి పోస్టు సారాంశం. వాస్తవ పరిస్థితికి ఈ పోస్టు అద్దం పడుతోంది కదా! పవర్ పాయింట్ ప్రజంటేషన్ అనే పీపీటీ వల్ల ఆత్మవంచనే మిగులుతుంది. ముఖ్యమంత్రిని సంతృప్తిపరచడానికే ఈ పీపీటీలను అధికారులు రూపొందిస్తారు. చంద్రబాబుకు టెక్నాలజీ అంటే మక్కువ కనుక ఆ దిశగానే పీపీటీలను రూపొందిస్తారు. పన్నెండు గంటల పాటు సాగిన సమీక్షా సమావేశం వల్ల సత్ఫలితాలు వచ్చాయని ఇటు ప్రజలు కానీ, అటు అధికారులు, ఉద్యోగులు చెప్పే పరిస్థితి ఉందా?

ఎక్కడుంది సంతోషం?

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేరే వ్యాపకం ఏమీ ఉండదు. ఆయనకు వేరే ధ్యాస కూడా ఉండదు. ఇంటి వ్యవహారాలను, వ్యాపారాలను ఆయన కుటుంబ సభ్యులు చూసుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులందరికీ ఈ వెసులుబాటు ఉండదు. కుటుంబ బాధ్యతలు వారికి ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులకు చట్ట ప్రకారం చెల్లించాల్సినవి సకాలంలో చెల్లిస్తూ, వారిపై అదనపు పని భారం వేయకపోతే వారు సంతోషంగానే ఉంటారు. అందుకోసం ప్రత్యేక కార్యక్రమ అవసరం ఉండదు. ఇక ప్రజల విషయానికి వస్తే, వాళ్లు సంతోషంగా ఉండాలంటే ప్రభుత్వం నుంచి వేధింపులు ఉండకుండా ఉంటే చాలు. ఒకప్పుడు మన దేశంలో లైసెన్స్‌రాజ్ ఉండేది. పరిపాలనా సంస్కరణల వల్ల అది క్రమంగా పోయింది కానీ... ఇప్పటికీ ప్రభుత్వాల వద్ద ఉండే విచక్షణాధికారాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా చట్టబద్ధంగా ఉండే వ్యవహారాల్లో కూడా ప్రజలకు ఉపశమనం లభించనప్పుడు అది గుడ్ గవర్నెన్స్ ఎలా అవుతుంది? రెవెన్యూ శాఖలో ఈ సమస్య అధికంగా ఉంది. వారసత్వంగా లభించే భూములను మ్యుటేషన్ చేయించుకోవాలన్నా లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి ఎందుకుంది? ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు హ్యాపీగా ఉండాలంటే ఏం చేయాలో గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఎవరికీ ఏ ఒత్తిడీ ఉండదు. అలా జరిగినప్పుడు ప్రజల నాడి తెలుసుకోవడానికి ప్రశాంత్ కిశోర్ వంటి వారి అవసరం ఉండదు. మంత్రి లోకేశ్ ఇటీవల ఢిల్లీ వెళ్లి మరీ ప్రశాంత్ కిశోర్‌ను కలిశారు. ఒకటి రెండు రోజులు ఢిల్లీలో గడిపారు. ఆ సమయమేదో పార్టీ కార్యకర్తలకు కేటాయించి ఉంటే అద్భుతమైన, నిఖార్సయిన ఫీడ్ బ్యాక్ లభించి ఉండేది కదా! చంద్రబాబు అండ్ కో ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకొని నేల విడిచి సాము చేసే విధానానికి స్వస్తి చెప్పడం మంచిది. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు ఇవేమీ తెలియవా?

> ప్రజల్లో తమ పట్ల వ్యతిరేకత ఏర్పడిన విషయాన్ని ప్రాంతీయ పార్టీల అధినేతలు ఎందుకు తెలుసుకోరో అర్థం కాదు. ఎన్నికల వ్యూహకర్తలను నియమించుకొని వందల కోట్లు తగలేసే బదులు పార్టీ కార్యకర్తల మనోభావాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తే తాము ఎక్కడ ఉన్నామో తెలిసిపోతుంది.



రేవంత్ పాలన... మంచీ చెడులు!

ఇప్పుడు తెలంగాణలో నెలకొన్న పరిస్థితుల విషయానికి వద్దాం! "కాంగ్రెస్ పాలనను ఏడాదిగా గమనిస్తున్నాను. నేను కొడితే మామూలుగా ఉండదు. గట్టిగా కొడతాను" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవలే రేవంత్‌రెడ్డి సర్కార్‌ను హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి కూడా ఇందుకు తగు విధంగానే స్పందించారు. 'నువ్వు గట్టిగా కొట్టేది ఏమిటి? పుల్లా – హాపా' అని వేరే అర్థంలో సెటైర్ వేశారు. ఈ సెటైర్లు వినడానికి బాగుంటాయి కానీ ప్రజలను మాత్రం సంతృప్తిపరచవు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు అవుతోంది. కేసీఆర్ అన్నారని కాదుగానీ ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ముద్ర పాలనపై ఇంకా పడలేదు. కేసీఆర్ పాలనలో ఏం జరిగింది? అని చెప్పడానికి కొన్ని మంచి పనులు ఉన్నాయి. అలాగే కొన్ని చెడ్డ పనులు కూడా ఉన్నాయి. కానీ, కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. రాజకీయ చతురత, చలోక్తులు ప్రజల కడుపు నింపవు. సమగ్ర కసరత్తు చేయకుండా కొన్ని కార్యక్రమాలను హడావిడిగా అమలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి నష్టం జరుగుతోంది. రైతు రుణ మాఫీ ఈ కోవలోకే వస్తుంది. దాదాపు రూ.25వేల కోట్ల మేర రుణ మాఫీ చేసినా ఆశించిన రాజకీయ ప్రయోజనం నెరవేరలేదు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేసింది. ఈ ప్రయోజనం పొందిన రైతులను మినహాయించి మిగతా వారికి రుణ మాఫీ చేసి ఉంటే ప్రభుత్వానికి పదివేల కోట్లకు పైగా ఆదా అయ్యేది. ఈ డబ్బుతో రైతు బంధు అమలు చేసి ఉండవచ్చు. ఇలాంటి ఫీడ్ బ్యాక్ తీసుకోకపోవడం వల్ల రైతు రుణ మాఫీ చేసి కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు. రైతులు కూడా సంతృప్తిగా లేరు. రేషన్ కార్డుల పంపిణీ వ్యవహారంలో, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు స్వీకరణలో కూడా సరైన కసరత్తు జరగలేదు. గతంలో దారిద్ర్య రేఖకు ఎగువన, దిగువన ఉన్న వారికి విడివిడిగా రేషన్ కార్డులు ఇచ్చేవారు. ఇప్పుడు అందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇస్తామన్న అభిప్రాయం కలిగించారు. దీంతో దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారు కూడా తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎన్నిక నిర్ణయించాలనే విషయంలో కూడా శాస్త్రీయత పాటించడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకోసం నిజమైన అర్హులు ఆరుగురు మాత్రమే ఉండగా 60కి పైగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రమంతటా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటే రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదు. అలాగని కొందరికి మాత్రమే ఇళ్లు కేటాయిస్తే మిగిలిన వారిలో అసంతృప్తి నెలకొంటుంది. అన్ని పథకాలనూ ఒకేసారి ప్రారంభించాలనుకుంటే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నలుగురైదుగురు మంత్రులతోనే సంప్రదింపులు చేస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మంత్రులతో ఎప్పుడైనా మాట్లాడవచ్చు! శాసనసభ్యులు, కింది స్థాయి పార్టీ నాయకుల అభిప్రాయాలు తీసుకుంటే ప్రభుత్వానికి ఉపయోగపడతాయి. మొత్తం మీద రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆశించిన మేర పనిచేయడం లేదన్న అభిప్రాయం వ్యాపిస్తోంది. ఈ వ్యతిరేక భావనను మొగ్గలోనే తొలగించని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్రతిష్ఠపాలవుతుంది. అవినీతి విషయంలో కూడా ప్రభుత్వంపై విమర్శలు మొదలయ్యాయి. కొంత మంది మంత్రులు అపరిమిత అధికారాలను అనుభవిస్తుండగా, ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యం లేకుండా పోతోందని శాసనసభ్యులు వాపోతున్నారు. ఎమ్మెల్యేలలో నెలకొన్న ఈ భావన అసంతృప్తికి దారి తీయకముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేల్కొనడం మంచిది. మొత్తంగా చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా బాలారిష్టాలను అధిగమించలేదన్న భావన విస్తృతంగా ఉంది. ఈ కారణంగా ఎన్నికల ఫలితాల తర్వాత డీలా పడిపోయిన భారత రాష్ట్ర సమితిలో భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే ప్రమాదం పొంచి ఉండటం కూడా రేవంత్ సర్కార్‌కు సవాల్ కానుంది. సుప్రీంకోర్టు తీసుకోబోయే నిర్ణయం వల్ల ఉప ఎన్నికలు వస్తే ఫలితం ఎలా ఉంటుందోనన్న బెంగ పార్టీ మారిన ఎమ్మెల్యేలలో ఉంది. ఈ కారణంగా వారిలో కొందరు ఘర్ వాపసీ ఆలోచన చేస్తున్నారు. అలా జరిగితే రేవంత్ సర్కార్‌కు నైతికంగా దెబ్బే అవుతుంది. కేసీఆర్ చెప్పుకొంటున్నట్టుగా ప్రజలు ఆయన పాలనకోసం పలవరించడం లేదుగానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాత్రం పెదవి విరుస్తున్నారు. పార్టీ ఫండ్ కోసం తెలంగాణపై ఆధారపడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానం ప్రభుత్వ పనితీరు మెరుగుకు మార్గదర్శనం చేయలేని పరిస్థితిలో ఉంది. కర్ణాటక కాంగ్రెస్ నాయకులు చేతులెత్తేయడంతో ప్రతి అవసరానికీ కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై ఆధారపడుతోంది. ఈ కారణంగా ప్రభుత్వంలో అవినీతి పెరగడానికి ఆస్కారం ఏర్పడుతోంది. గుడ్డికంటే మెల్ల నయం అన్నట్టుగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని మార్చడం ద్వారా కాంగ్రెస్ అధిష్ఠానం మంచిపని చేసింది. దీపాదాస్ ఇక్కడే మకాం వేసి మంత్రులకు ఫోన్లు చేసి 'నా వాటా ఏదీ' అని వేధిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. వీటన్నింటి నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి నాయకులకు భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి.

> 2019లో ఐ-ప్యాక్‌ను నమ్ముకున్న జగన్‌రెడ్డి 2024లో కూడా ఐ-ప్యాక్‌నే నమ్ముకొని మునిగిపోయారు. ఐ-ప్యాక్ వంటి సంస్థ తమకు దొరకనందున 2019లో ఓడిపోయామని భావించిన చంద్రబాబు 2024లో రాబిన్ శర్మ అనే ఆయనను నమ్ముకున్నారు. రాబిన్ శర్మ సేవలు అందించి ఉండకపోయినా కూటమి గెలిచేది. ఇక కేసీఆర్ ఎవరెవరితోనో సర్వేలు చేయించుకొని సంతృప్తిపడుతుండేవారు. కర్ణాటకలో సునీల్ కనుగోలు వ్యూహం వల్లే తాము గెలిచామని కాంగ్రెస్ పార్టీ నమ్మింది. అదే నమ్మకంతో తెలంగాణలో కూడా కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చే బాధ్యతను ఆ పార్టీ పెద్దలు ఆయనకు అప్పగించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 50 సీట్ల వరకు రావచ్చునని ఆయన లెక్కలు వేసుకున్నారు కానీ, కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాల వరకు లభించే అవకాశం ఉందని గుర్తించలేకపోయారు. ఎన్నికల వ్యూహాలు అవసరమేగానీ, అవి మాత్రమే ఎన్నికల్లో విజయాలను తెచ్చిపెట్టవు.

కేసీఆర్... అండ్ ఫ్యామిలీ...

ఎన్నికల ముందు వరకు కేసీఆర్ పోకడలను నిరసించిన ప్రజలు ఇప్పుడు ఆయన పట్ల ఎంతో కొంత సానుభూతి ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్ పట్ల వ్యతిరేకత క్రమంగా తొలగిపోతోంది. ఈ పరిణామం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రమాద సంకేతమే. అయితే, ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల అంత సంతృప్తిగా లేనప్పటికీ కేసీఆర్ కుటుంబ సభ్యుల పట్ల మాత్రం ఇప్పటికీ ఆగ్రహంగానే ఉన్నారు. ముఖ్యంగా కేటీఆర్, కవిత విషయంలో ప్రజల్లో అనుకూలత ఏర్పడటం లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు అపరిమిత అధికార దర్పాన్ని ప్రదర్శించడం ఇందుకు కారణం కావొచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా పరిస్థితులను మదింపు చేసుకొని విరుగుడు చర్యలు చేపట్టని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయినా ఆశ్చర్యపోవాల్సింది ఉండదు. అవతలి వైపు కేసీఆర్ నిలబడి ఉన్నంత వరకు ప్రజలకు ప్రత్యామ్నాయం ఉందనే ఉంటుంది. తెలంగాణలో అధికారంలోకి రావాలని భారతీయ జనతా పార్టీ కలలు కంటోంది కానీ కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీయనంత వరకు ఆ పార్టీకి చాన్స్ రాదు. ప్రస్తుతానికి కేసీఆర్ తాను కోల్పోయిన జవసత్వాలను తిరిగి సమకూర్చుకుంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఆయనను బలవంతుడ్ని చేస్తారా? లేక లోపాలను సరిదిద్దుకొని బలహీనుడ్ని చేస్తారా? అన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేయబోయే అడుగులను బట్టి ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ఉప ఎన్నికలు రాకుండా అడ్డుకోవడం రేవంత్ సర్కార్ ముందున్న తక్షణ కర్తవ్యం. ఏ కారణం వల్లనైనా ఉప ఎన్నికలు జరిగి ఆ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా గెలవలేని పక్షంలో కేసీఆర్ మరింత బలపడతారు. అదే జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ పోరును ఉధృతం చేస్తారు. మొత్తంగా పరిస్థితులను బేరీజు వేసుకొని 15 నెలల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించుకుంటే 'ఆల్ ఈజ్ నాట్ వెల్' అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి తాను బలపడి పార్టీని బలోపేతం చేయడానికి ఎటువంటి ఎత్తుగడలు వేస్తారో వేచి చూద్దాం!


> ప్రస్తుతానికి కేసీఆర్ తాను కోల్పోయిన జవసత్వాలను తిరిగి సమకూర్చుకుంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఆయనను బలవంతుడ్ని చేస్తారా? లేక లోపాలను సరిదిద్దుకొని బలహీనుడ్ని చేస్తారా? అన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేయబోయే అడుగులను బట్టి ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ఉప ఎన్నికలు రాకుండా అడ్డుకోవడం రేవంత్ సర్కార్ ముందున్న తక్షణ కర్తవ్యం. ఏ కారణం వల్లనైనా ఉప ఎన్నికలు జరిగి ఆ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా గెలవలేని పక్షంలో కేసీఆర్ మరింత బలపడతారు. అదే జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ పోరును ఉధృతం చేస్తారు. మొత్తంగా పరిస్థితులను బేరీజు వేసుకొని 15 నెలల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించుకుంటే 'ఆల్ ఈజ్ నాట్ వెల్' అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి తాను బలపడి పార్టీని బలోపేతం చేయడానికి ఎటువంటి ఎత్తుగడలు వేస్తారో?

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

బ్రూనో : సత్యాన్వేషణలో సజీవ స్ఫూర్తి

భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడా? భూమే సూర్యుని చుట్టూ తిరుగుతున్నదా? భూమి గుండ్రంగా ఉందా? లేక బల్లపరుపుగా ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానం అనాదిగా మతం చెప్పిందే వేదంగా సాగింది. భూమి గుండ్రంగా ఉందని, భూమే సూర్యుని చుట్టూ తిరుగుతుందని 1473–1543 మధ్యకాలంలో జీవించిన కొపర్నికస్ గుర్తించి, బైబిల్ చెప్పే విషయాలు కట్టుకథలని తేల్చాడు. దీనికి అనేక శతాబ్దాల ముందే తమకున్న అరకొర పరికరాల సాయంతో కొందరు గ్రీకు శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించారు. ఆ తర్వాత ఫిలోలేస్, అరిస్టార్కస్‌లు కూడా ఈ సిద్ధాంతాన్ని నమ్మి, ప్రవచించినా.. మతాచార్యుల కోపానికి జడిసి, తామే తప్పుడు సిద్ధాంతాలు చేసినట్టు లెంపలేసుకోవాల్సి వచ్చింది.

ఇలా లెంపలేసుకోకపోయినా తన ఖగోళ సిద్ధాంతాన్ని ప్రచురించే ధైర్యం కొపర్నికస్ కూడా చేయలేదు. తన సిద్ధాంతసారాన్ని లిఖితప్రతి రూపంలో 1514లో ఆయన బయటపెట్టాడు. "తగు నిరూపణలతో నీ సిద్ధాంతాల్ని మా వద్ద నిరూపించమ"ని పోప్ అవకాశం ఇచ్చినా, కొపర్నికస్ ధైర్యం చేయలేదు. చివరకు అతడు మరణశయ్యపై ఉండగా ఆ గ్రంథం ప్రచురితమయింది. అయితే ఆయన మరణానంతరం అది పోప్‌చే నిషేధానికి గురయింది. తర్వాత కొపర్నికస్ సిద్ధాంతాల్ని బలపరిచిన వారిని కూడా బంధించి, వేధించారు. కొందర్ని వధించారు. కొపర్నికస్ సిద్ధాంతాల్ని సమర్థించిన వారిలో ఇటలీకి చెందిన జోర్దానో బ్రూనో (1518–1600) ముఖ్యుడు. ఈ కారణంగానే ఆయన్ను అనేక సంవత్సరాలు వేధించి, చివరకు వధించారు.



బ్రూనో మతాధికారిగా జీవితం ప్రారంభించినా, ఎక్కువ కాలం అందులో ఇమడలేకపోయాడు. అతను మంచి కవి, తత్వవేత్త, మహోపన్యాసకుడు, స్వాతంత్ర్యప్రియుడు. బైబిల్‌ని పుక్కిట పురాణంగా కొట్టివేసినందుకు, కొపర్నికస్ సిద్ధాంతాన్ని బలపరిచినందుకు ఆయన్ని అరెస్టు చేయటానికి ప్రయత్నించగా, తప్పించుకొని ఎన్నో నగరాలు, దేశాలు తిరిగాడు. చివరకు ఒక కపట మిత్రుణ్ణి నమ్మి తిరిగి ఇటలీకి వెళ్లాడు. వెనిస్‌లో బ్రూనోను అరెస్టుచేసి రోమ్‌కు తీసుకువెళ్ళి అక్కడ విచారణ తంతు జరిపి సజీవ దహనం శిక్ష విధించారు. మత విశ్వాసాల్ని ధిక్కరించిన పాపి రక్తం కూడా భూమిపై పడకూడదనే భావనతో సజీవదహనం శిక్ష విధించారు.

మత విశ్వాసాల్ని వ్యతిరేకించిన రోజర్ బేకన్, పెత్రోపొంపోనాట్స్ (1462–1515) మతాచార్యులకు భయపడి వెనక్కు తగ్గినా, వారిని మతాచార్యులు కనికరించకుండా నిర్బంధించి, వారి చావుకు కారకులయ్యారు. ఫ్రాన్సుకు చెందిన బుఫాన్ అనే శాస్త్రజ్ఞుడు వృక్ష, జంతు, ప్రకృతి శాస్త్రాల్లో కొన్ని శాస్త్రీయ సత్యాలు కనుగొన్నా, చివరకు నేను చెప్పినవి తప్పు, నా తప్పిదాన్ని మన్నించమని లిఖితపూర్వకంగా పత్రం రాసి, మతాచార్యుల ఆగ్రహం నుంచి తప్పించుకున్నాడు. చివరకు గెలీలియో కూడా మతాచార్యుల ముందు తలవంచాడు. అయితే తాను చెప్పింది నిజమని కడ వరకూ నిల్చినవాడు సోక్రటీస్. ఈయనతో పోల్చదగినవాడు మానవ చరిత్రలో మరో శాస్త్రజ్ఞుడు లేడని ఎక్కువ మంది విశ్వాసం.

ఆరు సంవత్సరాల సుదీర్ఘకాలం విచారణ జరగటంతో బ్రూనో కూడా కొంత మెతకతనం ప్రదర్శించాడని నార్ల వెంకటేశ్వరరావు తన జాబాలి నాటిక ముందుమాటలో పేర్కొన్నారు. కాని "మరణ దండన పొందిన నాకంటే దాన్ని నాకు విధించిన మీరే ఎక్కువ గజగజలాడుతున్నారని" ధీరోదాత్తంగా పలికాడు బ్రూనో. విచారణ అనంతరం "నేను బలవర్మణం పొందవచ్చు. అయితే అనేక మంది జీవితాల కంటే నా మరణం ఉత్తమమైనది కాగలదు" అన్న బ్రూనో మాటలు విచారణ సమయంలో రికార్డు చేయబడ్డాయి. వీటిని బట్టి బ్రూనో వీరోచితంగానే మరణాన్ని స్వీకరించాడని, ఎవరి ముందూ తలవంచక తన విశ్వాసంపై నిలబడ్డాడని అర్థమవుతుంది. కనుకనే బ్రూనో సజీవదహనం పొందిన రోజుని (ఫిబ్రవరి 17) సత్యాన్వేషణ దినంగా ప్రకటించారు. చనిపోయే నాటికి బ్రూనో వయస్సు 52 సంవత్సరాలు. ఆయన చనిపోయిన 30 సంవత్సరాల తర్వాత అది తప్పిదంగా గుర్తించి, సజీవదహనం గావించిన స్థలంలో ఒక స్థూపాన్ని నిర్మించి, ఆయన్ను అమరజీవిగా ప్రకటించారు.

■ చెరుకూరి సత్యనారాయణ

(రేపు బ్రూనో సజీవదహనమైన రోజు, సత్యాన్వేషణ దినం)

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.2 కనిష్ఠం 18.6



సెల్.. కిల్

మొబైల్ ఫోన్లతో చితికిపోతున్న పిల్లలు, విద్యార్థులు

- హోంవర్క్ ప్రాజెక్టులకు ఎక్కువగా చరవాణుల వినియోగం
- తరగతి గదుల్లో సృజనాత్మకతను కోల్పోతున్న వైనం
- కంటి, వినికిడి సమస్యలతో సతమతం
- తల్లిదండ్రులు మందలిస్తే అఘాయిత్యాలకు పాల్పడుతున్న పరిస్థితి
- అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్‌కు ప్రమాదమంటున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో సెల్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. పెద్దల నుంచి పిల్లల వరకు ప్రతి ఒక్కరూ మొబైల్ లేనిదే రోజు గడవదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పుస్తకాలపై దృష్టి సారించాల్సిన విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు బానిసలవుతున్నారు. ప్రధానంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇచ్చే హోంవర్క్స్, ప్రాజెక్టులు, పాఠ్య పుస్తకంలోని ప్రశ్నలకు కావాల్సిన సమాధానాలను కొన్నింటిని గూగుల్‌లో వెతుకుతూ దానిపై ఆధారపడుతున్నారు. ఫలితంగా చాలామంది తమలోని సృజనాత్మకతను కోల్పోవడంతో పాటు మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. దేశవ్యాప్తంగా 14 నుంచి 16 ఏళ్లలోపు వయసు కలిగిన వారిలో 82 శాతం మంది స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్నట్లు యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ తాజా అధ్యయనంలో వెల్లడించడం ఆందోళనకరంగా మారింది. ఇలాంటి గణాంకాలు తరచూ హెచ్చరిస్తున్నప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్ల నుంచి దూరం చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేకపోతున్నారని

అనర్థాలను టీచర్లు వివరించాలి

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కూడా తమవంతు కృషిచేయాలని సైకాలజీ ప్రొఫెసర్లు సూచిస్తున్నారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలు, ప్రాజెక్టులపై అవగాహన కల్పించాలని, సెల్‌ఫోన్ సాయం లేకుండా కృత్యాలు చేయించాలంటున్నారు. మొబైల్ వాడకంతో తలెత్తే అనర్థాలను వివరించాలని, సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్ లాంటి విజ్ఞానయాత్రలకు తీసుకెళ్లడం ద్వారా వారిలో కొత్త ఉత్సాహం పెంపొందుతుందని చెబుతున్నారు.

ఆత్మహత్యల ఘటనలు



- 2021 మార్చి 23న మల్లేపల్లిలోని ఓ ప్రైవేట్ కాలేజీకి చెందిన ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థిని(17) ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో సెల్‌ఫోన్‌తో ఎక్కువ సేపు గడుపుతున్నావని కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన ఆమె కళాశాలకు వెళ్లిన తర్వాత బిల్డింగ్‌పై నుంచి దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది.
- 2023 సెప్టెంబరు 15న బంజారాహిల్స్ నూర్‌నగర్‌లోని ఓ స్కూల్‌లో 8వ తరగతి చదివే విద్యార్థిని(13) ఆత్మహత్య చేసుకుంది. సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తున్నావని తండ్రి మందలించడంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.
- 2024 మార్చి 12న మైలార్‌దేవ్‌పల్లికి చెందిన ఇర్షాద్‌ఖాన్(21) ఆత్మహత్య చేసుకున్నాడు. రోజులో ఎక్కువసేపు మొబైల్‌ఫోన్‌తో గడుపుతూ ఆడుకుంటున్నావని కుటుంబ సభ్యులు మందలించినందుకు మనస్తాపంతో ఉరేసుకున్నాడు.

- మియాపూర్ న్యూహఫీజ్‌పేటలోని మార్తాండనగర్‌లో నివసిస్తున్న శౌర్యసింగ్ (17) ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. కొంతకాలంగా మొబైల్ ఫోన్‌ను ఎక్కువగా వాడుతున్నాడు. మూడు రోజుల క్రితం తల్లి మందలించింది. మనస్తాపం చెందిన శౌర్యసింగ్ ఇంట్లో అందరూ నిద్రపోయిన తర్వాత ఉరేసుకున్నాడు.

- కండికల్‌గేట్‌కు చెందిన శివచరణ్(19) ఛత్రినాకలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. కొంతకాలంగా ఐఫోన్ కొనివ్వాలని తల్లిని కోరుతూ వస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కొన్నిరోజులపాటు ఆగాలని ఆమె కొడుకును బుజ్జగించింది. తనకు సెల్‌ఫోన్ కొనివ్వకుండా అమ్మ జాప్యం చేస్తుందని ఆవేదనకు గురైన శివచరణ్ ఈనెల 7వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సెల్‌ఫోన్ వినియోగంతో సమస్యలు

మొబైల్ ఫోన్ వాడకంతో మానసికంగా చాలా సమస్యలు వస్తాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సెల్‌ఫోన్ స్ర్కీన్‌ను గంటల కొద్దీ చూస్తుండడంతో శారీరక శ్రమతగ్గి అధిక బరువు పెరుగుతుంటారని చెబుతున్నారు. ప్రధానంగా పిల్లల్లో కంటి, వినికిడి సమస్యలు ఎక్కువగా వస్తాయని, కళ్లు పొడిబారి తలనొప్పి, పార్శ్వ నొప్పి వస్తుందంటున్నారు. రోజూ 6 గంటలకు పైగా మొబైల్ ఫోన్ వాడితే చిటికెన వేలు నొప్పిగా ఉండడంతోపాటు జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం లోపించడం, భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోతుంటారని పేర్కొంటున్నారు. స్మార్ట్‌ఫోన్‌ను అతిగా వినియోగిస్తున్న పిల్లలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండకపోతే భవిష్యత్‌లో తీవ్ర అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు. స్కూల్ నుంచి ఇంటికి రాగానే హోంవర్క్ చేయించాలని సూచిస్తున్నారు. టీచర్లు ఇచ్చే ప్రాజెక్టులపై అవగాహన కల్పిస్తూ సహకారం అందించాలంటున్నారు. ఇంట్లో పిల్లలున్నప్పుడు తల్లిదండ్రులు వీలైనంత తక్కువగా సెల్‌ఫోన్‌ను వినియోగించాలని సూచిస్తున్నారు. సెలవు రోజుల్లో పిల్లలను పార్కులకు తీసుకెళ్తే ప్రశాంతత పొందుతారని వివరిస్తున్నారు.



అదిరే.. అదిరే

కేపీహెచ్‌బీలో ఓ షో రూమ్‌లో వర్ధమాన నటీమణులు, మోడల్స్‌తో సినీనటి తేజస్వి మదివాడ సందడి చేశారు. అనంతరం ఫొటోలకు ఇలా పోజిచ్చారు.
- కేపీహెచ్‌బీ కాలనీ, ఆంధ్రజ్యోతి

గ్రేటర్ ఎన్నికలకు సిద్ధమవ్వండి

- సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలి
- మేయర్, కార్పొరేటర్లతో టీపీసీసీ చీఫ్



మహేష్‌కుమార్‌గౌడ్‌తో సమావేశమైన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏడాది తర్వాత జరిగే గ్రేటర్ ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేవిధంగా కృషి చేయాలని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం హైదర్‌గూడలోని ఎమ్మెల్యేల క్వార్టర్స్‌లో మహేష్‌కుమార్‌గౌడ్‌తో మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠమే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలపై కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేశారు. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలకు నామినేషన్ల దాఖలుకు సోమవారం

మిగతా 8వ పేజీలో..



బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

మధ్యాహ్న భోజనంలో పురుగులు

- పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా

గచ్చిబౌలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం భోజనంలో పురుగులు వస్తున్నాయని పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేశారు. శేరిలింగంపల్లి మండలం, కొత్తగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గతంలో మధ్యాహ్న భోజనం అక్షయపాత్ర ద్వారా అందజేశారు. మధ్యాహ్న భోజన బాధ్యతలను తమకు అప్పగించాలని పొదుపు సంఘాల సభ్యులు కోర్టుకు వెళ్లారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన బాధ్యతను ప్రభుత్వం పొదుపు సంఘాలకు అప్పగించడంతో జనవరి 2 నుంచి వారు ఈ రెండు పాఠశాలలతో సహా 15 పాఠశాలల్లో విద్యార్థులకు వండి వడ్డిస్తున్నారు. శనివారం ఓ విద్యార్థి భోజనం చేస్తుండగా కూర, అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థులు ధర్నాకు దిగారు. ఈ రెండు పాఠశాలల్లో ఒకే కుటుంబానికి చెందిన వారు వంట చేయడం విశేషం. కోర్టు ఆదేశాలను అనుసరించి వారికి అప్పగించినట్లు అధికారులు చెబుతున్నారు. అన్నం నల్లగా గడ్డలుగడ్డలుగా, నీళ్లచారు, రుచిగా ఉండడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా మార్పులేదని వాపోయారు. అన్నం, కూరలో పురుగుల విషయమై విద్యార్థులు మండల విద్యాధికారి, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వారు సముదాయించడంతో ఆందోళనను విరమించారు.



అన్నంలో పురుగు | పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు



పెరగని డివిజన్లు

- వాటర్‌బోర్డులో జరగని అధికార వికేంద్రీకరణ
- వినియోగదారులకు సేవలందించడంలో జాప్యం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌తో పాటు ఔటర్ పరిధిలో తాగునీటి, మురుగునీటి నిర్వహణ చేపట్టే వాటర్‌బోర్డులో అధికారాల వికేంద్రీకరణకు హంసపాదు ఎదురవుతోంది. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి అధికార వికేంద్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుండగా... వాటర్‌బోర్డులో మాత్రం భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. విస్తరిస్తున్న మహా నగరానికి అనుగుణంగా డివిజన్లు పెంచుతూ.. మెరుగైన సేవలందించకుండా... ఉన్న డివిజన్లను కుదిస్తున్నారు. గతంలో 30 డివిజన్లు ఉండగా.. పలు డివిజన్లను వివిధ విభాగాల్లో విలీనం చేశారు. ప్రస్తుతం డివిజన్లను 22కు కుదించారు. ఓ పలుకుబడి కలిగిన అధికారి కోసం మాత్రమే హఫీజ్‌పేట డివిజన్‌ను ఇటీవల రెండుగా విభజించడం చర్చనీయాశంగా మారింది. వాటర్‌బోర్డులో ఆపరేషన్ మెయింటెనెన్స్ డివిజన్లు, ప్రాజెక్టు, ట్రాన్స్‌మిషన్, ఎస్టీపీలు, ఇలా పలు విభాగాలవారీగా డివిజన్లున్నాయి. ఆపరేషన్ మెయింటెనెన్స్ డివిజన్లను పెంచాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు లేవు.

జీహెచ్‌ఎంసీలో అలా.. వాటర్ బోర్డులో ఇలా

గ్రేటర్ హైదరాబాద్‌లో మహా నగర పాలక సంస్థకు ఆరు జోన్లు, 30 సర్కిళ్లున్నాయి. గ్రేటర్‌తో పాటు

మిగతా 8వ పేజీలో..

డివిజన్లు పెంచేందుకు అవకాశాలు

ఔటర్ పరిధిలో ప్రాంతాలు విస్తారంగా ఉండడంతో డివిజన్లు పెంచడానికి అవకాశాలున్నాయి. డివిజన్లు పెంచకపోవడంతో వినియోగదారులకు సరైన సేవలు అందడం లేదు. వాటర్‌బోర్డులో వినియోగదారుల అవసరాలను పక్కన పెట్టి అనవసరపు వ్యయాలు అధికమయ్యాయనే ఆరోపణలున్నాయి. పబ్లిక్ హెల్త్ విభాగంలో డిప్యూటీ ఇంజనీర్లకు లేని సౌకర్యాలను వాటర్‌బోర్డులో అదే క్యాడర్ గల 126మంది డీజీఎంలు పొందుతున్నారు. సొంత కార్లను వినియోగిస్తూ ప్రతీ నెలా రూ.40 వేల వరకు అలవెన్స్‌లను కొందరూ తీసుకుంటున్న పరిస్థితి ఉన్నది. డీజీఎంల కార్ల అలవెన్స్ ఏడాదికి రూ.6కోట్లకు పైగా వాటర్‌బోర్డు వ్యయం చేస్తోంది. ఆర్థిక కుంగుబాటులో ఉన్న వాటర్‌బోర్డుకు అనవసరపు వ్యయాలను తగ్గించి డివిజన్లు పెంచి ఆదాయ వనరులను పెంచాలని పలువురు కోరుతున్నారు.

కలుషిత జలాలపై అధ్యయనం

- రేపు ఉన్నతస్థాయి కమిటీ దుర్గంచెరువు పరిశీలన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దుర్గం చెరువులో ఇటీవల చేపలు చనిపోతుండడంతో కలుషిత జలాలు చేరుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులో కలుషిత జలాలు చేరడంపై అధ్యయనం చేసేందుకు ఉన్నతస్థాయి కమిటీ ఈ నెల 17న పరిశీలించనుంది. ఏ ప్రాంతం నుంచి చెరువులోకి కలుషిత జలాలు వస్తున్నాయి. ప్రస్తుతం దుర్గంచెరువులో ఆక్సిజన్ స్థాయిలను కమిటీ తెలుసుకోనుంది. ఇప్పటికే వాటర్‌బోర్డు అధికారులు ఉన్నతస్థాయి కమిటీకి సమాచారం అందించినట్లు

మిగతా 6వ పేజీలో..



పోలీసులు అరెస్ట్ చేసిన స్మగ్లర్స్ (కూర్చున్న వారు), స్వాధీనం చేసుకున్న గంజాయి

15.950 కిలోల గంజాయి స్వాధీనం

- వేర్వేరు ప్రాంతాల్లో 11 మంది అరెస్ట్

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి/హైదర్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న పదకొండు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 15.950 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఒడిశా టు యూపీ, ఢిల్లీ

ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్, ఢిల్లీకి గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించారు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 3.75 లక్షల విలువైన 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు

మిగతా 7వ పేజీలో..

చల్లని ప్రయాణం..ఫుల్ డిమాండ్

- రైళ్లలో ఏసీ కోచ్‌ల రెట్టింపు
- స్లీపర్ బోగీలు తగ్గింపు
- ఆదాయం పెరిగిందంటున్న రైల్వే ఉన్నతాధికారులు

వాతావరణ మార్పుల నేపథ్యంలో వర్షాకాలం, చలికాలంలోనూ ఎండ తీవ్రతతో ఎక్కువమంది ఏసీలో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. నాన్ ఏసీలో బస్‌చార్జీ టికెట్‌కు అయ్యే ఖర్చుతో రైల్లో త్రీటైర్ ఏసీలో ప్రయాణించవచ్చు. ప్రయాణికులు చల్లని ప్రయాణంవైపే మొగ్గు చూపుతుండడంతో రైల్వే శాఖ స్లీపర్ బోగీలను తగ్గించి ఏసీ కోచ్‌లను రెట్టింపు చేసింది.



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అవసరాన్ని దక్షిణమధ్యరైల్వే సొమ్ము చేసుకుంటుందా.! 3టైర్ ఏసీలో ప్రయాణానికి పెరుగుతున్న డిమాండ్‌తో స్లీపర్ క్లాస్ బోగీల సంఖ్యను కుదిస్తోందా..! ఏసీ కోచ్‌లను పెంచడం వలన ఆదాయం పెరిగి రైల్వే గల్లాపెట్టె నిండుతోందా అంటే.. రైల్వే ఉద్యోగులు, ప్రయాణికుల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఏడాది కాలంగా దక్షిణమధ్యరైల్వే పరిధిలోని వివిధ మార్గాల్లో నడుస్తున్న రైళ్లలో స్లీపర్ కోచ్‌లు భారీగా తగ్గిపోవడం, ఏసీ కోచ్‌లు గతంలో కంటే రెట్టింపు కావడమే ఇందుకు నిదర్శనం. ఇటీవల రైల్వే బడ్జెట్ కేటాయింపుల అంశాన్ని ప్రస్తావిస్తూ రైల్వే ఉన్నతాధికారులు సైతం త్రీటైర్ ఏసీ కోచ్‌లతో రైల్వేకు ఆదాయం గణనీయంగా పెరిగినట్లుగా పేర్కొన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో వర్షాకాలం, చలికాలాల్లోనూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఎక్కువమంది ప్రయాణికులు ఏసీ ప్రయాణం వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో అధిక ఆదాయ వర్గాల వారు మాత్రమే ప్రయాణించే ఎయిర్ కండిషన్ కోచ్‌లపై ఇటీవల మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారు కూడా ఆసక్తి కనబరుస్తున్నారని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ప్రయాణికుల డిమాండ్ మేరకు ఏసీ కోచ్‌లను పెంచిన రైల్వే ఉన్నతాధికారులు స్లీపర్ క్లాస్ బోగీలను భారీగా కుదించారు. దీంతో స్లీపర్‌క్లాస్‌లో ప్రయాణించే వారికి రిజర్వేషన్ (బెర్తులు) దొరకని పరిస్థితి ఏర్పడింది.

నాన్‌ఏసీ బస్‌చార్జీతో పోల్చితే..

గత కొన్నేళ్లుగా నాన్ ఏసీ బస్‌చార్జీలు గణనీయంగా పెరుగుతుండగా, రైల్వేశాఖ మాత్రం ఏసీ, నాన్ ఏసీ టికెట్ల ధరల్లో పెద్దగా మార్పులు చేయలేదు. దీంతో నాన్‌ఏసీలో బస్‌చార్జీ టికెట్‌కు అయ్యే

మిగతా 8వ పేజీలో..

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి | రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



విమల్ 70ఎంఎం - బాలానగర్
64 channel Dolby AtmosEnjoy 4k Laser Projection Centrally Air Conditioned
మెగా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్
జగదాంబ 70ఎంఎం ఎ/సి - ఘట్‌కేసర్
సాయిపూజ 70ఎంఎం ఎ/సి - సూరారం
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70ఎంఎం - నారాయణగూడ
లక్ష్మీకళ సినిప్లెక్స్ - మూసాపేట్ | ఎ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినిప్లెక్స్ - మూసాపేట్
DEEPA ARTS

SUPER HIT నేడే చూడండి



శాంతి 70 - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట్ 11.15am
GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30
శ్రీలక్ష్మీ/ఇంద్రనాగేంద్ర ఎ/సి - కర్మన్‌ఘాట్
11.15,2.30,6.15,9.30
విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45 | మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

విజయవంతమైన 2వ వారం



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00
GEETHA FILM DISTRIBUTORS

నేడే చూడండి



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.15
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
GEETHA FILM DISTRIBUTORS



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70 - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00 | వెంకటేశ్వర 70 - గుమ్మిడిదల 11.00,2.00,6.00,9.00
DEEPA ARTS

కాంగ్రెస్‌ది దివాళాకోరు పాలన

● సీఎం మాటలకు, పాలనకు పొంతనలేదు: కిషన్‌రెడ్డి

ముషీరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, 14 నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలకు, పాలనకు పొంతన లేకుండా ఉన్నదని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి విమర్శించారు. దేశంలో మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, దివాళాకోరు పాలన కొనసాగిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. మహాకాళీ, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ పదవీ బాధ్యతల ప్రమాణ స్వీకారం ముషీరాబాద్‌లోని కమీష్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన భరత్ గౌడ్‌ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ సాధన కోసం పోరాడిన యోధుల ఆకాంక్షలు నెరవేరుతాయని అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ భరత్‌గౌడ్ కుటుంబం బీజేపీ బలోపేతానికి ఎన్నో త్యాగాలు చేసిందని కొనియాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీమంత్రి సి.కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రారావు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ గౌడ్, కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, రవిచారి, పావని వినయ్‌కుమార్, రచనశ్రీ, సికింద్రాబాద్ బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెట్రో రైల్ కారిడార్లు

● మార్చిలోగా డీపీఆర్‌లు సిద్ధం చేస్తాం: మెట్రో రైల్ ఎండీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కొత్త మెట్రో రైల్ కారిడార్లను నిర్మిస్తున్నామని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌ను పర్యావరణ హితంగా ఉండాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని చెప్పారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) గ్రీన్ తెలంగాణ సమ్మిట్-2025లో భాగంగా నిర్వహించిన గ్రీన్ క్రూసేడర్స్ కార్యక్రమంలో ఎన్వీఎస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మేడ్చల్, శామీర్‌పేట్, ఫ్యూచర్ సిటీ మార్గాలకు సంబంధించిన మెట్రో కారిడార్ల డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) మార్చి నెలాఖరులోగా సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని వెల్లడించారు. నగరంలో పలు ప్రాజెక్టులను హరితమయంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఐజీబీసీల్లో గ్రీన్ క్రూసేడర్స్‌గా నమోదు చేసుకున్న వివిధ ప్రభుత్వ ప్రైవేట్ రంగ సంస్థలకు ఎన్వీఎస్ రెడ్డి నమోదు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐజీబీసీ నేషనల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, హైదరాబాద్ చైర్మన్ శ్రీనివాసమూర్తి, క్రెడాయ్ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత జలాలపై అధ్యయనం

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. గతంలోనూ దుర్గం చెరువులో చేపలు చనిపోవడంతో పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా హైకోర్టు అప్పట్లో సుమోటాగా కేసు తీసుకుంది. చెరువులోని కాలుష్యంపై అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. నాగ్‌పూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌ఈఈఆర్‌ఐ) డైరెక్టర్ అతుల్ నారాయణ్‌ను చైర్మన్‌గా, నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి ఎం.శాంతివర్ధిని సభ్యులుగా కమిటీని నియమించారు. వీరు దుర్గంచెరువును సందర్శించి నీటి శాంపిల్స్ సేకరించారు. ఇటీవల చెరువులో చేపలు చనిపోతుండడంతో మరోసారి తనిఖీలు నిర్వహించనున్నారు.

కులగణనకు మరో అవకాశం

● సర్వేకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక కాల్ సెంటర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కులగణనలో ఇప్పటి వరకు నమోదుకానీ వారి కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111 ను ఏర్పాటు చేసింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుంది. ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు మరోసారి సర్వే నిర్వహిస్తున్నారు. కులగణనలో పేర్లు నమోదు చేసుకోని వారు మాత్రమే కాల్ సెంటర్‌కు కాల్ చేసి వారి మొబైల్ నంబర్, అడ్రస్‌తో పాటు పోస్టల్ పిన్ కోడ్ నంబర్‌ను తెలియచేయాలి. సెంటర్ కంప్యూటర్ ఆపరేటర్లకు వారు ఏమి చేయాలనే దానిపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ శనివారం అవగాహన కల్పించారు. జీహెచ్‌ఎంసీ పరిధితోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన కాల్స్ కూడా స్వీకరించి, ఆ వివరాలు సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఫార్వర్డ్ చేస్తారు. కాల్ సెంటర్‌కు వచ్చిన వివరాల ఆధారంగా ఎన్యూమరేటర్ వారి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేస్తారు. ఇప్పటి వరకు కులగణనలో వివరాలు నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

రౌడీ షీటర్ అరెస్ట్, కత్తి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్‌ను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ అన్సర్ అలియాస్ ఖయ్యూం బా(24) ఏసీ టెక్నీషియన్. పలు చోరీలు, దోపిడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ఇతడిపై గతంలోనే పోలీసులు రౌడీషీట్ తెరిచారు. నాన్‌బెయిలబుల్ వారెంట్ కూడా ఉంది. ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తూ, ఇతర రౌడీషీటర్ల నుంచి ప్రాణ రక్షణ కోసం కత్తిని వెంటపెట్టుకొని తిరుగుతున్నాడు. శుక్రవారం రాత్రి ఫలక్‌నుమా ప్రాంతంలో అన్సర్ కత్తితో తిరుగుతుండగా సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి ఫలక్‌నుమా పోలీసులకు అప్పగించారు.

15.950 కిలోల గంజాయి స్వాధీనం

(5వ పేజీ తరువాయి)

తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్లు ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని గుట్టుగా సికింద్రాబాద్‌కు తరలిస్తున్నారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉంటున్న ఉత్తరప్రదేశ్, ఢిల్లీకి చెందిన సరఫరాదారులకు సరుకును అందజేయడంతో వారు రైల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన స్మగ్లర్స్ సికింద్రాబాద్ వరకు సరుకును తీసుకొచ్చి ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్, ధనుంజయకు శనివారం అందజేశారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు బృందం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయి స్మగ్లర్స్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్ అభినందించారు.

చిక్కడపల్లిలో 8 మంది అరెస్ట్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి త్రాగడానికి గుమిగూడడంతోపాటు గంజాయి బేరాలు చేస్తున్న 8 మందిని శనివారం రాత్రి చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీక్రాస్‌రోడ్ బస్‌భవన్ ఎదురు వీధిలో రిసాలకు చెందిన మహ్మద్ సిద్దిక్‌ఖాన్(25), మహ్మద్ నాసిర్(20), మహ్మద్ సైఫ్(20), రామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ షోయబ్(25), బేగంపేటకు చెందిన పీక జతిన్(21), పీక ఆర్య(19), మహ్మద్ ఫర్దీన్(21), తిరుమలగిరికి చెందిన ఎస్ విష్ణుష్(26)లను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందంతోకలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కాగా వీరిలో అయిదుగిరిని కోర్టులో ప్రవేశ పెట్టామని మిగతా ముగ్గురికి నోటీసులు ఇవ్వడం జరిగిందని వివరించారు. వారి నుంచి 300 గ్రాముల గంజాయి, 12270రూపాయలు, 2 బైక్‌లు, 9 సెల్‌ఫోన్‌లు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ సేవించినా, విక్రయించినా కఠినచర్యలు ఉంటాయని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ హెచ్చరించారు.

కేపీహెచ్‌బీలో వ్యక్తి..

హైదర్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన సయ్యద్ సోహెల్ కేపీహెచ్‌బీలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసిపట్టుకున్నారు. అతని వద్ద నుంచి 650గ్రాముల డ్రై గంజాయి, 20ఎంఎల్ హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకుని ఎస్‌ఓటీ పోలీసులు అతనిని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెయిల్‌పై విడుదలై పరారీలో..

- **తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు రౌడీషీటర్ల అరెస్ట్**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై విడుదలపై పరారీలో ఉన్న ఇద్దరు రౌడీషీటర్లను సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. చాంద్రాయణగుట్ట, మాదన్నపేట పోలీస్టేషన్‌లలో 18 చోరీ, దాడి కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ హబీబ్ తల్హాబిన్ అబ్దుల్ ఖదీర్ అల్‌ఐదూర్ అలియాస్ హబీబ్ తల్హ బెయిల్‌పై విడుదలై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. పలు పోలీస్టేషన్‌ల పరిధిలో 7 నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. మాదన్నపేట పోలీస్టేషన్ పరిధిలో రౌడీషీటర్ కె. ఆనంద్ అగర్వాల్ అలియాస్ మహ్మద్ జోయబ్ అలియాస్ ఎలుక అలియాస్ అన్నుపై రౌడీషీటర్ భక్తియాస్ ఖురేషీ హత్యకేసుతోపాటు ఎన్‌డీపీఎస్, ఆర్మ్‌యాక్ట్ వంటి 11కేసులున్నాయి. గంజాయి కేసులో 2024 ఆగస్టులో ఇతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చినప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతడిపై 2నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. వీరిద్దరూ మాదన్నపేటలో ఉన్నట్లు సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 2.30కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఇద్దరినీ ఆయా పోలీస్‌స్టేషన్‌లకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు.

ఫోన్ హ్యాక్.. స్క్రీన్ బ్లాక్ చేసి

- **రూ.1.43 లక్షలు కొట్టేసిన సైబర్ క్రిమినల్స్**
- **కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినందుకు..**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికిన బాధితుడు.. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కాడు. అతడిని మాటలతో మాయచేసిన క్రిమినల్స్ మోసపూరిత లింక్‌లు పంపి ఫోన్ హ్యాక్ చేసి రూ. 1.43 లక్షలు కొట్టేశారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 399 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లు చూస్తే 'కుకు ఎఫ్‌ఎమ్' సబ్‌స్ర్కైబ్ నిమిత్తం డెబిట్ అయినట్లు తెలిసింది. దాంతో ఎలాగైనా డబ్బులు డెబిట్ కాకుండా ఆపేయాలని, 'కుకు ఎఫ్‌ఎమ్' కస్టమర్ కేర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. అప్పుడు అతడికి ఒక నంబర్ కనిపించింది. వారికి ఫోన్ చేసి తన సబ్‌స్ర్కైబ్‌ను తొలగించాలని కోరాడు. అందుకు అవతలి వ్యక్తి స్పందిస్తూ.. ఏ బ్యాంక్ నుంచి డబ్బులు డెబిట్ అవుతున్నాయో ఖాతా వివరాలు ఇవ్వండి అని చెప్పాడు. దాంతో బాధితుడు అతడు చెప్పినట్లు చేశాడు. తర్వాత ఒక లింక్‌ను పంపి ఓపెన్ చేసి, మీ ఖాతా నుంచి రూ.1 ట్రాన్స్‌ఫర్ చేయండి ఆ తర్వాత మేము లావాదేవీలు అన్ని ఆపేస్తామని హామీ ఇచ్చాడు. అందుకు సంబంధించిన ప్రాసెస్ అంతా వీడియో కాల్ చేసి చూపించాడు. బాధితుడు వారు చెప్పినట్లు చేశారు. తన ఖాతా నుంచి రూ. 1 డెబిట్ అయిన వెంటనే బాధితుడి ఫోన్ స్ర్కీన్ బ్లాక్ అయింది. ఫోన్ ఆన్‌లోనే ఉండడంతో బాధితుడు తన స్ర్కీన్ బ్లాక్ అయిన విషయాన్ని చెప్పగా.. కంగారు పడొద్దు. కొద్దిసేపు అలాగే అవుతుంది. కాసేపట్లో ప్రాసెస్ అయిపోతుందని నమ్మించాడు. ఆ తర్వాత ఫోన్‌లో ఎవరూ స్పందించలేదు. బాధితుడు అయోమయానికి గురయ్యాడు. సుమారు 40 నిమిషాల తర్వాత తిరిగి ఫోన్ స్ర్కీన్ ఆన్ అయింది. ఆ తర్వాత వెంటవెంటనే బ్యాంకు మెసేజ్‌లు రావడాన్ని గుర్తించి చెక్ చేయగా.. తన ఖాతా నుంచి మొత్తం రూ. 1,43,212 డెబిట్ అయినట్లు తేలింది. దాంతో హుటాహుటిన బాధితుడు బ్యాంక్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పగా.. మీరు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కడంతో వారు మీ ఖాతాలో డబ్బులు దోచేశారని చెప్పారు. బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మానసిక ఒత్తిడిని అధిగమించాలి'

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో మారుతున్న కాలంతో పాటు యువతీ, యువకుల ఆలోచనా సరళిలో మార్పు అవసరమని తెలంగాణ సైకాలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎ కరీం అన్నారు. రాజేంద్రనగర్‌లోని కో ఆపరేటివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (సీటీఐ)లో శనివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన మానసిక అవగాహన సదస్సులో పాల్గొన్న యువతీ, యువకులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. జీవితంలో విజయాలు సాధించాలంటే చేసే పనిమీద శ్రద్ధ, పట్టుదల ఉండాలన్నారు. ఆధునిక జీవన శైలికి అలవాటు పడిన యువత ఉద్వేగ నియంత్రణ కోల్పోయి మానసిక రుగ్మత వైకల్యానికి గురవుతున్నారన్నారు. యువత భావి జీవితం బాగుండాలంటే ఇతరుల మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించడానికి తగిన ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జీవన క్రియల్లో ఏర్పడే అసమానతలను తనకు తాను గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర అధికారులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత'

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సాయిబాబానగర్‌లో శనివారం జరిగిన శివాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ, నాగదేవత, ఎల్లమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజల్లో మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. నాయకులు భూషణ్, మల్లికార్జున్ శ ర్మ, రాజలింగం, మోహన్, అశోక్, బాలక్రిష్ణ, నాగేశ్వర్‌రావు, సురేశ్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్య రాకుండా చూడండి

గోషామహల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్ గోషామహల్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. శనివా రం ఆయన రెడ్‌హిల్స్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్, మేనేజర్ కులశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని పాడైన బోర్‌వెల్స్ పవర్ బోర్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. స్పందించిన జనరల్ మేనేజర్ జాన్‌షరీఫ్ మాట్లాడుతూ, సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్‌పహడ్ పాత కర్నూల్ రోడ్డు చౌరస్తా నుంచి కాటేదాన్ స్వప్న థియేటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వెలిసిన అక్రమ నిర్మాణాలను శనివారం జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ టి.వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ నేతృత్వంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కూల్చివేతలు చేపట్టారు. ఈ రహదారిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించుకున్న 68 షెడ్లను, డబ్బాలను తొలగించారు. రోడ్డును, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని డబ్బాలు, షెడ్లు వేయడంవల్ల నిత్యం ట్రాఫిక్ స్తంభించి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ కూల్చివేతలను చేపట్టినట్టు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ తెలిపారు. పాతనగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వెళ్లే ప్రయాణికులకు, కాటేదాన్ పారిశ్రామిక వాడకు వచ్చే వాహనాలకు పాత కర్నూల్ రోడ్డులో వెలసిన ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు.


ఆక్రమణలను కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు

దశలవారీగా ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

దశల వారీగా రాజేంద్రనగర్ సర్కిల్‌లోని అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ తెలిపారు. దుర్గానగర్ నుంచి పల్లెచెరువు వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించామన్నారు. ఒకటి రెండు రోజుల్లో అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఫుట్ పాత్‌లను తొలగిస్తామన్నారు. తర్వాత రాజేంద్రనగర్, బుద్వేల్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్డు పక్కన వెలిసిన డబ్బాలను తొలగిస్తామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ తెలిపారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండ ఉండాలనే ఈ కూల్చివేతలు చేస్తున్నామన్నారు.

– శ్రీధర్, ఏసీపీ, టౌన్‌ప్లానింగ్

మూట్ ట్రిబ్యునల్ పోటీలతో చట్టపర నైపుణ్యాల అభివృద్ధి

- **హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్**

బర్కత్‌పుర, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మూట్ ట్రిబ్యునల్ పోటీలు చార్టెడ్ అకౌంటెంట్ లా విద్యార్థులకు చట్టపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ 4వ మూట్ ట్రిబ్యునల్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీలో 300 మంది చార్టెడ్ అకౌంటెంట్ లా విద్యార్థులు పాల్గొన్నారు. ఆదాయ పన్ను అప్పిలియట్ ట్రిబ్యునల్ హైదరాబాద్ జ్యుడిషియల్ సభ్యులు ఎ.నర్సింహాచారి, అకౌంటింగ్ సభ్యులు మధుసూదన్ కావ్య జడ్జిలుగా వ్యవహరించారు. ఈ పోటీలను ట్రిబ్యునల్ జోన్ ఉపాధ్యక్షుడు విజయ్‌బాల్‌రావు ప్రారంభించగా జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు పతకాలు, అవార్డులను ప్రదానం చేసి మాట్లాడారు. వృత్తిపరమైన పోటీలను నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. సీఏ, లా విద్యార్థులతో పాటు నిపుణులందరికీ ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా వాదించడానికి న్యాయపరమైన చతురతను పెంపొందించడానికి మంచి అవకాశం ఇస్తుందన్నారు. మూట్ ట్రిబ్యునల్ పోటీలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందని, ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లను పెంచుతుందన్నారు. విద్యార్థులను న్యాయశాస్త్రంలో విజయవంతమైన కెరీర్‌కు సిద్ధం చేస్తుందన్నారు. విజయ్ బాల్‌రావు మాట్లాడుతూ.. పన్ను చట్టాలు సాధారణ చట్టాలు కావని టాక్స్ ఎక్స్‌పర్ట్‌గా ఎదగడానికి సీఏ, లా విద్యార్థులు సుదీర్ఘమైన శిక్షణ తీసుకోవడం అవసరమన్నారు. కొత్త పన్ను చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ పోటీల్లో 10 టీమ్‌లు పాల్గొనగా సీజేపీ కన్సల్టెంట్ స్వర్ణపతకాన్ని, శ్రీరామమూర్తి అండ్ కో సంస్థ రజత పతకాన్ని, దహిమ అండ్ కో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పోటీల ఛైర్మన్ అమృత్‌కుమార్ కోటా, అసోసియేషన్ అధ్యక్షుడు హితేష్‌జైన్, ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ వేముల, సలహాదారులు రాందేవ్‌బూత్రా, కోశాధికారి ఆశీష్ జోషి తదితరులు పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ ట్రోఫీని ప్రదానం చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి శ్రావణ్‌కుమార్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/lF2K3Pl**లో చదవండి.**
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminar**లో చూడగలరు.**
నోట్: htpps://epaper.andhrajyothy.com **లో లాగిన్ అయిన తరువాత**

ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ ఛైర్మన్ ఎం.సి.శేఖర్ తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగులకు మెరుగైన ఉపాధి లభించే ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ఆరు నెలలపాటు శిక్షణ ఉంటుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు తమ సంస్థ పక్షాన 800మంది శిక్షణ పొందారని తెలిపారు. ఫోటోగ్రఫీతో పాటు వెడ్డింగ్, ఇండస్ట్రీయల్, ఫ్యాషన్ తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ కల్పిస్తున్నట్టు తెలిపారు. మార్చి 15నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 8008021075, 7095692175 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

కూలిన నాలా పైకప్పు

- **నిర్మాణ పనులు పూర్తి కాకుండానే..**


నాలా పైకప్పు కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ లాల్‌సింగ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గోషామహల్‌లోని చాక్నవాడి నాలపైకప్పు మరోసారి కుప్పకూలింది. శనివారం రాత్రి నాలాపైనున్న రోడ్డు కుంగింది. మూడేళ్లలో నాలాపైకప్పు కూలడం ఇది ఆరోసారి. ఒకవైపు నాలాపై కప్పు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలోనే రోడ్డు పొడుగునా ఉన్న నాలాకప్పులు ఒక్కొక్కటిగా కూలిపోయాయి. శనివారం రాత్రి 7గంటల సమయంలో చాక్నవాడి నాలాపైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. దారుస్సలాం నుంచి గోషామహల్ వైపుకు వెళ్లే ప్రధాన రోడ్డుపై చాక్నవాడి మలువు వద్ద నాలా పైకప్పు నిర్మాణపనులు జరుగుతున్నాయి. నిర్మాణ పనుల్లో పాల్గొన్న కార్మికులు సాయంత్రం 6గంటలకు పని ముగించుకొని వెళ్లిపోయారు. వారు వెళ్లిన గంట వ్యవధిలోనే పైకప్పు కుప్పకూలిపోయింది.

వ్యాయామ విద్యలో సిద్దిఖ్‌కు జాతీయ అవార్డు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): అన్వర్ ఉల్ ఉలూమ్ కళాశాలలోని వ్యాయామ విద్యా విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకుడు డాక్టర్ సయ్యద్ సిద్దిక్ హసన్‌కు జాతీయ అవార్డు లభించింది. గోల్కొండలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ వ్యాయామ విద్య -స్పోర్ట్స్ సమావేశాల్లో సిద్దిఖ్‌కు ఉత్తమ వ్యాయామ విద్య అధ్యాపకుడు అవా ర్డు దక్కింది. మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా సిద్దిఖ్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.


సిద్దిఖ్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి జూపల్లి

కనుల పండువగా శ్రీవారి కల్యాణం


ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లి వెంకటేశ్వర స్వామి ఆయలంలో శనివారం స్వామి వారి పుష్కర బ్రహోత్సవాలు, కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. వందల సంఖ్యలో భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అంతకు ముందు బస్తీ పురవీధుల్లో జరిగిన ఎదుర్కోలు ఉత్సవంలో హైదర్‌గూడ ప్రణవభక్త సమాజం, ఉప్పర్‌పల్లి వీరాంజనేయ భక్త సమాజం సభ్యులు పాల్గొని భజనలు చేశారు. అలయ ధర్మకర్త, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి సామ యమునలు స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం జరిగిన గ్రామోత్సవంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు.

సీఏలో పట్టా సాధించిన అక్కాచెల్లెల్లు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ అక్కాచెల్లెల్లు, ఒకే కుటుంబానికి చెందినవారు. పేద, మధ్య తరగతి కుటుంబం, తల్లిదండ్రులకు ఇబ్బంది పెట్టకుండా మెరుగైన ఉపాధి లభించే సీఏ కోర్సును ఎంచుకొని కష్టపడి చదివారు. కాచిగూడ డివిజన్‌కు చెందిన ఎల్.రమేష్, విజయ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఎల్.మోనా, ఎల్.కేతకి చార్టర్ అకౌంట్ (సీఏ) చదవాలని నిర్ణయించుకున్నారు. నగరంలోని తపస్య కళాశాలలో సీఏలో చేరారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఈ ఇద్దరు అక్కాచెల్లెలు శనివారం జరిగిన కన్వకేషన్‌లో తపస్య కళాశాల వ్యవస్థాపకుడు ముప్పాల శ్రీధర్ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. ఈ ఇద్దరిని తల్లిదండ్రులతో పాటు పలువురు అభినందించారు.



దామోదరం సంజీవయ్యకు నివాళి


మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మసీలాల్‌షా, మైనార్టీ లింగ్విస్టిక్ సెల్ ఛైర్మన్ ప్రేమలత అగర్వాల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, పురుషోత్తమ్, కృష్ణమోహన్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు – **అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి)**

కోడి పందేల కేసులో నోటీసులు

- **నేడు వివరణ ఇవ్వనున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి!**

మొయినాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కోడి పందేల కేసు విచారణలో భాగంగా ఫాంహౌస్ యజమాని, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చిన నోటీసుకు సంబంధించి వివరణగడువు ఆదివారంతో ముగియనుంది. నోటీసు తీసుకున్న 4 రోజుల్లో సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఆదివారం నేరుగా గానీ.. తన మనుషుల ద్వారా రాత పూర్వకంగా గానీ నోటీసుకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కాగా, ఆ వివరణతో కేసు విచారణ ముందుకు సాగనుంది. శ్రీనివాస్‌రెడ్డి నేరుగా వచ్చి సమాధానం ఇస్తారా? లేదా? అనేది తేలనుంది. ఆయనకు ఇచ్చిన గడువు ఆదివారం వరకు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

పందేల నిర్వాహకుడిని కస్టడీకి ఇవ్వాలి

ఫాంహౌస్‌లో కోడి పందేలు నిర్వహించిన సూత్రధారి శివకుమార్ వర్మ అలియాస్ రాజు అలియాస్ గబ్బర్‌సింగ్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అది వచ్చే సోమవారం విచారణకు రానుంది. కోర్టు అనుమతితో శివకుమార్‌ను తమ కస్టడీకి తీసుకొని విచారిస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది. ఇక ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న కోళ్లకుసైతం సోమవారంతో విముక్తి లభించనుంది. సోమవారం కోర్టు అనుమతితో పోలీసుల అధీనంలో ఫాంహౌస్‌లో ఉన్న కోళ్లను వేలం వేయనున్నట్టు తెలిసింది. అప్పటి వరకు కోళ్లకు, కార్లకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందే.

ముగ్గురు దొంగలు అరెస్టు

కార్వాన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను లంగర్‌హౌజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీసీపీ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ప్రకారం.. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన సాయి(19), మరో నిందితుడు డేవిడ్ రాజు(19), మాగంటి సాయి (18) ముగ్గురు పాత నేరస్థులు. కొంతకాలంగా అర్ధరాత్రి సమయంలో తాళాలు పగలగొట్టి ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరిని లంగర్‌హౌజ్ పోలీసులు అనుమానాస్పదంగా లంగర్‌హౌజ్‌లో తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 13 తులాల బంగారం, 20 వెండి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఏసీపీ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళపై థర్డ్ డిగ్రీ ఉపయోగించలేదు'

కార్వాన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): లంగర్‌హౌజ్ పోలీసులపై ఓ మహిళ చేసిన ఆరోపణలను గోల్కొండ ఏసీపీ ఫయాజ్ ఖండించారు. మహిళపై థర్డ్ డిగ్రీ ఉపయోగించలేదని, కావాలనే మహిళ తప్పుడు ప్రచారం చేస్తోందని, దొంగతనం కేసులో ఓ మహిళను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించామే తప్ప ఎలాంటి థర్డ్ డిగ్రీ ఉపయోగించలేదన్నారు. కల్పన అనే మహిళ ఒక దొంగతనానికి సంబంధించిన విషయంలో బంగారం రిసీవర్‌గా తేలిందని, ఈ విషయంపై ఆమెను విచారించామన్నారు.

స్వల్ప విషయంలో కత్తితో దాడి: ఇద్దరికి గాయాలు

మదీన, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): స్వల్ప విషయంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి కత్తితో దాడి చేసి ఇద్దరిని గాయపరిచాడు. ఈ సంఘటన కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మక్కా కాలనీ బషరత్ నగర్‌లో శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో అల్తాఫ్ అనే బాలుడు అదే బస్తీలో ఉండే అమ్మమ్మ ఇంటి నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. మార్గమధ్యలో సైఫ్ అనే యువకుడు అల్తాఫ్‌ను అటకాయించి గొడవపడి బాలుడిపై చేయి చేసుకున్నాడు. ఈ విషయాన్ని తన అన్న అయిన అరాఫత్‌కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అరఫాత్ అతడి స్నేహితుడు వసీమ్‌ను వెంటబెట్టుకొని అక్కడికి వెళ్లాడు. తన తమ్ముడిని ఎందుకు కొట్టావని సైఫ్‌తో గొడవ పడ్డాడు. దీంతో సైఫ్ ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి అరఫాత్(20), అతడితోపాటు వచ్చిన వసీమ్(20)పై దాడి చేశాడు. అరఫాత్‌కు మెడపై, వసీమ్‌కు వీపుపై గాయాలయ్యాయి. విషయం తెలిసిన కాలాపత్తర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ అరాఫత్, వసీమ్‌లను స్థానిక ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడ్డ సైఫ్ అతని స్నేహితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సేవాలాల్ మహరాజ్ జయంతి


ప్రేమావతిపేట్ పార్కులో జరిగిన సేవాలాల్ జయంతి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్/చాంద్రాయణగుట్ట/మదీన/అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బంజారాల జాతి ప్రజల చైతన్యం కోసం, వారి హక్కులు, అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ కొనియాడారు. శనివారం బవానీకాలనీ, ప్రేమావతిపేట్ పార్కులో జరిగిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా బంజారాలు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానించారు.

- బుద్వేల్ శ్రీ క్రిష్ణకాలనీలో బంజార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భోగ్ బండార్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బంజార సంక్షేమ సంఘం అధ్యక్షుడు విశ్లవత్ శ్రీహరి నాయక్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..

- రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించనున్నట్లు డాక్టర్ మాలోత్ రమేష్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఆల్ ఇండియా బంజారా సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర అగ్రికల్చరల్ మిషన్ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ హాజరవుతారని తెలిపారు.


జాంబాగ్‌లో మహరాజ్ చిత్రపటానికి నివాళులర్పి కార్పొరేటర్ రాకేశ్‌జైస్వాల్, బీజేపీ ఎస్టీ మోర్చా కార్యదర్శి జగపతి నాయక్, బీజేపీ నాయకులు


బుద్వేల్ శ్రీక్రిష్ణకాలనీలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలో పాల్గొన్న బంజార నాయకుడు శ్రీహరి తదితరులు


సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలలో బంజార మహిళలు

ఫిబ్రవరి 15న సెలవు ప్రకటించడం సంతోషకరం

సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న గిరిజన, లంబాడ ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని డాక్టర్ మాలోత్ రమేష్ నాయక్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.


జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్‌లో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అఖిల భారత బంజారా సేవ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.గిరిధర్ నాయక్, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఎస్ఐ నాగరాజు, నాయకులు

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389 కె. అనిల్ కుమార్: 99854 03628

సివిల్ రైట్స్ డే ఎక్కడ..?

● జిల్లాలో కానరాని పౌరహక్కుల పరిరక్షణ సదస్సులు
● నిర్వహణలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
● నిరుపేదలకు చట్టాలపై అవగాహన కరువు
● ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. పట్టించుకోని పరిస్థితి

జిల్లాలో సివిల్ రైట్స్ డే నిర్వహణపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను బడుగు, బలహీనవర్గాల ప్రజలు పొందలేపోతున్నారు. ఇదే సమయంలో ఇతర కులాలకు చెందిన వ్యక్తుల దాడులు, దూషణలతో దళిత, గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.




హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ నెల చివరి రోజున(ఆదివారం కాకుండా) పౌరహక్కుల దినాన్ని నిర్వహించాల్సిన రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కొంతకాలంగా ఎక్కడ కూడా సదస్సులను నిర్వహించడం లేదని తెలుస్తోంది. వాస్తవంగా ప్రజలకు తమ హక్కులను తెలియజేసి వారిలో ఆత్మస్థైర్యం నింపడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జరుగుతున్న అన్యాయంపై అధికారులను ప్రశ్నించేందుకు సివిల్ రైట్స్ డేను నిర్వహిస్తుంటారు. ఈ మేరకు తహసీల్దార్లు స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశానికి సంబంధించిన ఫొటోలు, వివరాలను జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డీడీకి అందజేయాలి. జిల్లాలో ఆరు నెలలుగా సదస్సులు నిర్వహించకపోవడంతో నిమ్నజాతి వర్గాల ప్రజలు వివిధ పథకాలకు దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

కలెక్టర్ పట్టించుకోవాలి..

పౌరహక్కుల దినం నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపించాలని ఆ సంఘం నాయకులు కోరుతున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతీ పౌరుడికి తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, దీనిని గమనించి సదస్సులు ఏర్పాటు చేయాలని, నిరుపేదల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

2024లో 183 ఎస్సీ, ఎస్టీ కేసులు..

చట్టాలపై అవగాహన కరువవడంతో దళిత, గిరిజనులపై దాడులు, దూషణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇందుకు 2024లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో 183 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కావడం ఉదాహరణగా చెప్పొచ్చు. ఆయా వర్గాల ప్రజలను అకారణంగా దూషిస్తే ఎలాంటి చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందో తెలియకపోవడమే ఇందుకు నిదర్శనం. ఇదిలా ఉండగా, సివిల్ రైట్స్ డేను తప్పనిసరిగా నిర్వహించాలని ఓ వైపు ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నప్పటికీ తహసీల్దార్లు పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. కాగా, సమావేశాలు నిర్వహించిన తర్వాత వాటికి సంబంధించిన ఫొటోలు, చర్చించిన అంశాలను ఇవ్వాలని కోరుతున్నా.. ఇంతవరకు ఎవరూ ఇవ్వలేదని ఓ అధికారి తెలిపారు.



మస్తాన్‌సాయికి ముగిసిన కస్టడీ

● విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అశ్లీల వీడియోలు, ఎన్డీపీఎస్ కేసులో అరెస్టయిన మస్తాన్‌సాయిని నార్సింగి పోలీసులు మూడు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. శనివారంతో పోలీస్ కస్టడీ ముగియడంతో తిరిగి అతడికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు. పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మస్తాన్ సాయిని జైలుకు తరలించారు. నగ్నవీడియోలతో పాటు.. పలు డ్రగ్స్ కేసుల్లో నిందితుడిగా ఉండటంతో నార్సింగి పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. కాగా, కొన్ని ప్రశ్నలకు మాత్రమే ఆయన సమాధానాలు చెప్పారు. మస్తాన్‌సాయికి లావణ్య ఎలా పరిచయం అయింది మొదలు.. లావణ్య ఫిర్యాదు చేసేంత వరకు వారి మధ్య జరిగిన అన్ని విషయాలపై పోలీసులు ఆరా తీసినట్లు సమాచారం. విచారణ సమయంలో మస్తాన్‌సాయి వెల్లడించిన విషయాలను పోలీసులు రికార్డు చేశారు. అనంతరం స్టేట్‌మెంట్ ఆధారంగా ఉన్నతాధికారులతో చర్చించి పూర్తి వివరాలను న్యాయస్థానానికి సీల్డు కవర్‌లో అందజేయనున్నట్లు తెలిసింది.

నిమ్స్‌లో అరుదైన వ్యాధులపై సెన్సిటైజేషన్ వర్క్‌షాప్


నిమ్స్‌లో జరిగిన అరుదైన వ్యాధులపై సెన్సిటైజేషన్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న డైరెక్టర్ బీరప్ప, డీన్ లిజారాజశేఖర్ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు తక్కువ ఖర్చుతో చికిత్స అందించేందుకు కృషి చేస్తున్నామని నిమ్స్ డైరెక్టర్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బీరప్ప తెలిపారు. 'కేర్ ఫర్ రేర్ టు గెదర్ వుయ్ విన్' అనే పేరుతో అరుదైన వ్యాధులపై సెన్సిటైజేషన్ వర్క్‌షాప్‌ను సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ) సహకారంతో శనివారం నిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుదైన వ్యాధులకు రోగనిర్ధారణ పద్ధతులు, చికిత్స ఎంపికలు, నివారణ వ్యూహాల గురించి అవగాహన కల్పించడం, సమాచారాన్ని వ్యాప్తి చేయడం ఈ వర్క్‌షాప్ ప్రాథమిక లక్ష్యంగా పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో తెలంగాణవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి పీడియాట్రిక్స్, ప్రసూతి-గైనకాలజీ విభాగాల నుంచి నామినేట్ చేసిన అధ్యాపకులు, దాదాపు 100 మంది వైద్యులు(70 మంది నామినేట్ చేసిన ప్రతినిధులు, దాదాపు 30 మంది స్పీకర్లు/ఛైర్ పర్సన్‌లు) విద్యా చర్చలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ లిజారాజశేఖర్, సీడీఎఫ్‌డీ డయాగ్నస్టిక్ హెడ్ డాక్టర్ అశ్విన్ దలాల్, వైద్యులు ఆస్తా చుగ్, ప్రజ్ఞారంగనాథ్, షగున్ అగర్వాల్ పాల్గొన్నారు.




ఇళ్లు నేలమట్టం కావడంతో విశాలంగా కనిపిస్తున్న మూసీనది

మూసీ రివర్‌బెడ్‌లో ఇళ్లు కూల్చివేత

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ మలక్‌పేట డివిజన్ శంకర్‌నగర్, వాహెద్‌నగర్‌లలోని మూసీ రివర్‌బెడ్‌లో మార్క్ చేసిన ఇళ్లను శనివారం కూల్చేశారు. గతేడాది సెప్టెంబర్‌లో అధికారులు 290 ఇళ్లు మూసీ రివర్‌బెడ్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడ నివసిస్తున్న వారికి డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించడంతో వారంతా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. గతంలో కూలీలతో పాక్షికంగా కూల్చేసిన ఇళ్లను ఇప్పుడు యంత్రాలతో పూర్తిగా నేలమట్టం చేస్తున్నారు. దీంతో మూసీ పరివాహకం విశాలంగా కనబడుతోంది.

గ్రేటర్ ఎన్నికలకు సిద్ధమవ్వండి

(5వ పేజీ తరువాయి)

ఆఖరు కావడంతో ఎవరు నామినేషన్ వేయాలనే అంశంపై చర్చించారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా ఎవరిని ఎంపిక చేయాలనే అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని, ఇప్పటికే ఇద్దరు కాంగ్రెస్ కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేయగా.. మరికొందరు చేయాల్సి ఉంటుందని సూచించినట్లు తెలిసింది. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికకు అవసరమైతే ఎంఐఎంతో స్నేహపూర్వకంగా సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుందని, బీజేపీ, బీఆర్ఎస్‌లు సైతం పోటీపడితే ఎదుర్కోవడానికి గల అవకాశాలను కూడా చర్చించారు. సమావేశంలో కార్పొరేటర్లు బొంతు విజయలక్ష్మి, జగదీశ్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

RAMAKRISHNA 35MM ABIDS | MUKTA A2 SENSATION KHAIRATABAD | AMB CINEMAS GACHIBOWLI | PRASADS MULTIPLEX NTR GARDENS | APARNA CINEMAS NALLAGANDLA
PVR-INOX: CYBERABAD INORBIT MALL - MADHAPUR | SUJANA FORUM PRISTAGE MALL - KPHB | ICON HI-TECH - MADHAPUR | NEXT GALLERIA MALL - PANJAGUTTA | IRRAM MANZIL | MUSARAMBAGH | CENTRAL MALL - PANJAGUTTA | RK MALL - BANJARA HILLS | ATRIUM MALL - GACHIBOWLI | PRESTON PRIME - GACHIBOWLI | PRISM MALL - GACHIBOWLI | GVK ONE - BANJARA HILLS | MP MALL - KACHIGUDA | GSM MALL - MADINAGUDA | SATTVA NECKLACE MALL - KAVADIGUDA | ASHOKA - KUKATPALLI
Cinepolis: LULU MALL - KUKATPALLY | MANTRA MALL - ATTAPUR | CCPL - MALKAJGIRI | SUDHA - SHALIBANDA | DSL VIRTUE MALL - UPPAL | TNR MALL - KOMPALI
Miraj: SHALINI SIVANI - DSKN | BALANAGAR | CHNADRA NAGAR | MIYAPUR | MALKAJGIRI
Asian: CINE PLANET - KOMPALLY | CINE SQUARE - UPPAL | SIVA GANGA - DSKN | CINEPRIDE SHASHIKALA - MOOSAPET | SHA SHAENSHA - CHINTAL | M CUBE MALL - ATTAPUR | RADHIKA - KAPRA | SWAPNA - KATEDAN | MUKTA CINEMA A2 MJR CINEMAS
GACHIBOWLI | AMEERPET | SKY MALL-SANATHNAGAR | AAA CINEMAS AMEERPET
TIVOLI SECUNDERABAD | AMR MALL - MOULALI
INDRA VENKATARAMANA COMPLEX - KACHIGUDA | J PRASAD MADINAGUDA | SAI PUJA SURARAM
PVR S2 (Warangal) | ASIAN SRIDEVI MULTIPLEX (Hanamkonda, Warangal) | ASIAN USHA PRASAD (Nizamabad) | PVR VENU MALL (Nizamabad) | NATRAJ THEATRE (Nizamabad) | AVD MULTIPLEX (Mahaboobnagar) | AVD MULTIPLEX (Mahaboobnagar) | VITROSS (Miryalaguda) | ASIAN SAI RAM (Khammam) | MAHESHWARI THEATRE (Adilabad) | SVC GEMINI Manchiriyal) | MUKTA A2 CINEMAS SRINIVASA (Karimnagar) | PVR CINEMAS (Armoor) | SHETTY MULTIPLEX (Gulbarga) | INOX ORCHID MALL (Gulbarga) | INDRA CINEMAS SAPNA MALL (Bidar) | MIRAJ CINEMAS (Raichur) | YADAGIRI THEATRE (Santosh Nagar).

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

WANTED

H Senior Accountant, Jewellery Sales Executive, Collection Executive, Marketing Executive for Hotel, Interested Persons Cell: 9246597374. Interviews on 17.02.2025, 18.02.2025, 19.02.2025. Address: Divine Jewels, Near Mandir Showroom, Banjara Hills, Road No.1, Hyd. AJH-002911

H నాగోల్ లోని మా కంపెనీలో పనిచేయుటకు 10thపాసైన స్త్రీ/పు కావలెను. Age: 20పైన. SALARY - 12000 - 15000. Ph.: 9010580266, 9052977028 AJH-002912

H గుంటూరులోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవరు కావలెను. కనీసం 10 సం॥ల నుండి 15సం॥ల అనుభవం కలిగి హైఎండు కారు నడుపగల డ్రైవర్ కావలెను. సంప్ర॥ 91333 99242 AJG-330

H ఆయాలు కావలెను. జీతం: 18560/- PM (14080/చేతికి + 3840/- PF+640/- ESI). St. Aloysius High School, Chaitanyapuri 9247624861 AJH-5102

రియల్ ఎస్టేట్

H శ్రీ వైష్ణవి రియల్ ఎస్టేట్ ప్లాట్ అమ్మబడును & కొనబడును @ కొంగరకలాన్ తిమ్మాపూర్, మంగళపల్లి, బొంగులూరు-9848096123 AJH-99842

H గుంటూరు సిటీ గోరంట్ల, అంజలి, కల్పతరువు, GPR, చలపతి, జనచైతన్య మా ప్రత్యేకత, లాం, వెనిగండ్ల, అగతవరపాడు, రెడ్డిపాలెం, పెదకాని, ప్లాట్స్ అ॥, కొ॥, సంప్ర॥ 9951067888. AJG-210267

చెదలు, బొద్దింకలు నివారణ

H చెదలు, బొద్దింకలు నివారణ డోర్స్, విండోస్, కబోర్డ్స్ పౌడర్ రాలుట కొత్త ఇంటికి కెమికల్ ట్రీట్‌మెంట్ చేయబడును. నివారణ పూర్తి గ్యారంటీతో సంప్రదించండి ఫోన్: 9550446581 / 9666566081 AJH-002793

PLOT FOR SALE

H HMDA Plots for Sale at Sirimalli Colony 222, Prakash Nagar 120, Attapur 322, 450 syds.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

పెరగని డివిజన్లు

(5వ పేజీ తరువాయి)

ఔటర్ పరిధిలో సేవలందించే వాటర్‌బోర్డుకు మాత్రం ఐదు సర్కిళ్లు.. 22 ఆపరేషన్ మెయింటెనెన్స్ డివిజన్లున్నాయి. ఔటర్ పరిధి వరకు డివిజన్లను పెంచాల్సి ఉండగా.. పెంచడం లేదు. జీహెచ్ఎంసీకి చెందిన నాలుగు సర్కిళ్లు కలిపి ఒక వాటర్‌బోర్డు డివిజన్ ఉన్న పరిస్థితి ఉన్నది. దీంతో వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో తీవ్ర జాప్యమవుతోంది. వాటర్‌బోర్డులో డివిజన్ల వారీగా మంజూరు చేసిన పోస్టుల మేరకు జనరల్ మేనేజర్లు ఉన్నారు. పాలన సౌలభ్యం కోసమంటూ వాటర్‌బోర్డు సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు నాలుగేళ్ల క్రితమే ఓన్ పే కింద రాష్ట్ర ప్రభుత్వం ఆరు పోస్టులను అదనంగా మంజూరు చేస్తూ డిప్యూటీ జనరల్ మేనేజర్లకు పదోన్నతులు కల్పించి జీఎంలుగా సేవలను వినియోగించుకున్నారు. మరిన్ని పోస్టులను పెంచుకొని సేవలను విస్తృత పరిచేందుకు ఆపరేషన్ మెయింటెనెన్స్ డివిజన్లను పెంచడం లేదు.

హఫీజ్‌పేట మాత్రమే విభజన

వాటర్‌బోర్డులో హాట్ సీటుగా హఫీజ్‌పేట డివిజన్ మారింది. ఈ డివిజన్‌లో శేరిలింగంపల్లి పాత మున్సిపాలిటీ ఏరియా కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, చందానగర్, మియాపూర్, భారతీనగర్, హఫీజ్‌పేటతో పాటు రామచంద్రాపురం, పటాన్‌చెరు ఉన్నాయి. ఐటీ కారిడార్ ఉండడంతో ఈ ప్రాంతంలో పని చేసేందుకు సీజీఎం దగ్గర నుంచి మేనేజర్ల వరకు ఆసక్తి చూపుతుంటారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పైరవీలు చేసుకొని పోస్టింగ్‌లు పొందుతున్నారు. వాటర్‌బోర్డులో ఓ జనరల్ మేనేజర్ తనకున్న పలుకుబడితో హఫీజ్‌పేట రిజర్వాయర్ ప్రాంత డివిజన్‌ను రెండుగా విభజించాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దాంతో కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాలను కలిపి ఓ డివిజన్ చేయగా.. చందానగర్, మియాపూర్, భారతీనగర్, హఫీజ్‌పేట, రామచంద్రాపురం, పటాన్‌చెరుతో మరో డివిజన్ చేశారు. పలుకుబడి కలిగిన ఇంజనీర్‌కు అవకాశం కల్పించారు. ఇదే తరహాలో ఇతర డివిజన్లను ఎందుకు పెంచడం లేదని వాటర్‌బోర్డు అధికారులే వాపోతున్నారు.

18న గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యుకె, ఆస్ట్రేలియా, కెనడా, యూఎస్ఏ, యుఈఏ సహా పలు దేశాల్లోని 35కు పైగా యూనివర్సిటీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్‌ను నిర్వహించనున్నట్లు ఎస్ఐ గ్లోబల్ ఇండియా సంస్థ వెల్లడించింది. ఫిబ్రవరి 18న హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో ఉదయం 11గంటల నుంచి ఈ ఫెయిర్ ప్రారంభం కానుందని ఎస్ఐ గ్లోబల్, ఎస్ఐ యుకె ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీఅయ్యర్ తెలిపారు. ఈ సంవత్సరం ఏడు దేశాల నుంచి 35కు పైగా ప్రముఖ విశ్వవిద్యాలయాలను భారతీయ విద్యార్థుల కోసం తీసుకువచ్చామన్న ఆమె అడ్మిషన్ విధానాలు, స్కాలర్‌షిప్‌లు, వీసా అవసరాలు, ఉపాధి అవకాశాలపై ప్రత్యక్ష సమాచారం చెబుతామని తెలిపారు. ఈ ఫెయిర్‌లో యూనివర్సిటీ కాలేజ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బాత్, కింగ్స్ కాలేజ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్, ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వైకాటో, అరిజోనా స్టేట్ యూనివర్సిటీ వంటివి పాల్గొననున్నాయని తెలిపారు.

ఉభయరాష్ట్రాలు విభజించుకోలేని ఆస్తి కేవీ రమణాచారి


రమణాచారిని సన్మానిస్తున్న శంకరనారాయణ, ఓలేటి పార్వతీశం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉభయ రాష్ట్రాలు విభజించుకోలేని ఆస్తి కేవీ రమణాచారి అని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం అన్నారు. శనివారం రాత్రి త్యాగరాయగాన సభలో కమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు కేవీ రమణాచారి జన్మదిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజానికి అనుసరణీయమైన ప్రణాళికలు రూపొందించిన దార్శనికుడు అని ప్రశంసించారు. ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి డా.కేవీ కృష్ణ కుమారి మాట్లాడుతూ రమణాచారిది మాతృ హృదయం అని అభినందించారు. తొలుత ప్రముఖ హాస్యావధాని శంకరనారాయణ చేసిన రమణీయ హాస్యావధానం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రముఖులు కసిరెడ్డి వెంకటరెడ్డి, టి.గౌరీశంకర్, ఆంజనేయరాజు, త్రినాథరావు, భారతీకమలాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణాచారిని ఘనంగా సన్మానించారు.

చాలా వేగంగా మారుతోన్న ప్రపంచం

● అమల అక్కినేని



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): 'ఈ ప్రపంచం చాలా వేగంగా మారిపోతుంది. మన ఉద్దేశ్యాలను, లక్ష్యాలను పునర్ పరిశీలించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. మరీ ముఖ్యంగా జంతు సంరక్షణ పరంగా!' అని బ్లూ క్రాస్ హైదరాబాద్ ఫౌండర్, సినీనటి అమల అక్కినేని అన్నారు. యానిమల్ చారిటీ హ్యూమెన్ సొసైటీ ఇంటర్నేషనల్ ఇండియా మిషన్‌ను మెరుగ్గా కొనసాగించడం కోసం 'హ్యూమెన్ వరల్డ్ ఫర్ యానిమల్స్'గా పేరు మార్చుకున్న క్రమంలో నూతన లోగో విడుదల చేసేందుకు బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ప్రత్యేకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఆరు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పటి నుంచి జంతు సంక్షేమంలో తన ప్రయాణం ప్రారంభమైందన్నారు. బ్లూ క్రాస్ హైదరాబాద్ ప్రస్తుతం ఉన్న ప్రదేశాన్ని వేరే ప్రాంతానికి తరలించాల్సిందిగా ఇటీవల కోరారని, బహుశా కూకట్‌పల్లి శివార్లలో ప్రభుత్వం తమకు ఏదైనా ఏర్పాటు చేస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మూడు దశాబ్దాలకుపైగానూ, భారతదేశంలో దశాబ్దానికిపైగానూ సేవలందిస్తూ, గతంలో 'హ్యూమెన్ సొసైటీ ఇంటర్నేషనల్'గా గుర్తింపు పొందిన తమ సంస్థను 'హ్యూమెన్ వరల్డ్ ఫర్ యానిమల్స్'గా మార్చామని మేనేజింగ్ డైరెక్టర్ అలోక్‌పర్ణ సేన్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో పలువురు జంతుప్రేమికులు, సోషలైట్లు పాల్గొన్నారు

చల్లని ప్రయాణం.. ఫుల్ డిమాండ్

(5వ పేజీ తరువాయి)

ఖర్చు కంటే ఇంచుమించు అదే ఖర్చుతో రైల్లో ఏసీలో ప్రయాణించేందుకు వీలవుతోంది. ప్రైవేటు(నాన్‌ఏసీ) బస్సులతో చార్జీలతో పోల్చితే రైల్లో త్రీటైర్ ఏసీ చార్జీలు 2/3వంతు లేదా అంతకంటే తక్కువగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులు రైల్లో త్రీటైర్ ఏసీలో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో పలు ముఖ్యమైన రైళ్లకు స్లీపర్ క్లాస్‌లో వెయిటింగ్ లిస్టు కంటే.. త్రీటైర్ ఏసీ రిజర్వేషన్‌కు అధికంగా వెయిటింగ్ లిస్టు ఉంటుండడంతో ఆయా రైళ్లలో త్రీటైర్ ఏసీ కోచ్‌లను పెంచి, స్లీపర్‌క్లాస్ బోగీలను తగ్గించింది. హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్‌క్లాస్ బోగీలు 6 ఉండగా, ఏసీ త్రీటైర్ బోగీలు కూడా సమాన(6) స్థాయిలో ఉన్నాయి. సికింద్రాబాద్-విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ 7, త్రీటైర్‌ఏసీ 6, హౌరా వెళ్లే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో 6స్లీపర్, 6 త్రీటైర్‌ఏసీ బోగీలున్నాయి. సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ క్లాస్ బోగీలను 9కు కుదించగా, త్రీటైర్ ఏసీ బోగీలను 8కి పెంచడం విశేషం. తిరుపతి వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ బోగీలు 5 ఉండగా, త్రీటైర్ ఏసీ కోచ్‌లను 5కు పెంచారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ బోగీలు 7 ఉండగా, త్రీటైర్ ఏసీ బోగీలు ఆరు ఉన్నాయి. నగరం నుంచి ముంబై వెళ్లే హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌కు స్లీపర్ క్లాస్ బోగీలు కేవలం 2 ఉండగా, త్రీటైర్ ఏసీ బోగీలు అత్యధికంగా 7కు పెంచడం గమనార్హం.

ముఖ్యమైన రైళ్లు/ఆర్టీసీ బస్సుల్లో చార్జీల లెక్క ఇదీ..

రైలు పేరు	ఎక్కడ నుంచి ఎక్కడికి	సూపర్ లగ్జరీ బస్	ఏసీ 3టైర్ రైలు
బెంగళూరు ఎక్స్‌ప్రెస్	కాచిగూడ-ఎలహంక	800	990
చెన్నై ఎక్స్‌ప్రెస్	హైదరాబాద్-చెన్నై	1,200	1,090
మచిలీపట్నం ఎస్ఎఫ్	హైదరాబాద్-మచిలీపట్నం	600	750
నర్సపూర్ ఎక్స్‌ప్రెస్	హైదరాబాద్-నర్సపూర్	730	745
నారాయణాద్రి	సికింద్రాబాద్-తిరుపతి	800	1,045
గోదావరి	హైదరాబాద్-విశాఖపట్నం	920	1,080
ఇంటర్‌సిటీ	సికింద్రాబాద్-విజయవాడ	540	515 (ఛైర్‌కార్)



INDRA VENKATARAMANA PADMAVATHI - KACHIGUDA
MUKTA A2 RAMAKRISHNA 70MM - ABIDS
TARAKARAMA CINEPLEX - KACHIGUDA
MAHALAXMI - KOTHAPET | SREERAMANA DIGITAL - AMBERPET | PRASADS MULTIPLEX - NTR GARDENS | AMB CINEMAS - GACHIBOWLI | PVR - INOX CINEMAS: - NEXUS MALL - KUKATPALLY | IRRUM MANZIL - KHAIRTABAD|INORBIT MALL - MADHAPUR | PRESTON PRIME - GACHIBOWLI | ICON - HITECH CITY | R.K.COMPLEX - BANJARAHILLS | PLAY HOUSE HYDERABAD NEXT GALLERIA - PUNJAGUTTA | HYDERABAD NEXT GALLERIA - MOOSARAMBAGH | CENTRAL MALL - PUNJAGUTTA | PRISM MALL - GACHIBOWLI | ATRIUM MALL- GACHIBOWLI | GVK MALL - BANJARAHILLS | MAHESHWARI PARMESHWARI MALL - KACHIGUDA | GSM MALL - MIYAPUR | ASHOKA ONE MALL - KUKATPALLY | SATTVA NECKLACE MALL - KAVADIGUDA | MIRAJ CINEMAS : SHALINI SHIVANI - DILSUKHNAGAR | CENTRAL MALL - BALANAGAR | RAGHAVENDRA - MALKAJGIRI | CINETOWN - MIYAPUR | JP CINEMAS - CHANDANAGAR | CINEPOLIS: MANTRA MALL - ATTAPUR | LULU MALL - KUKATPALLY | DSL MALL - UPPAL | CCPL - MALKAJGIRI | SUDHA - SHALIBANDA | TNR NORTH CITY - KOMPALLY | ASIAN CINEMAS: CINESQUARE - UPPAL | RADHIKA - KAPRA | M CUBE MALL - ATTAPUR | MJR SQUARE - NARAPALLY | SHIVAGANGA - DILSUKHNAGAR | CINEPLANET - KOMPALLY | GPR - KUKATPALLY | LAXMIKALA CINEPRIDE - MOOSAPET | SHA SHEHENSHA - HMT ROAD CHINTAL | MUKTA A2 SENSATION - KHAIRTABAD | SWAPNA - KATEDAN | CINEMART - R.C.PURAM | CINETOWN INDRA | NAGENDRA - KARMANGHAT | J PRASAD MULTIPLEX - MADANIGUDA | TIVOLI CINEMAS - SEC'BAD | APARNA CINEMAS - NALLAGANDLA | AAA CINEMAS - AMEERPET | PLATINUM MOVIE TIME - GACHIBOWLI | PLATINUM MOVIE TIME - AMEERPET | MOVIEMAX AMR MALL - SECUNDERABAD | MOVIE TIME CINEMAS SKYMALL - ERRAGADDA X ROADS



ఎక్స్‌పీరియం ముఖద్వారం వద్ద రామ్‌దేవ్‌రావు

జపాన్ పార్కులో కొలను


సెల్ఫీ పాయింట్

బోధివృక్షం మధ్య బుద్ధుడి విగ్రహం

ఎక్స్‌పీరియం.. హైదరాబాద్‌కు ఇప్పుడొక ప్రత్యేక ఆకర్షణ. అక్కడేమున్నాయి? వేల ఏళ్ల క్రితం నాటి చెట్లు.. చెట్లేగా అనుకుంటున్నారా? అవి సాదా సీదా చెట్లు కాదు.. వాటిని కోట్లు పెట్టి కొనడానికి అనేక మంది ముందుకు వస్తున్నారు.. ముఖేష్ అంబానీ, హీరో ప్రభాస్ వంటి వారి ఇళ్లలో ఉండే 3500 ఏళ్ల క్రితం నాటి రూ.4 కోట్ల కల్పవృక్షం అక్కడ కనిపిస్తుంది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వేల వృక్ష జాతులు కనులకు విందు చేస్తాయి. అలాంటి ఎక్స్‌పీరియం రామ్‌దేవ్‌రావు అనే ఒక వ్యక్తి కల అంటే ఆశ్చర్యం వేస్తుంది. "ఇది నాకు వ్యాపారం కాదు.. నా జీవితం" అంటారాయన! అలాంటి ఎక్స్‌పీరియంలోని విశేషాలేమిటో చూద్దామా...

ఎకోఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం
అబ్బురపరిచే అద్భుత లోకం

రామ్‌దేవ్‌రావు తల్లితండ్రులది వరంగల్ జిల్లాలోని నెక్కొండ. తండ్రి నారాయణరావు అటవీ కాంట్రాక్టర్. చెట్లను నరికి అమ్మడం ఆయన పని. కానీ ఆయన ప్రకృతి అంటే మమకారం. చెట్లు నరుకుతూ ఉంటే అడవులు అంతరించిపోతాయని ఆయనకు కలత చెందారు. 80 ఎకరాలలో సొంతంగా ఒక అడవిని పెంచారు. రామ్‌దేవ్ పెరిగింది ఆ అడవిలోనే. ప్రకృతిని కాపాడాలనే ఆలోచన పుట్టింది కూడా ఆ అడవిలోనే! ఆ తర్వాత ప్రపంచంలోని అనేక దేశాలను



స్టెయిన్‌లెస్ స్టీల్‌తో మలిచిన గుర్రం

తిరిగి చెట్లను సేకరించి వాటిని మన దేశానికి తీసుకువచ్చి పెంచటం ప్రారంభించారు. ఎవ్వరి దగ్గర లేని చెట్లను అందించటం ఆయన ప్రత్యేకత. దీనితో అనేక మంది ప్రముఖులు ఆయన దగ్గర నుంచి చెట్లు కొనుగోలు చేయటం మొదలుపెట్టారు. రామ్‌దేవ్ ఆలోచన అక్కడితోనే ఆగిపోలేదు. ప్రపంచంలోనే ఎక్కడా లేనన్ని చెట్లను ఒక చోటకు తీసుకురావాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ ఆలోచనల రూపమే ఎక్స్‌పీరియం. 150 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఇలాంటి పార్కు ప్రపంచంలోనే ఎక్కడా లేదనటం అతిశయోక్తి కాదు. ఒక్కసారి ఈ పార్కులోకి అడుగుపెడితే రకరకాల మొక్కలు సందర్శకులను కళ్లు తిప్పుకోనివ్వవు. అందుకే వెయ్యిరూపాయల ఎంట్రీ టిక్కెట్టు కొని... వేల మంది ఈ ఎక్స్‌పీరియంకు వస్తున్నారు.

అన్ని వ్యాపారాలూ వదిలేసి...

మొక్కలపై ఉన్న ఆసక్తితో రామ్‌దేవ్ తన అన్ని వ్యాపారాలనూ వదిలేశారు. ప్రపంచంలో పేరొందిన నర్సరీలను చూసేందుకు ఇప్పటి వరకు 78 దేశాలు తిరిగారు. ఎక్స్‌పీరియంలోని మొక్కల విలువ కోట్లలో ఉంటే.. ఆ భూమి విలువ మాత్రం వెయ్యి కోట్లకు పైనే ఉంటుంది. "ఇంత విలువైన భూమిలో రియల్‌ఎస్టేట్ చేస్తే ఎక్కువ లాభం వస్తుంది కదా?" అని ఎవరైనా ఆయన్ని ప్రశ్నిస్తే చిన్నగా నవ్వుతారు. "ఇది నాకు హాబీ. ఇష్టమైన పని. ఉన్న వ్యాపారాలన్నీ ఎప్పుడో వదిలేశా. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎందుకు?" అంటారాయన. ఎక్స్‌పీరియం నిర్వహణకు ప్రతి నెల మూడు కోట్లకు పైనే ఖర్చు అవుతుంది. "అందుకే సందర్శకులకు టిక్కెట్టు పెడుతున్నాం. ఆదాయం కోసం కాదు" అంటారాయన.

'కల్పవృక్షం' ప్రత్యేకత!

ఇక్కడ నర్సరీలో ప్రపంచంలోనే అరుదైన కల్పవృక్షాలు ఉన్నాయి. ఇందులో 3500 సంవత్సరాల కల్పవృక్షం ప్రత్యేక ఆకర్షణ. దీని ఖరీదు అక్షరాలా రూ.4కోట్లు. ఆఫ్రికా నుంచి దీన్ని తీసుకువచ్చారు. అలాగే ఇక్కడ ఉన్న 1500 ఏళ్ల వయసుగల కల్పవృక్షాలు కూడా అందరినీ ఆకట్టుకుంటాయి. దేశంలో ఇలాంటి మొక్కలు రామ్‌దేవ్‌రావువద్ద కాకుండా ప్రముఖ పారిశ్రామిక వేత్త ముఖేష్ అంబానీ, ప్రముఖ హీరో ప్రభాస్ ఇళ్లలో మాత్రమే ఉన్నాయి. ఈ ఒక్కో కల్ప వృక్షం ఖరీదు అక్షరాల కోటి రూపాయలు. హీరో ప్రభాస్ తాను కొత్తగా కడుతున్న ఇంటి కోసం నాలుగు వృక్షాలను ఇక్కడ కొనుగోలు చేసి తీసుకు వెళ్లారు. ఈ 1500 ఏళ్ల కల్పవృక్షాలు మరో 5 వేల ఏళ్ల వరకు పెరుగుతాయని రామ్‌దేవ్ చెబుతున్నారు.

మనసు పడితే కొనేస్తారు

చెట్లు అమ్మడమే కాదు... కొనడం కూడా ఆయనకు హాబీనే. ప్రపంచంలో ఎక్కడైనా అరుదైన మొక్క కానీ, చెట్టు కానీ ఉందని తెలిస్తే అక్కడ వాలిపోతారు. చూసింది మనసుకు నచ్చితే ఎంత ఖర్చైనా దాన్ని కొనేసి ఇక్కడకు తీసుకువచ్చి తన పార్కులో పెట్టుకుంటారు. ఇలా బయట దేశాల నుంచి ఆయన కొనుగోలు చేసిన చెట్ల ఖరీదు వందల కోట్లలో ఉంటుంది. ఎక్స్‌పీరియంలో 150 ఏళ్ల వయసు ఉన్న బోధివృక్షం కనిపిస్తుంది. ఇది ఇండోనేషియాలోని జావా ద్వీపకల్పంలోనిది. దీనిని రూ.60లక్షలకు కొని ఇక్కడకు తరలించారు. ఈ చెట్టు కొమ్మలు, ఆకులను కట్ చేసి 'కమలం' ఆకారం తీసుకువచ్చి మధ్యలో బుద్ధుడి విగ్రహాన్ని పెట్టి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ చెట్టును ఇలా తీర్చిదిద్దటానికి రాందేవ్ 75 లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. 2008 చైనాలో ఒలింపిక్స్ జరిగిన సమయంలో ఓ నర్సరీ యజమాని ఒక చెట్టును ఒలింపిక్స్ చిహ్నాలతో రూపుదిద్దాడు. దీని కోసం అతను 5 ఏళ్లపాటు శ్రమించాడు. ఒలింపిక్స్ సమయంలో చైనాలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తరువాత కాలంలో ఈ చెట్టును కొనేందుకు ఎంతో మంది ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు దాన్ని రామ్‌దేవ్ 50 లక్షలకు కొనుగోలు చేశారు.



చైనా నుంచి తెచ్చిన ఒలింపిక్ వృక్షం



హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులో నిర్మించిన అతిపెద్ద ఎకో పార్క్... ఎక్స్‌పీరియంకు ఇప్పటి దాకా అయిన ఖర్చు రూ.450 కోట్లు. అర్జెంటీనా, మెక్సికో, థాయ్‌లాండ్, ఉరుగ్వే, ఇటలీ, స్పెయిన్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా, మెక్సికో మొదలైన 85 దేశాల నుంచి తెప్పించిన 25 వేలకు పైగా మొక్కలు, వృక్షాలు ఇక్కడ కనిపిస్తాయి. వీటి ధర మార్కెట్లో వేల కోట్ల రూపాయలు ఉంటుంది. ఈ పార్క్‌లో రకరకాల కార్యక్రమాలు నిర్వహించు కోవటానికి కూడా అవకాశముంది. దీనిలో 1500 మంది కూర్చోవడానికి వీలైన యాంఫీ థియేటర్ ఉంది. రూ.50 కోట్లతో నిర్మించిన గ్లో గార్డెన్ ప్రపంచంలోనే మొదటిది. సహజమైన రాతితో మలచిన తొలి బార్ కౌంటర్.. అతిపెద్దదైన స్నో పార్క్.. బాక్స్ క్రికెట్ సౌకర్యం ఇక్కడ ఉన్నాయి. అలాగే 10 వేల మంది కూర్చోవడానికి వీలైన కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు.

ఎలా తీసుకువస్తారు?

సుదూర ప్రాంతాల నుంచి వృక్షాలను శాస్త్రీయమైన పద్ధతిలో తరలిస్తారు. వీటిని బయటకు తీసే సమయంలో... మళ్లీ తిరిగి నాటే సమయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. చెట్లను వేర్లతో పాటుగా బయటకు తీసుకువచ్చి రసాయనాలతో పూత పూస్తారు. ఆ తర్వాత వాటిని తీసుకువచ్చి నాటుతారు. ఈ ప్రక్రియను చాలా జాగ్రత్తగా నిర్వహించాలి. లేకపోతే చెట్టు చనిపోయే అవకాశముంది.

సృజనాత్మకతతో...

రామ్‌దేవ్ స్వతహాగా చిత్రకారుడు. దీనితో మొక్కలను, చెట్లను ఏఏ డిజైన్లలో పెంచాలనే విషయాన్ని ఆయన నిర్ణయిస్తారు. ఇలా పుట్టిందే ప్రపంచంలో అతి పెద్ద గ్రీన్ డోమ్. అనేక చెట్ల సముదాయాలతో ఉండే ఈ గ్రీన్ డోమ్‌ను పై నుంచి చూస్తే పెద్ద గొడుగులా కనిపిస్తుంది. ఇదే విధంగా సందర్శకులకు మొక్కల వివరాలు తెలియటానికి వీలుగా స్కానింగ్ బోర్డ్‌లను ఏర్పాటు చేశారు. ఈ బోర్డులను స్కాన్ చేస్తే మొక్కల వివరాలన్నీ తెలుస్తాయి. ఆయన దూర దృష్టికి మరో నిదర్శనం- మొక్కల శ్మశానం. "ఎవరైనా చనిపోయిన తర్వాత ఒక మొక్కగా మారాలనుకుంటే వారికి ఆ అవకాశం కల్పిస్తాం. చనిపోయిన తర్వాత పార్థీవదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చి ఖననం చేసుకోవచ్చు. దానిపై వారికి నచ్చిన మొక్కను పాతి పెంచుతాం. వారి కుటుంబ సభ్యులు వచ్చి ఈ మొక్కను ఎప్పుడైనా చూడవచ్చు. నేను కూడా నా దేహంపై మొక్కను పెంచాలని నా కుటుంబ సభ్యులకు చెప్పా" అంటారు రామ్‌దేవ్.

• బి.మల్లికార్జున్
శంకర్‌పల్లి



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
జీరో డే	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 20
అమెజాన్ ప్రైమ్		
రీచర్ 3	వెబ్‌సిరీస్ (తెలుగులో)	ఫిబ్రవరి 20
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది వైట్ లోటస్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 17
ఊప్స్ అబ్ క్యా	హిందీ సిరీస్	ఫిబ్రవరి 20
ఆఫీస్	తమిళ సిరీస్	ఫిబ్రవరి 21
జీ 5		
క్రైమ్‌బీట్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 21
ఆపిల్ టీవీ ప్లస్		
సర్ఫేస్ 2	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 21

క్రైమ్ థ్రిల్లర్

ఓ క్రిమినల్ నేర సామ్రాజ్యం గురించి నిజాలను వెలికితెచ్చేందుకు ఓ జర్నలిస్ట్ చేసిన సాహసాల నేపథ్యంలో తెరకెక్కిన హిందీ వెబ్‌సిరీస్ 'క్రైమ్ బీట్'. షకీబ్ సలీం లీడ్‌రోల్ పోషించారు. సబా ఆజాద్, రాహుల్‌భట్ కీలకపాత్రలు పోషించారు. సుధీర్ మిశ్రా, సంజీవ్‌కౌల్ దర్శకత్వం వహించారు. కొన్నేళ్ల క్రితం విదేశాలకు పారిపోయిన క్రిమినల్ బిన్నీ చౌదరి స్వదేశానికి తిరిగొచ్చి అండర్‌గ్రౌండ్‌లో తలదాచుకుంటాడు. అతన్ని కనిపెట్టేందుకు అభిషేక్ సిన్హా అనే జర్నలిస్ట్ ప్రయత్నాలు ఫలించాయా? ఆ క్రిమినల్ గురించి తెలుసుకునేందుకు చేసిన పరిశోధనలో అతను ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నాడు?, వాటిని ఎలా అధిగమించాడు అనేది ఆసక్తికరంగా ఉండబోతోందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.



హిట్ ఇచ్చిన కాంబినేషన్ కోసం ఇటు ఇండస్ట్రీ, అటు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తుంటారు. ఏ ఇండస్ట్రీలో అయినా హిట్ ఇచ్చిన దర్శకులతో మరో సినిమా చేసేందుకు హీరోలు వెనుకాడరు. రీ యూనియన్‌కు రెడీ అంటూ బాలీవుడ్‌లో అలాంటి హిట్ కాంబినేషన్లు కొన్ని ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

హిట్ కాంబినేషన్ మరొక్కసారి!



కొన్నాళ్లుగా బాలీవుడ్ హీరోలు కొత్త దర్శకులతో సినిమాలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా కొత్త కాంబినేషన్లు సెట్టవుతున్నాయి. మరోవైపు గతంలో తమకు హిట్స్ ఇచ్చిన దర్శకులతోనూ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు హీరోలు. బాలీవుడ్ దర్శకుడు డేవిడ్ ధావన్, ఆయన తనయుడు వరుణ్ ధావన్ కాంబినేషన్‌లో గతంలో పలు హిట్ చిత్రాలు వచ్చాయి. కామెడీ జానర్‌లో వచ్చిన 'మై తేరా హీరో, జుడ్వా 2, కూలీ నంబర్ 1' చిత్రాలు కుటుంబ ప్రేక్షకులను అమితంగా అలరించాయి. వారి కాంబినేషన్‌లో ఈ ఏడాది మరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వరుణ్‌ధావన్ నటిస్తున్న తాజా చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'కి డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్నాడు. అక్టోబర్ 2న ఈ చిత్రం విడుదలవనుంది. ఇందులో వరుణ్‌కు జోడీగా పూజాహెగ్డే, మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు.

దుల్హనియా సిరీస్‌లో

అలాగే వరుణ్‌ధావన్- దర్శకుడు శశాంక్ ఖేతన్ కాంబినేషన్ కూడా గతంలో మంచి విజయాలను అందుకొంది. వీరిద్దరి కలయికలో 'హంప్టీ శర్మాకీ దుల్హనియా, బద్రీనాథ్ కీ దుల్హనియా' చిత్రాలు తెరకెక్కాయి. ఇప్పుడు అదే కాంబినేషన్‌లో 'సన్నీ సంస్కారీ కీ తుల్సీ కుమారి' చిత్రం తెరకెక్కుతోంది. లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. సాన్యా మల్హోత్రా కీలకపాత్ర పోషిస్తున్నారు. ఏప్రిల్ 18న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



హిట్ దర్శకులతో అక్షయ్

వరుస అపజయాలతో దెబ్బతిన్న బాలీవుడ్ విజయాల కోసం రూటు మార్చింది. ఈ మధ్య హిట్ ఫ్రాంఛైజ్‌లో చిత్రాలు తెరకెక్కించడం ద్వారా మంచి విజయాలను సొంతం చేసుకుంటోంది. అక్షయ్‌కుమార్, అర్షద్‌వార్సీ దర్శకుడు సుభాష్ కపూర్ కాంబినేషన్‌లో 'జాలీ ఎల్‌ఎల్‌బీ' ఫ్రాంఛైజీలో వచ్చిన రెండు చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. అక్షయ్, అర్షద్ ఇద్దరికీ మంచి పేరు తెచ్చాయి. ఇప్పుడు వాటికి కొనసాగింపుగా 'జాలీ ఎల్‌ఎల్‌బీ 3' చిత్రం తెరకెక్కుతోంది. ఇందులోనూ అక్షయ్‌కుమార్, అర్షద్‌వార్సీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కోర్ట్ రూమ్ డ్రామాగా తెరకెక్కుతోంది. వినోదంతోపాటు మంచి సందేశంతో ప్రేక్షకులను అలరించేందుకు ఈ కాంబినేషన్ సిద్ధమవుతోంది.



మూడోసారి నవ్వించేందుకు

బాలీవుడ్‌లో మరో సీక్వెల్ చిత్రానికి రంగం సిద్ధమైంది. హిందీ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్న కామెడీ చిత్రాల్లో 'హేరా ఫేరి' ఒకటి. ప్రియదర్శన్ దర్శకత్వంలో అక్షయ్‌కుమార్, సునీల్‌శెట్టి, పరేశ్ రావల్, టబు, ఓంపురి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆ ఏడాది సూపర్‌హిట్‌గా నిలిచింది. దానికి కొనసాగింపుగా వచ్చిన 'ఫిర్ హేరాఫేరీ' కూడా ఘన విజయాన్ని అందుకొంది. మళ్లీ ఇన్నాళ్లకు ఈ ఫ్రాంఛైజ్‌లో మూడో చిత్రం తెరకెక్కనుంది. ఇటీవల దర్శకుడు ప్రియదర్శన్ 68వ పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ అక్షయ్ పెట్టిన పోస్ట్‌కు ప్రియదర్శన్ బదులిస్తూ 'పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు అక్షయ్. బదులుగా నేను నీకో బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను. త్వరలో మనం 'హేరా ఫేరి 3' చేయబోతున్నాం. అక్షయ్, సునీల్‌శెట్టి, పరేశ్ రావల్... మీరు సిద్ధంగా ఉన్నారా' అంటూ ట్వీట్ చేశారు. అలాగే ప్రియదర్శన్, అక్షయ్ కలయికలో తెరకెక్కుతోన్న 'బూత్ బంగ్లా' చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

మరో హిట్ కోసం

'జరా హట్కే జరా బచ్కే' చిత్రం సూపర్‌హిట్ అయిన తర్వాత దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌తో విక్కీ కౌశల్ మరో చిత్రం చేస్తున్నారు. ఈ కాంబినేషన్‌ల్ ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఛావా'. ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. రష్మిక మందన్న కథానాయికగా నటించిన ఈ చిత్రానికి ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందించారు.



ప్రెజర్ కుక్కర్‌ని ఉపయోగిస్తున్నారా..!

వంట త్వరగా పూర్తి కావడంతోపాటు గ్యాస్ ఆదా అవుతుందని అందరూ ప్రెజర్ కుక్కర్లనే ఉపయోగిస్తున్నారు. కుక్కర్‌ని వాడేటప్పుడు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం!

- కుక్కర్‌లో కనీసం రెండు గ్లాసుల నీళ్లు పోసి... ఆహార పదార్థాలు వేసిన గిన్నె అమర్చాలి. ఈ గిన్నెలో కూడా తగినన్ని నీళ్లు పోసి మూతపెట్టిన తరవాతనే కుక్కర్ మూత బిగించి విజిల్ పెట్టాలి. కుక్కర్‌లో నీళ్లు తక్కువైతే అది మాడిపోతుంది. గిన్నెలోని పదార్థాలకు నీళ్లు చాలకపోతే అవి ఉడకవు.
- కుక్కర్‌లో నేరుగా పప్పు, కూరగాయలు వేసి ఎక్కువ నీళ్లు పోసి పెద్ద మంట మీద ఉడికిస్తే వాటి నుంచి అధికంగా నురగ, ఆవిరి వస్తాయి. ఆవిరి బయటికి వచ్చే మార్గంలో ఆహార పదార్థాలు పొంగి ఇరుక్కుంటే విజిల్ మోగక కుక్కర్ పేలిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే మంట మధ్యస్థాయిలో ఉండేలా చూసుకోవాలి. కుక్కర్ మూతపై ఉండే విజిల్, ఆవిరి వెలువడే రంధ్రాలను తరచూ శుభ్రం చేస్తూ ఉండాలి.



- కుక్కర్ మూతలో రబ్బర్ గ్యాస్కెట్.... సరిగా ఇమిడి ఉండేలా చూసుకోవాలి. వదులుగా మారినా, అక్కడక్కడా పగిలినట్లు కనిపించినా వెంటనే దాన్ని మార్చాలి. లేదంటే కుక్కర్‌లోని ఆవిరి మొత్తం బయటికి వచ్చేస్తుంది. పదార్థాలు సరిగా ఉడకవు. గ్యాస్ వృథా అవుతుంది.
- కుక్కర్ హ్యాండిల్‌కు ఉండే స్క్రూ తరచూ వదులుగా మారుతూ ఉంటుంది. దీనిని ఎప్పటికప్పుడు పరిశీలించి బిగిస్తూ ఉండాలి. లేదంటే వంట పూర్తయ్యాక కుక్కర్ మూత తీయడం కష్టమవుతుంది.
- కుక్కర్‌లో పరిమితి ప్రకారం ఆహార పదార్థాలు వేసి వాటికి కావాల్సిన నీటిని మాత్రమే చేరిస్తే చక్కగా ఉడుకుతాయి. రుచిగా ఉంటాయి కూడా!

నేటి నుంచి పెద్దగట్టు జాతర

పెద్దగట్టుకు చేరుకున్న మకరతోరణం

- 10లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

సూర్యాపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలోని దురాజ్‌పల్లిలో లింగమంతుల స్వామి పెద్దగట్టు (గొల్లగట్టు) జాతర ఆదివారం అర్ధరాత్రి ప్రారంభంకానుంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని గొల్లబజార్ నుంచి మకరతోరణాన్ని యాదవ కుల సంప్రదాయాల ప్రకారం శోభాయాత్రతో శనివారం సాయంత్రం పెద్దగట్టుకు చేర్చారు. దిష్టి పూజ తర్వాత సూర్యాపేట మండలం కేసారం గ్రామంలోని మెంతబోయిన వారి కుటుంబాల ఆధ్వర్యంలో 15 రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న దేవరపెట్టె ఆదివారం అర్ధరాత్రి భేరీల చప్పుళ్లు, కఠారీ విన్యాసాలు, ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో వేలాది భక్తుల సమక్షంలో గుట్టపైకి చేరుకుంటుంది. దీంతో జాతర ప్రారంభమవుతుంది. జాతర ప్రారంభమైన తర్వాత భక్తులు బోనాలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పిస్తారు. గంపల ప్రదర్శన తర్వాత సౌడమ్మ అమ్మవారికి గొర్రెలను, మేకలను బలి ఇస్తారు. కోరిన కోర్కెలు తీర్చాలని వేడుకుంటారు. రాష్ట్రం నుంచేగాక ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భక్తులు ఈ జాతరకు వస్తారు. జాతరకు 10లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా చేస్తున్నారు. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ జాతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. గుట్టపైన వేలాది గొర్రెలు బలి ఇచ్చిన రక్తాన్ని పీల్చుకునేందుకు జెట్టింగ్ మిషన్లు ఏర్పాటు చేశారు. పెద్దగట్టు సమీపంలోని చెరువు నిండుగా ఉండడంతో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. 1500 మందికి పైగా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. 60 సీసీ కెమేరాలు, నాలుగు డ్రోన్ల సాయంతో జాతరను నిత్యం పర్యవేక్షించనున్నారు.





సూర్యాపేట జిల్లాకేంద్రం నుంచి మకరతోరణాన్ని పెద్దగట్టుకు తీసుకొస్తున్న వల్లపు వంశస్థులు

బెంబేలెత్తిస్తున్న బెబ్బులి!



- ఉమ్మడి వరంగల్ నాలుగు జిల్లాల పరిధిలో కదలికలు
- భయంతో వణుకుతున్న అటవీ గ్రామాల ప్రజలు
- పులిజాడను గుర్తించేందుకు రంగంలోకి అటవీ అధికారులు



పీరాపూర్ అడవుల్లో పులి జాడ కోసం వెతుకుతున్న అధికారులు; ఇన్‌సెట్‌లో పులి అడుగులు

ఐనవోలు, భూపాలపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ పరిధిలోని ములుగు, మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో పెద్దపులి సంచారం అటు ప్రజలు ఇటు అధికారులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. ఆ పరిసరాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నెలన్నర క్రితం ఛత్తీస్‌గడ్ -తెలంగాణ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతం గుండా ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించినట్టుగా భావిస్తున్న పెద్దపులి ఆ తర్వాత భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా వైపు వెళ్లినట్లు గుర్తించారు. అయితే తాజాగా భూపాలపల్లి జిల్లా మహాదేవపూ ర్ అటవీ రేంజ్ పరిధిలోని కాటారం మండలం నస్తురుపల్లి ప్రాంతంలో దాని జాడలు కనిపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దా ని కాలి గుర్తులు స్పష్టంగా ఉండడంతో వచ్చింది పెద్దపులేనని అధికారులు ధ్రువీకరించు కున్నారు. భూపాలపల్లి జిల్లా అటవీ అధికారి నవీన్ రెడ్డి నేతృత్వంలో పెద్దపులి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. పులి సంచరించిన ప్రాంతంతోపాటు పరిసరాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు హైదరాబాద్ నుంచి టైగర్ ట్రాకర్స్‌ను రప్పించారు. భయంతో ప్రజలు పెద్దపులికి ప్రాణహాని తలపట్టే ప్రమాదం పొంచి ఉండడంతో అధికారులు శాస్త్రీయ పద్ధతుల్లో గాలింపు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో జంతువుల వేటగాళ్ల బెడద అధికంగా ఉండడంతో పెద్దపులి ఈ ప్రాంతంలోనే ఉంటే దానికి హాని జరగొచ్చని భావిస్తున్నారు. అయితే పలుచోట్ల పులి సంచరించిన ఆనవాళ్లు కనిపించినా జంతువులపై లేదా మనుషులపై అది దాడి చేసిన ఘటనలు ఎక్కడా జరగలేదు. పలుచోట్ల గుర్తించిన పాదముద్రలు ఒకే పులికి సంబంధించినవా అన్న విషయంలో మొదట్లో కొంత సందిగ్ధం ఏర్పడినా ఈ ఐదు జిల్లాల్లో సంచరించింది ఒకటే పులి అని స్టేట్ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎల్.మేరూ సింగ్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పులుల మనుగడకు అనుకూలమైన పరిస్థితులు మెరుగవ్వడంతో పెద్ద పులుల సంచారం కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు.

చిత్రజ్యోతి


SINCE 1965

ఖరీదైన కానుక



నందమూరి బాలకృష్ణ నటించిన 'డిక్టేటర్', 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకూ మహారాజ్' చిత్రాలకు తమన్ సంగీత దర్శకత్వం వహించారు. ఆ చిత్రాల విజయంలో సంగీతం ప్రముఖ పాత్ర వహించిందనే చెప్పాలి. ఇలా వరుసగా తన చిత్రాలకు పని చేస్తూ ప్రతిభ చాటుతున్న తమన్‌కు శనివారం ఓ ఖరీదైన కానుక అందించారు బాలకృష్ణ. పోర్షే కారు కొనుగోలు చేసి అతనికి ఇచ్చారు. హైదరాబాద్ క్యాన్సర్ ఆస్పత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ విషయం తెలియజేస్తూ 'తమన్ నాకు తమ్ముడితో సమానం. వరుసగా నాలుగు హిట్స్ ఇచ్చిన తమ్ముడికి ప్రేమతో కారు బహుమతిగా ఇచ్చా. భవిష్యత్‌లోనూ మా ప్రయాణం ఇలాగే కొనసాగుతుంది' అన్నారు బాలకృష్ణ.

వీరమల్లు ప్రేమగీతం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'హరి హర వీరమల్లు' చిత్రబృందం స్పెషల్ అప్డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రం నుంచి 'కొల్లగొట్టినాదిరో' అంటూ సాగే ప్రేమగీతాన్ని ఈ నెల 24న విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో పవన్ కల్యాణ్, కథానాయిక నిధి అగర్వాల్ లుక్ ఆకట్టుకుంది. ఇందులో పవన్ కల్యాణ్ పోరాట యోధుడిగా కనిపించనున్నారు. ఆయన ప్రియురాలిగా యువరాణి పాత్రలో నిధి నటిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశలో ఉంది. మార్చి 28న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏ. ఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. దర్శకత్వ బాధ్యతల నుంచి క్రిష్ వైదొలిగాక జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్నారు.


దర్శకుడిగా గొప్ప గౌరవాన్నిచ్చింది



చందు మొండేటి

"తండేల్ సినిమ పైరసీ బారినపడిందని తెలియగానే గుండెల్లో గునపంతో పొడిచినట్లనిపించింది. మన పిల్లల్ని ఎవరో కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లిపోయినంత బాధగా అనిపించింది' అని దర్శకుడు చందూ మొండేటి అన్నారు. నాగచైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా ఆయన తెరకెక్కించిన 'తండేల్' గత వారం విడుదలై ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చందూ మీడియాతో మాట్లాడారు. 'తండేల్' చిత్రం ఘన విజయం దర్శకుడిగా తనకు గొప్ప గౌరవాన్ని అందించిందని చెప్పారు. "తండేల్' బయోపిక్ కాదు. వాస్తవిక సంఘటనల ఆధారంగా కాల్పనిక ప్రేమగాథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. అందుకే నిజజీవితంలోని వ్యక్తుల పేర్లను సినిమాలోని పాత్రలకు పెట్టలేదు. ప్రతి సన్నివేశానికి ప్రేక్షకులు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. చైతూ చాలా సిన్సియర్. ఆయన కష్టానికి తగిన ఫలితం దక్కి, నటుడిగా చక్కటి ప్రశంసలు అందుకుంటున్నారు. హీరోగా నాగచైతన్యకు తొలి రూ. 100 కోట్ల సినిమా ఇచ్చినందుకు మా టీమ్‌తో పాటు నాకూ ఆనందంగా ఉంది. 'ఇది ఒక దర్శకుడి సినిమా అని రాఘవేంద్రరావు గారు ప్రశంసించడం మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది. తెనాలి రామకృష్ణుని పాత్రలో కూడా ఆయన అద్భుతంగా నటించగలరని నా నమ్మకం. అందుకే అలాంటి సినిమా చైతూతో చేయాలని దర్శకుడిగా, స్నేహితుడిగా నా కోరిక. ప్రస్తుతం సూర్యతో ఓ సినిమా కోసం చర్చలు జరుగుతున్నాయి. దాని తర్వాత 'కార్తికేయ 3' ఉంటుంది" అని చందు చెప్పారు.

సాంగ్ షూట్‌లో చిరు



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విశ్వంభర'. యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. హైదరాబాద్ శంకర్‌పల్లిలో నిర్మించిన భారీ సెట్‌లో ప్రస్తుతం చిత్రీకరణ కొనసాగుతోంది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి ఇంట్రో సాంగ్‌ను తెరకెక్కిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, ఎం ఎం కీరవాణి స్వరపరిచారు. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ఈ సందర్భంగా చిత్రబృందం పోస్టర్‌ను విడుదల చేసింది. చిరంజీవి కారు దిగుతున్న లుక్‌లో ఆకట్టుకున్నారు.



ఇన్ ప్రోగ్రెస్

బ్రహ్మా ఆనందం సంతృప్తినిచ్చింది



బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'బ్రహ్మా ఆనందం' చిత్రం ఇటీవలె విడుదలై ప్రేక్షకాధ రణ పొందుతోంది. శనివారం చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. బ్రహ్మానందం మాట్లాడుతూ 'సినిమాను చూసినవారంతా మా అబ్బాయి గురించే మాట్లాడుతున్నారు. తండ్రిగా నాకు చాలా సంతోషం కలిగింది. చాలా కాలం తర్వాత ఓ మంచి సినిమా, మంచి పాత్రను చేశాననే సంతృప్తిని మిగిల్చింది' అని అన్నారు. 'హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు రాజా గౌతమ్ కృతజ్ఞతలు తెలిపారు.

స్కూటీ చుట్టూ తిరిగే బ్యూటీ



'ఆయ్', 'మారుతీ నగర్ సుబ్రమణ్యం' చిత్రాల ఫేమ్ అంకిత్ కొయ్య, నీలఖి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బ్యూటీ'. వర్ధన్ దర్శకత్వంలో అడిదాల విజయ్‌పాల్‌రెడ్డి, ఉమేశ్ కే.ఆర్.బన్సాల్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. స్కూటీ చుట్టూ తిరిగే కథాంశంగా తెరకెక్కుతోందని మేకర్స్ తెలిపారు.

షూటింగ్ షురూ



అభినవ్ మణికంఠ, దివిజ ప్రభాకర్, తన్మయి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హే చికితా'. పృథ్వీ రాజ్, ప్రభాకర్, దర్శకులు దేవీప్రసాద్, వీరశంకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ధన్‌రాజ్ లెక్కల దర్శకత్వంలో ఎన్.అశోక్ ఆర్.ఎన్.ఎస్, 'గరుడవేగ' అంజి నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్‌లోగోను దర్శకుడు అజయ్ భూపతి ఆవిష్కరించారు. తాజాగా, ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ చిత్రానికి ఎడిటర్: మధు, డీఓపీ: గరుడవేగ అంజి, సంగీతం: చరణ్ అర్జున్.

ట్రెండ్‌కు తగ్గ చిత్రం




రాజాబిరుదుల, లావణ్య రామారావు, చినబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కాలగమనం'. సుధాకర్ బుద్ధి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత ఏఎమ్ రత్నం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ఈ చిత్రం ఉంది" అని చెప్పారు.

సరికొత్త సూపర్‌హీరో



అజయ్, రవి వర్మ, ఆమని, శ్రద్ధాదాస్, ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'త్రికాల'. మణి తెల్లగూటి దర్శకత్వంలో శ్రీనివాస్, రాధిక నిర్మిసున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్ మాట్లాడుతూ "ట్రైలర్ అద్భుతంగా ఉంది. తప్పకుండా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. నిర్మాత రాధిక మాట్లాడుతూ "పురాణాలకు కాల్పనికత జోడించి తయారుచేసిన సరికొత్త సూపర్ హీరో చిత్రం 'త్రికాల" అని తెలిపారు. అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు.





పెళ్లికి ముందే జంటగా ఫైనాన్షియల్ ప్లానింగ్



పరిణయం.. రెండు జీవితాల సంగమం. కడదాకా కలిసుండేందుకు ముడిపెట్టే బంధం. అందుకు ఇద్దరి మధ్య తరగనంత ప్రేమతో పాటు తగినంత డబ్బూ అవసరమే. ఎందుకంటే, భార్యా భర్తల సంబంధంలో డబ్బు చాలా సున్నితమైన, ప్రధాన అంశంగా మారింది. ఇరువురి మధ్య ఆర్థిక విబేధాలతో వివాహ బంధం బీటలు వారే ప్రమాదం ఉంది. ఒక్కోసారి విడాకులకూ దారి తీయవచ్చు. అందుకే, పెళ్లికి ముందే జంటగా ఆర్థిక విషయాలు, లక్ష్యాలపై చర్చించుకోవడం మేలు. తద్వారా వారి వైవాహిక జీవితంలో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను జంటగా పరిష్కరించుకునేందుకు ముందు నుంచే సిద్ధం కావచ్చు. అయితే, కాపురానికి ముందే ఇలాంటి విషయాలను ప్రస్తావిస్తే కాబోయే భర్త లేదా భార్య తనను డబ్బు మనిషి అనుకుంటారన్న సందేహం ప్రతి జంటలోనూ ఉంటుంది. కానీ, మీ దృక్పథాన్ని, లక్ష్యాన్ని నిజాయితీగా, స్పష్టంగా వివరించగలిగితే మీ భాగస్వామితో బంధం మరింత బలపడుతుంది.

మనీ మ్యాటర్స్ ముందే మాట్లాడుకుంటే బెటర్ ● తద్వారా వైవాహిక బంధానికి, భవిష్యత్‌కు భరోసా



మీ భాగస్వామి ఆర్థిక దృక్పథాన్ని అర్థం చేసుకోండి..

కుటుంబ ఖర్చులు లేదా పెట్టుబడుల గురించి చర్చించే ముందు ఆర్థిక విషయాల్లో మీ భాగస్వామి వైఖరిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. మీకు కాబోయే భర్త లేదా భార్య దృష్టిలో డబ్బు అంటే ఆర్థిక భరోసానా..? స్వేచ్ఛా జీవితమా..? లేదా వినోదం, విలాసాలా..? ఈ విషయాన్ని పసిగట్టగలిగితే మీ భాగస్వామి ఖర్చు చేసే విధానం, ఆర్థిక ప్రాధాన్యాలపై ఓ అంచనాకు రాగలుగుతారు. అలాగే, మీ ఆర్థిక దృక్పథంలో పోల్చి చూసుకోవచ్చు. తద్వారా వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాక తలెత్తే అభిప్రాయ భేదాలను ముందుగానే నివారించుకునే వీలుంటుంది. అంతేకాదు, ఆర్థిక విషయాలపై ఏ కోణంలో చర్చ మొదలు పెట్టాలనే విషయంపైనా అవగాహన లభిస్తుంది. ఉదాహరణకు, మీరు పొదుపరి. కానీ, మీ భాగస్వామి ఆనందాల కోసం బాగా ఖర్చు చేస్తారనుకుందాం. ఈ సందర్భంలో ముందుగా చర్చించుకోవడం ద్వారా పెళ్లి తర్వాత మధ్యేమార్గంపై ఓ నిర్ణయానికి రావడంతో పాటు భవిష్యత్ ప్రణాళికను రచించుకునేందుకు వీలుపడుతుంది.

ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోండి..

జంట ప్రయాణంలో కారు, ఇళ్లు కొనుగోలు దగ్గరి నుంచి పిల్లల చదువు, రిటైర్మెంట్ వరకు ముందే ప్లాన్ చేసుకోండి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను ముందుగానే గుర్తించడం ద్వారా ఆది నుంచే అందుకోసం పొదుపు ప్రారంభించవచ్చు.

పారదర్శకంగా చర్చించండి..

పెళ్లికి ముందే ఆర్థిక విషయాల్ని చర్చించినా, అందులో పారదర్శకత లేకపోతే కాపురంలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కేవలం ఆదాయం, ఖర్చులనే కాదు కుటుంబ ఆర్థిక లక్ష్యాలనూ గుర్తించి వాటిపైనా చర్చించాలి. ఖర్చులపై పరిమితులు, భవిష్యత్ అవసరాలు.. అందుకున్న పొదుపు మార్గాలనూ చర్చలో భాగం చేయండి. అప్పుడే మీ ఆర్థిక దృక్పథం కాబోయే భాగస్వామికి స్పష్టంగా అర్థమవుతుంది. తద్వారా వైవాహిక భవిష్యత్‌కు భరోసా లభిస్తుంది.

నీది.. నాది

డబ్బు విషయంలో భార్యాభర్తల మధ్య నీది.. నాది అనే తేడాలు రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఇద్దరూ సంపాదించే వారైతే, ఒకరి డబ్బును మరొకరు వినియోగించుకోవడం, ఎవరి సంపాదన ఎందుకోసం ఖర్చు చేయాలనే విషయాల్లో పెళ్లికి ముందే స్పష్టమైన అంగీకారానికి రావడం మేలు. అలాగే, జాయింట్ అకౌంట్లు, బీమా పాలసీలు, పెట్టుబడి పథకాలు.. వాటికి నామినీలుగా ఎవరుండాలనే విషయాలపైనా ఇరువురూ ఓ అవగాహనకు వస్తే మరింత మంచిది. జీవితంలో ఎప్పుడేం జరుగుతోందో ఎవరూ చెప్పలేరు. అందుకే, ఆర్థిక తక్షణావసరాలను తీర్చుకునేందుకు వీలుగా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. కనీసం 3 నుంచి 6 నెలల ఆర్థిక అవసరాలను తీర్చగలిగేలా ఈ నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే, జీవిత, ఆరోగ్య బీమా కవరేజీని సమకూర్చుకోవడం కూడా కీలకం.

గోల్డ్ బాండ్లకు గుడ్‌బై..

పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులకు నిన్న మొన్నటి వరకు సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) మంచి పెట్టుబడి సాధనం. అయితే మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ఈ బాండ్స్ జారీకి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. మరి ఇప్పుడు డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరుల ముందు ఉన్న మార్గాలు ఏమిటి? అయితే ఇది మీ కోసమే..



బంగారంలో పెట్టుబడులకు ప్రత్యామ్నాయాలివే..

బంగారానికి, మన సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది. వీసమెత్తు బంగారమైనా లేకుండా మన దేశంలో ఏ ఇంట్లో, ఏ శుభకార్యం జరగదంటే అతిశయోక్తి కాదు. అటు స్టేటస్ సింబల్‌గానే గాక, పెట్టుబడి సాధనంగానూ మన దేశంలో పసిడికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల పొదుపులో కొంత మొత్తాన్ని అయినా డిజిటల్ గోల్డ్ వైపు మళ్లించే ఉద్దేశంతో ప్రభుత్వం 2015లో సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) పథకం తీసుకొచ్చింది. గత పదేళ్లలో ఈ పథకం కింద 67 విడతలుగా 14.7 కోట్ల యూనిట్ల ఎస్‌జీబీలను ప్రభుత్వం జారీ చేసింది.

పసిడి పైపై చూపులు

అయితే మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఎస్‌జీబీ పథకానికి ఫుల్‌స్టాప్ పెట్టింది. దీంతో డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులకు ఒక మార్గం మూసుకుపోయింది. మరోవైపు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర రికార్డులు సృష్టిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం 2,900 డాలర్లకు అటుఇటూగా ఉంది. దేశీయ మార్కెట్‌లోనూ 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం రూ.86,000-88,000 మధ్య తచ్చాడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, అంతర్జాతీయ ఉద్రిక్తతలతో ధర మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడి లాభాల కోసం డిజిటల్ ఫార్మాట్‌లో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులు ఈ కింది మార్గాలను అన్వేషించవచ్చు.

లిస్టెడ్ ఎస్‌జీబీలు

ప్రభుత్వం ఇప్పటి వరకు జారీ చేసిన ఎస్‌జీబీలన్నీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టయ్యాయి. డీమ్యాట్ ఖాతా ఉన్న రిటైల్ మదుపరులు ఎవరైనా ఈ రెండు స్టాక్ ఎక్స్ఛేంజీల క్యాష్ సెగ్మెంట్‌లో ఎనిమిదేళ్ల కాలపరిమితి ఉండే ఈ ఎస్‌జీబీల యూనిట్లను కొనుగోలు చేయవచ్చు. కాకపోతే వీటికి ఐదేళ్ల లాక్-ఇన్-పీరియడ్ ఉంటుంది. ఐదు, ఆరు, ఏడేళ్ల చివర్లో ఆర్‌బీఐ ఈ బాండ్స్‌కు బైబ్యాక్ సదుపాయం కల్పిస్తోంది.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

డిజిటల్ రూపంలో పసిడిలో మదుపు చేయాలనుకునే మదుపరులు మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అందించే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనూ మదుపు చేయవచ్చు. ఒక్కో గోల్డ్ ఈటీఎఫ్ ఒక గ్రాము బంగారానికి సమానం. ఈ పథకాల ద్వారా సమీకరించిన నిధులను మ్యూచువల్ ఫండ్స్. ఫిజికల్ గోల్డ్‌లో పెట్టుబడులుగా పెడతాయి. ప్రతి ట్రేడింగ్ డే చివర్లో ఆ రోజు బంగారం మార్కెట్ ధర ప్రకారం ఈ యూనిట్ల నికర ఆస్తుల విలువ (ఎన్ఏవీ) ప్రకటిస్తారు. ఈ ఈటీఎఫ్‌లు కూడా లిస్టయి ఉంటాయి, కాబట్టి డీమ్యాట్ ఖాతా ఉన్న మదుపరులు ఎప్పుడు కావాలంటే అప్పుడు వీటిని అమ్ముకోవచ్చు. లేదా కొనుగోలు చేయవచ్చు. నగలు లేదా ఫిజికల్ గోల్డ్ మేకింగ్ చార్జీలతో పోలిస్తే వీటి బ్రోకరేజీ చార్జీలూ తక్కువే. గోల్డ్ ఎంఎఫ్‌లతో పోలిస్తే ఖర్చులూ తక్కువగానే ఉంటాయి. కాకపోతే ఈ ఈటీఎఫ్‌లను అమ్మాలన్నా, కొనాలన్నా ఎగ్జిట్, ఎంట్రీ లోడ్‌లు ఉంటాయి.

గోల్డ్ ఎంఎఫ్‌లు

ఇవి ఓపెన్ ఎండెడ్ పథకాలు. ఈ పథకాల ద్వారా సమీకరించిన నిధులను ఎంఎఫ్‌లు.. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో మదుపు చేస్తాయి. పసిడి పెట్టుబడుల ద్వారా మదుపరులకు దీర్ఘకాలిక సంపద సృష్టించడం ఈ పథకాల ప్రధాన ఉద్దేశం. ఫండ్ లక్ష్యానికి అనుగుణంగా ఈ పథకాల ఫండ్ మేనేజర్లు పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటారు. ఈ పథకాల ఎన్ఏవీలను కూడా ట్రేడింగ్ ముగిసిన తర్వాత ఏ రోజుకు ఆ రోజు ప్రకటిస్తారు. కాకపోతే గోల్డ్ ఈటీఎఫ్‌లతో పోలిస్తే, ఈ పథకాల నిర్వహణ ఖర్చులు కొద్దిగా ఎక్కువ. గోల్డ్ ఎంఎఫ్‌లపై రాబడులు ఫండ్ మేనేజర్ నైపుణ్యాలు, బులియన్ మార్కెట్ తీరుతెన్నులపై ఆధారపడి ఉంటాయి. డీమ్యాట్ ఖాతా లేని మదుపరులు కూడా ఈ పథకాల్లో మదుపు చేయవచ్చు.

ఎస్‌బీఐ గృహ రుణగ్రహీతలకు శుభవార్త

రెపో అనుసంధానిత రుణ రేట్లు 0.25% తగ్గింపు

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రామాణిక రుణ వడ్డీ రేట్లను తగ్గించింది. రెపో అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్), బాహ్య ప్రామాణిక రుణ రేటు (ఈబీఎల్ఆర్)ను పావు (0.25) శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దాంతో ఈబీఎల్ఆర్ 9.15 శాతం నుంచి 8.90 శాతానికి దిగిరాగా.. ఆర్ఎల్ఎల్ఆర్ 8.75 శాతం నుంచి 8.50 శాతానికి తగ్గింది. తగ్గించిన వడ్డీ రేట్లు శనివారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ నెలలో ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్ ఆ ప్రయోజనాన్ని తాజాగా రుణగ్రహీతలకు బదిలీ చేసింది.

దీంతో ఎస్‌బీఐ నుంచి ఈబీఎల్ఆర్, ఆర్ఎల్ఎల్ఆర్ అనుసంధానిత గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారిపై ఈఎంఐ భారం తగ్గనుంది. కాగా, ద్రవ్య సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్), బేస్ రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) మాత్రం యథాతథంగా కొనసాగుతాయని ఎస్‌బీఐ స్పష్టం చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	93	విజయవాడ	101
వరంగల్	93	గుంటూరు	100
కరీంనగర్	93	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	80
కర్నూలు	93	నెల్లూరు	85
విశాఖపట్నం	93	అనంతపురం	85
గోదావరి	101		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,070 ▼	78,900 ▼	1,08,000 ▲
విజయవాడ	87,400 ▼	82,200 ▼	98,300 ▲
విశాఖపట్నం	84,840 ▼	77,770 ▼	95,950 ▼
రాజమండ్రి	86,070 ▼	78,900 ▼	99,700 ▼
ప్రొద్దుటూరు	87,600 ▼	81,120 ▼	97,000 ▼
ముంబై	85,998	78,774	97,953

నిండైన ఆత్మవిశ్వాసం.. కదనోత్సాహం

చాంపియన్స్ ట్రోఫీ 3 రోజుల్లో

దుబాయ్ చేరిన టీమిండియా







ముంబై: తొమ్మిది నెలల కిందట టీ20 వరల్డ్ కప్ గెలిచిన మధుర స్మృతులు..తాజాగా ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఆత్మవిశ్వాసం..వెరసి టీమిండియా మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి పయనమైంది. ఈనెల 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత జట్టు శనివారం దుబాయ్ పయనమైంది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి పెద్ద సంఖ్యలో తరలొచ్చిన అభిమానుల జేజేల మధ్య భారత్ బయలు దేరింది. తెల్లటి టీ షర్ట్, నల్లటి ట్రాక్ ధరించి కారులోంచి దిగిన రోహిత్‌ను చూడగానే ఫ్యాన్స్ 'రోహిత్ భాయ్', 'రోహిత్ సర్' అని పెద్ద ఎత్తున నినదించారు. వారికి చేతులు ఊపుతూ అభివాదం చేయడం ద్వారా రోహిత్ లోనికి వెళ్లిపోయాడు. కోచ్ గంభీర్, వైస్-కెప్టెన్ గిల్ సహా పలువురు క్రికెటర్లు జట్టు బస్సులో వచ్చారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతోపాటు ఇతర ఆటగాళ్లు అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ ముందుకు కదలడం విశేషం. నాలుగు గంటల ప్రయాణం అనంతరం దుబాయ్ చేరుకున్న టీమిండియా ఆటగాళ్లకు అక్కడ ఘన స్వాగతం లభించింది. కాగా, పేసర్ బుమ్రా లేకుండా చాంపియన్స్ ట్రోఫీలో తలపడుతున్న భారత్..తొలి మ్యాచ్‌లో ఈనెల 20న బంగ్లాదేశ్‌ను ఎదుర్కోనుంది. ఇక టోర్నీలో బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌ను పాకిస్థాన్‌తో 23న ఆడనుంది.

ఫుల్ జోష్‌తో..

మూడు వన్డేలలో ఇంగ్లండ్‌ను చిత్తు చేయడంతో భారత జట్టులో ఆత్మవిశ్వాసం రెండింతలైంది. ఇక చాలాకాలంగా ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న దిగ్గజ బ్యాటర్లు రోహిత్, విరాట్ ఇంగ్లండ్‌పై రాణించడం చాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియాకు శుభ సూచకం. కటక్..రెండో వన్డేలో రోహిత్ (90 బంతుల్లో 119) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడగా..అహ్మదాబాద్ మ్యాచ్‌లో కోహ్లీ వన్డేలలో 73వ హాఫ్ సెంచరీ మార్క్ చేరుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లు రోహిత్, విరాట్‌లకు ఊరటనిచ్చేవే. అయితే ఈ జోరును వారు చాంపియన్స్ ట్రోఫీలో కొనసాగిస్తేనే జట్టు మరో ఐసీసీ టైటిల్ దక్కించుకోగలుగుతుంది. అలాగే తదుపరి ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్‌తోపాటు, 2027 వన్డే వరల్డ్ కప్‌నకు జట్లను రూపొందించడంపై సెలెక్షన్ కమిటీ దృష్టి సారించింది. ఈక్రమంలో టీమిండియాలో చోటు నిలబెట్టుకోవాలంటే చాంపియన్స్ ట్రోఫీలో రోహిత్, విరాట్ సత్తా చాటడం ఎంతో ముఖ్యం.



గిల్‌కు పరీక్ష

వైస్-కెప్టెన్‌గా నియామకం యువ ఆటగాడు గిల్‌కు పెద్ద ప్రమోషన్‌గానే చెప్పాలి. వన్డేలలో దాదాపు 61 సగటు కలిగిన అతడు..చాంపియన్స్ ట్రోఫీలో రాణించడం చాలా కీలకం. టోర్నమెంట్‌లో అదరగొడితే గిల్‌కు తిరుగుండబోదు. ఇక..బుమ్రా పరోక్షంలో తమకు అందివచ్చిన అవకాశాలను పేసర్లు అర్ష్‌దీప్, హర్షిత్ రాణా ఏమేరకు అందిపుచ్చుకుంటారో చూడాలి. స్పిన్‌కు అనుకూలించే దుబాయ్ పిచ్‌లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా వరుణ్ చక్రవర్తి జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాల్సి ఉంటుంది.

స్పోర్ట్స్

ఆఖరి బంతి.. ఢిల్లీ విజయభేరి

ఉత్కంఠ పోరులో ముంబై ఓటమి
- షఫాలీ మెరుపు ఇన్నింగ్స్
- అదరగొట్టిన నికీ

డబ్ల్యూపీఎల్‌లో నేడు
గుజరాత్ × యూపీ
రాత్రి 7.30 నుంచి



షఫాలీ (18 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో మ్యాచ్ నరాలు తెగే ఉత్కంఠ రేపింది. ఆఖరి బంతికి ఫలితం తేలిన మ్యాచ్‌లో నిరుటి రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ రెండు వికెట్లతో నెగ్గింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 19.1 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. సివర్ బ్రంట్ (59 బంతుల్లో 13 ఫోర్లతో 80 నాటౌట్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42) మాత్రమే మెరిశారు. ఛేదనలో ఢిల్లీ 20 ఓవర్లలో 165/8 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్ షఫాలీ వర్మ (18 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43) సుడిగాలి ఆరంభం ఇచ్చింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికీ ప్రసాద్ (35), సారా బ్రైస్ (21), అలైస్ క్యాప్సీ (16) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

అరుంధతి..ఉత్కంఠ అదిమిపట్టి..: ఆఖరి బంతికి రెండు పరుగులు కావాల్సిన దశలో హైదరాబాదీ అరుంధతి రెడ్డి (2 నాటౌట్)..స్పిన్నర్ సజన బంతిని కవర్స్‌వైపు కొట్టింది. మొదటి పరుగు చేసింది. రెండో పరుగు కోసం వెనక్కు మళ్లింది. కవర్స్‌నుంచి హర్మన్‌ప్రీత్ విసిరిన బంతిని అందుకున్న కీపర్ యాస్తికా వికెట్లను గిరాటేసేలోపు అరుంధతి డైవ్ చేస్తూ క్రీజులోకి చేరింది. బ్యాటర్ రనౌటా..కాదా..అని తేల్చేందుకు పలు కోణాల్లో పరిశీలించిన మూడో అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. అంతే..ఢిల్లీలో సంబరాలు మిన్నంటగా, ముంబై డీలా పడిపోయింది.



నికీ ప్రసాద్ (35)

నికీ..ఖళా: ఇటీవల అండర్-19 ప్రపంచ కప్ సాధించిన భారత జట్టు కెప్టెన్ నికీ ప్రసాద్ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున అరంగేట్రం చేసింది. తొలి మ్యాచ్‌లో సమయోచిత ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక భూమిక పోషించింది.

సంక్షిప్తస్కోర్లు

ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 164 ఆలౌట్ (సివర్ 80 నాటౌట్, హర్మన్ 42, సదర్లాండ్ 3/34, శిఖా పాండే 2/14).
ఢిల్లీ క్యాపిటల్స్: 20 ఓవర్లలో 165/8 (షఫాలీ 43, నికీ ప్రసాద్ 35, సారా బ్రైస్ 21, కెర్ 2/21, మాథ్యూస్ 2/32).

హాకీ అమ్మాయిల శుభారంభం

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ ప్రొ లీగ్‌లో భారత్ శుభారంభం చేసింది. శనివారం ఇక్కడ జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 3-2తో ఇంగ్లండ్‌పై గెలిచింది. ఇక, ఇక్కడే జరిగిన పురుషుల హాకీ ప్రొ లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత్ 1-3తో స్పెయిన్ చేతిలో పరాజయం పాలైంది.

గుకేష్ కంటే అర్జున్‌కే ఎక్కువ ప్రైజ్‌మనీ!



హాంబర్గ్ (జర్మనీ): ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టూర్ తొలి అంచె టోర్నీ ముగిసింది. భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ గుకేష్ మొదటి అంచెలో నిరాశ జనక ప్రదర్శనతో ఎనిమిదో, చివరి స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో పాల్గొన్నందుకు గుకేష్‌కు రూ. 17.33 లక్షలు లభించాయి. టోర్నీలో ఆడకున్నా, ఫ్రీస్టయిల్ చెస్ ఆటగాళ్ల క్లబ్‌లో ఉన్నందుకు తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి.. రూ. 23.50 లక్షలు దక్కించుకోవడం విశేషం. 'నాన్ పార్టిసిపేటింగ్' సభ్యుడిగా అర్జున్‌కు ఆ మొత్తం లభించింది. టోర్నీ నిబంధనల ప్రకారం 'నాన్ పార్టిసిపేటింగ్' సభ్యులకు మొత్తం ప్రైజ్‌మనీలో కొంత వాటా లభిస్తుంది. అయితే టోర్నీ జరిగే నెలలో ఆ సభ్యుల ఎలో రేటింగ్ 2725కు మించి ఉండాలి. కాగా, ఏప్రిల్ 8 నుంచి పారిస్‌లో జరిగే రెండో అంచె గ్రాండ్‌స్లామ్ టూర్‌లో అర్జున్ ఆడతాడు. ఇక, మొదటి అంచెలో విన్సెంట్ కీమర్ (జర్మనీ) విజేతగా నిలిచాడు.

క్రికెటర్లేమీ దేవుళ్లు కాదు

జట్టులో స్టార్ సంస్కృతి సరికాదన్న అశ్విన్




న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో సూపర్ స్టార్‌డమ్ సంస్కృతిని టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తప్పుపట్టాడు. క్రికెటర్లు దేవుళ్లు కాదనీ, వాళ్లు సాధారణ జీవనం సాగించే విధానం అలవాటు చేసుకోవాలని సూచించాడు. ముఖ్యంగా భారత జట్టులో ఇలాంటి సంస్కృతి పెరిగిపోతున్నదని, దీనికి అడ్డుకట్ట వేయాలని ఒక హిందీ యూట్యూబ్ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో అశ్విన్ సూచించాడు. బ్యాటింగ్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కెరీర్‌లో ఇప్పటికే ఎంతో సాధించారని, వాళ్లు సెంచరీ చేస్తే దాన్ని ఆటలో భాగంగానే చూడాలన్నాడు. 'క్రికెటర్లు.. సూపర్ స్టార్లు కాదు. వాళ్లను దేవుళ్లగా చూడాల్సిన అవసరం లేదు. భారత క్రికెట్ జట్టులో సూపర్ స్టార్‌డమ్, సూపర్ సెలెబ్రిటీల సంస్కృతిని ప్రోత్సహించొద్దు. ఆటగాళ్లుగా మనం సాధారణ జీవనం సాగించేలా ఉండాలి' అని ఆ ఇంటర్వ్యూలో అశ్విన్ అన్నాడు. జట్టులో సూపర్‌స్టార్ సంస్కృతి ఉండరాదని టీమిండియా చీఫ్ కోచ్ గంభీర్ కూడా ఇటీవల కాస్త తీవ్రంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే.

మంత్రిగారూ.. మమ్మల్ని టోర్నీకి పంపండి

రెజ్లర్ల విన్నపం

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడాశాఖ, జాతీయ రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మధ్య సమన్వయం లేకపోవడం భారత రెజ్లర్లకు శాపంగా మారింది. వీళ్ల నిర్వాకం కారణంగా క్రొయేషియాలో జరిగిన తొలి టోర్నీకి దూరమైన రెజ్లర్లు.. ఈనెల 26 నుంచి అల్బేనియాలో జరిగే సీజన్ రెండో ర్యాంకింగ్ సిరీస్ ఈవెంట్‌కు కూడా దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రతిపాదిత డాక్యుమెంట్లను నిర్ణీత సమయంలోగా పంపడంలో డబ్ల్యూఎఫ్ఐ విఫలమైందని, అందుకే రెజ్లర్లను టోర్నీకి పంపే విషయంలో ఆమోదముద్ర వేయలేదని క్రీడాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ అంశంలో క్రీడామంత్రి మన్సుఖ్ మాండవ్య జోక్యం కోరుతూ.. ఆసియా చాంపియన్ సునీల్, అండర్-23 ఆసియా టోర్నీ విజేత మీనాక్షి సహా పదిమంది రెజ్లర్లు శనివారం ఉదయం ఆయన నివాసానికి వెళ్లారు. అయితే, మంత్రి లేకపోవడంతో మధ్యాహ్నం దాకా వేచిచూసిన రెజ్లర్లు నిరాశగా వెళ్లిపోయారు. 'మా తప్పు లేకపోయినా టోర్నీకి దూరమయ్యే పరిస్థితి వస్తోంది. మంత్రి జోక్యంతోనైనా మాకు మేలు జరుగుతుందని ఇక్కడికొచ్చాం' అని మీడియా ముందు రెజ్లర్లు వాపోయారు. సరైన నిబంధనలు పాటించలేదన్న కారణంగా ఇప్పటికే డబ్ల్యూఎఫ్ఐపై క్రీడాశాఖ సస్పెన్షన్ వేటు వేసింది. దీంతో సమాఖ్య, క్రీడాశాఖ మధ్య వివాదం కొనసాగుతోంది.

టెన్నిస్ నెం.1 సిన్నర్‌పై మూడు నెలల నిషేధం



లండన్: ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా)తో టాప్ ర్యాంక్ టెన్నిస్ ఆటగాడు జానిక్ సిన్నర్ రాజీకి వచ్చాడు. రెండు డోపింగ్ పరీక్షలలో విఫలమైన నేపథ్యంలో వాడా తనపై విధించిన మూడు నెలల సస్పెన్షన్ ఇటలీ స్టార్ సిన్నర్ అంగీకరించాడు. ఈ విషయాన్ని వాడా శనివారం వెల్లడించింది. అయితే ఆ నిషేధిత డ్రగ్స్ తాను ఉద్దేశపూర్వకంగా తీసుకోలేదని, మసాజ్‌లో తన ఫిజియో ఉపయోగించిన ఔషధం ద్వారా శరీరంలోకి చేరిందని సిన్నర్ వివరణ ఇచ్చాడు. ఈనెల తొమ్మిది నుంచి అమలులోకి వచ్చిన సస్పెన్షన్ మే నాలుగున ముగియనుంది. దాంతో తదుపరి గ్రాండ్‌స్లామ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో జానిక్ పాల్గొనగలుగుతాడు.



అభిమాని కుమారుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న కేసీఆర్

అభిమాని కుమారుడికి కేసీఆర్ అక్షరాభ్యాసం

» నాలుగేళ్ల కల నెరవేర్చుకున్న గజ్వేల్ బీఆర్ఎస్ నేత

మర్కుక్, నిజామాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొమ్ము నవీన్ కుమార్.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వీరాభిమాని. అంతేనా.. గజ్వేల్ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం ఇన్‌చార్జి కూడా. కేసీఆర్‌ను ఒక్కసారి స్వయంగా కలవాలనేది నవీన్ కల. ఇందుకోసం నవీన్ నాలుగేళ్లుగా చెయ్యని ప్రయత్నం లేదు. చివరికి, మెదక్ జిల్లా ఉమ్మడి డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి చొరవతో నవీన్ కుమార్ తన పుట్టిన రోజు, శనివారం నాడు.. మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో స్వయంగా కలిశారు. అంతేకాక, తన కుమారుడు రోహన్‌తేజకు కేసీఆర్ చేతులమీదుగా అక్షరాభ్యాసం చేయించి మురిసిపోయారు.

కాంగ్రెస్ వైఫల్యంతోనే భూగర్భ జలాల్లో తగ్గుదల

» ప్రభుత్వం నీటి పరిరక్షణ చర్యలు చేపట్టాలి : హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జల సంరక్షణలో తెలంగాణను ఆదర్శంగా నిలిపిన బీఆర్ఎస్ ప్రభుత్వ నీటి ప్రణాళికలు.. కాంగ్రెస్ పాలనలో పూర్తిగా వైఫల్యానికి గురయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో భూగర్భ జలాలు రాష్ట్రంలో 56 శాతం పెరిగాయని, మిషన్‌కాకతీయ ద్వారా 27 వేలకుపైగా చెరువుల పునరుద్ధరణతో 15 లక్షల ఎకరాలకు సాగునీరు అంది 8.93 లక్షల టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందని ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో ఈ వ్యవస్థ అస్తవ్యస్తమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రెండు మీటర్లకు పైగా భూగర్భ జలాలు పడిపోయాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నీటి పరిరక్షణ చర్యలు చేపట్టకుంటే వచ్చే నెలల్లో రాష్ట్రం నీటి కొరతను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలాలు: ప్రభుత్వం

గత పదేళ్లకాలంలో జనవరి మాసాల్లో లెక్కలు పరిశీలిస్తే భూగర్భ జలాలు పెరిగాయని భూగర్భ జలవనరులశాఖ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 456 మండలాల్లో భూగర్భ జలాలు పెరగ్గా, 156 మండలాల్లో తరుగుదల నమోదయినట్లు తెలిపింది. 2025 జనవరి మాసానికి గాను భూగర్భ జలవనరులశాఖ శనివారం గణాంకాలను వెల్లడించింది. 2014-2023 సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది 456 మండలాల్లో 15.21 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని తెలిపింది. 156 మండలాల్లో 11.46 మీటర్ల లోతు దాకా తరుగుదల రికార్డయిందని తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 15 జిల్లాల్లో 0.26 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరగ్గా, 18 జిల్లాల్లో 0.03 నుంచి 2.71 మీటర్ల దాకా తరుగుదల నమోదైందని తెలిపింది.

చిత్తశుద్ధితో పని చేయకపోతే స్థానిక ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవు:కూనంనేని

కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని చాటుకోవాల్సిన అవసరం ఉందని, ఇచ్చిన హామీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్, ఆప్ స్వయంకృతాపరాధం వల్లనే ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి చెందాయని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల నాటికి ఇచ్చిన హామీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. హామీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచించారు. చిత్తశుద్ధితో పని చేయకపోతే ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కులగణన అమలు చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. కాగాసీపీఐ అగ్రనాయకుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం సమాజమే లక్ష్యంగా అణగారిన వర్గాల్లో చైతన్యం రగిలించిన పోరాట యోధుడని సీపీఐ నాయకులు కొనియాడారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శనివారం ధర్మభిక్షం 103వ జయంతి వేడుకలు నిర్వహించారు. కాగా, కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 18, 19 తేదీల్లో వామ పక్ష పార్టీలు నిరసనకు పిలునిచ్చాయి.

ట్రెసా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డిపై ఈసీకి ఫిర్యాదు

తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసు సంఘం (ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డిపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (ఈసీ)కి బీజేపీ ఫిర్యాదు చేసింది. రవీందర్ రెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించింది. ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న తన సోదరుడు వంగ మహేందర్ రెడ్డికి అనుకూలంగా ఉపాధ్యాయులను ప్రభావితం చేస్తున్నారని పేర్కొంది. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శృతి తదితరులతో కూడిన బృందం ఎన్నికల ప్రధానాధికారికి వినతిపత్రం అందజేసింది.

వివాదాల పరిష్కారాలకు మధ్యవర్తిత్వం దోహదం

» సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహింటన్ నారిమన్

శామీర్‌పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): న్యాయపర వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ పద్ధతిలో మధ్యవర్తిత్వం ఎంతగానో దోహదపడుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్ అన్నారు. శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మిలోన్ కే బెనర్జీ ఆర్బిట్రేషన్ సెంటర్ (ఎంకేబీఏసీ)ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ కోర్టుల బయట మధ్యవర్తిత్వం, ఆర్బిట్రేషన్ ద్వారా వివాదాల పరిష్కారానికి ఆదరణ లభిస్తోందని తెలిపారు. మధ్యవర్తిత్వ రంగంలో విలోన్ బెనర్జీ గణనీయమైన కృషి చేశారని గుర్తు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్య ప్రసంగిస్తూ మిలన్ బెనర్జీ కుమారుడు గౌరవ్ బెనర్జీ ఇచ్చిన విరాళం ద్వారా ఈ ఆర్బిట్రేషన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

సీఎం రేవంత్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

» మోదీ బీసీ కాదని చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

» లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం: ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ బీసీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మోదీ బీసీ కాదన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కులగణన తప్పుడు సర్వే వల్ల ప్రభుత్వానికి వస్తున్న చెడ్డ పేరు నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే మోదీపై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. కేంద్రంలో 27 మంది బీసీలకు మంత్రి పదవులు ఇస్తే రేవంత్ రెడ్డి ఇద్దరికే ఇచ్చారని అన్నారు.

మార్చిలో వర్గీకరణ బిల్లును చట్టంగా మార్చే కుట్ర..!

» మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. విఎల్ రాజు

కవాడిగూడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణ చేయడానికి తెలంగాణ అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న యత్నంపై తిరుగుబాటు ద్వారా అడ్డుకోకపోతే మాల జాతికి భవిష్యత్తు లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్. విఎల్ రాజు పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన ఉమ్మడి రిజర్వేషన్ హక్కుల రక్షణ కోసం తాము పోరాటం చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ మాల మంత్రులు, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అనుచరులైన కొంతమంది మాల సంఘాల జేఏసీ ఏజెంట్ల ద్వారా.. మాలల ఉద్యమాన్ని, శక్తిని బలహీనపర్చి నిర్వీర్యం చేయడానికి సీఎం రేవంత్ కుట్ర పన్నారని ఆరోపించారు. మార్చిలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి జరుగుతున్న కుట్రను మాల ప్రజా ప్రతినిధులు అడ్డుకోవాలని, లేనిపక్షంలో మాల సమాజం వారిని క్షమించదని అన్నారు.

11 ఏళ్ల మోదీ పాలనలో బీసీలకు చేసిందేంటి?



» బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే దేశంలో కులగణన చేపట్టాలి

» 42% రిజర్వేషన్ కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'రెడ్డి కులంలో పుట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తీసుకువస్తానని ప్రకటించారు. ఓబీసీని అని చెప్పుకుంటున్న మోదీ.. 11 ఏళ్ల పాలనలో బీసీల కోసం ఏం చేశారు?' అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. బీజేపీ నేతలకు బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే జనగణనలో భాగంగా కులగణననూ చేపట్టాలని సవాల్ విసిరారు. దేశ వ్యాప్తంగా బీసీ జనాభా ఎంత ఉందో తేలాక, రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను కల్పించి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ.. పుట్టుకతో బీసీ కాదని సీఎం రేవంత్ మాట్లాడితే బీజేపీ నేతలు నానా హైరానా పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ వాస్తవాన్ని గతంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షానే చెప్పారని తెలిపారు. మోదీ పుట్టిన గాన్సీ కులాన్ని గుజరాత్ ప్రభుత్వం 1994లో ఓబీసీ కులాల జాబితాలో చేర్చిందని, అంతకు ముందు అది అగ్రకులమేనన్నారు. "పుట్టుకతోనే బీసీ అయిన బండి సంజయ్.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కష్టపడి పని చేశారు. తీరా ఎన్నికల నాటికి ఆ పదవి నుంచి ఆయన్ను తీసిపడేశారు. బీసీల పట్ల బీజేపీకి ఉన్న ప్రేమ ఇదీ" అని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం బీసీ కులగణన చేస్తే అభినందించాల్సింది పోయి.. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కడుపు మంటతో మాట్లాడుతున్నారన్నారు. "బీజేపీ నేతలు రాహుల్‌గాంధీ కులమేంటని అడుగుతున్నరు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి.. అప్పుడు ఆయన ఇంటికి వెళ్లి కులమేంటని అడగండి. సంతకం పెట్టి మరీ తన కులమేంటో రాహుల్ చెబుతారు" అని తెలిపారు. కాగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా పని చేసిన దీపా మున్షీదాస్.. క్రమశిక్షణ కలిగిన నేత అని, పార్టీ బలోపేతానికి ఆమె ఎంతగానో కృషి చేశారని మహేశ్‌గౌడ్ కొనియాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన చేపడతారా? అని కాంగ్రెస్ నేత వి.హన్మంతరావు ప్రశ్నించారు. బలహీన వర్గాల గురుంచి ఆలోచన చేసే గుణం కేవలం కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ కుటుంబానికే ఉందన్నారు. కాగా, ఎమ్మెల్యేగా ఓడిపోయిన ఎర్రబెల్లి.. చిలక జోస్యం చెబుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. "ఆయనకు జ్యోతిష్యం తెలిస్తే.. ఫామ్ హౌస్‌లో పడుకున్న కేసీఆర్ ఎప్పుడు లేస్తడు.. ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ ఎప్పుడు జైలుకు వెళతాడో చెప్పాలి" అని ఎద్దేవా చేశారు. కాగా, ఎర్రబెల్లి వ్యాఖ్యల్లో కుట్ర ఉందని, దీనిపై విచారణ చేపట్టాలని డీజీపీకి పీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి మరోసారి కుల గణన!

మిగిలిపోయిన 3,56,323 కుటుంబాల కోసం.. ఈ నెల 28 వరకు వివరాలు ఇవ్వొచ్చు

» ఫోన్ చేస్తే ఇంటికొచ్చి వివరాలు సేకరిస్తారు

» ప్రజాపాలన కేంద్రాలకు వెళ్లి ఫారం నింపొచ్చు

» ఇంటిదగ్గరే నింపి ప్రజాపాలన కేంద్రాల్లో ఇవ్వొచ్చు

» వెబ్‌సైట్లో సర్వే ఫాం డౌన్ లోడ్ చేసుకోవచ్చు

» వంద శాతం కులగణన లక్ష్యంగా ఏర్పాట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ఈ నెల 16 నుంచి మరోసారి ప్రారంభం కానుంది. గతంలో నిర్వహించిన సర్వే సందర్భంగా వివరాలు ఇవ్వనివారు, ఇళ్లకు తాళాలు వేసి వెళ్లినవారి కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇలా రెండోసారి అవకాశం ఇవ్వడం ద్వారా రాష్ట్రంలోని 100 శాతం జనాభాను కవర్ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో మిగిలిపోయిన 3,56,323 కుటుంబాల వివరాలను రెండోసారి సర్వేలో సేకరిస్తారు. రాష్ట్రంలో ఏ కులంవారు ఎంత మంది ఉన్నారు? వారి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయన్నది తెలుసుకోవడానికి ప్రభుత్వం ఈ కుల గణనను చేపట్టింది. 2024 నవంబరు 6న ప్రారంభించి డిసెంబరు 25 వరకు 50 రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఫిబ్రవరి 4న నిర్వహించిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కుల గణన వివరాలపై ప్రకటన చేశారు. రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 1,15,71,457 కుటుంబాలకు గాను 1,12,15,134 కుటుంబాల(96.9%)ను సర్వే చేయడం జరిగిందని వెల్లడించారు. ఇంకా 3.1 శాతం(3,56,323) కుటుంబాలను సర్వే చేయలేదని చెప్పారు. మిగిలిపోయిన వారి కోసం మరోసారి అవకాశం ఇవ్వాలంటూ విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అసంపూర్తి సర్వే గణాంకాలు న్యాయస్థానాల ముందు నిలబడవని, రాష్ట్రంలో ప్రతి వ్యక్తి కవర్ అయ్యేలా సర్వే ఉండాలని అభిప్రాయం వ్యక్తమైంది. కేసీఆర్, కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి వంటి బీఆర్ఎస్ నాయకులు సర్వేలో పాల్గొనలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభా వేదికగా ఆరోపించారు. అలాంటివారు రెండోసారి ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై ఈ నెల 12న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అందుబాటులో ఉన్న మంత్రుల సమావేశం జరిగింది. మిగిలిపోయిన వారి కుల గణనకు తేదీలను నిర్ధారించారు. ఈ నెల 16 నుంచి 28 వరకు మరోసారి సర్వేను నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం నుంచి రెండోసారి సర్వే ప్రారంభం కానుంది. సర్వే సజావుగా సాగేలా చూడాలని జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్‌ను రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం ఆదేశించారు. ఈ మేరకు అంతర్గత ఉత్తర్వు జారీ చేశారు. సర్వేకు సాధ్యమైనంత ప్రచారం కల్పించాలని చెప్పారు. సర్వేను ప్రభుత్వం మూడు పద్ధతుల్లో చేపట్టనుంది.



టోల్ ఫ్రీ నెంబర్: ప్రభుత్వం ప్రకటించిన టోల్ ఫ్రీ నెంబర్ 040-21111111కు ప్రజలు ముందుగా రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా కాల్ చేసి, కులగణనలో తమ వివరాలను పొందుపర్చాలని కోరాలి. ఈ నెల 16 నుంచి 28 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో ఫోన్ కాల్ చేయాల్సి ఉంటుంది. సంబంధిత అధికారి కాల్ చేసిన ఇంటికి వెళ్లి కుల గణన వివరాలు సేకరిస్తారు.

ప్రజా పాలనా సేవా కేంద్రాలు: గ్రామీణ ప్రాంతాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో, పట్టణ ప్రాంతాల్లోని వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలనా సేవా కేంద్రాలకు ప్రజలు వెళ్లి తమ వివరాలను అందించాలి. శిక్షణ పొందిన సిబ్బంది ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు. సర్వే ఫారాలను నింపడంలో ప్రజలకు వీరు సహకరిస్తారు.

ఆన్‌లైన్‌లో: https://seeepcsurvey.cgg.gov.in అనే వెబ్‌సైట్ నుంచి సర్వే ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో తమ కుటుంబ వివరాలను భర్తీ చేసిన తర్వాత.. ఆ ఫారాన్ని దగ్గరలోని ప్రజా పాలనా సేవా కేంద్రంలో సమర్పించాల్సి ఉంటుంది.

బీసీ రిజర్వేషన్ల పెంపు.. క్యాటగిరీల వారీగా!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీల్లోని ఏ క్యాటగిరీకి 7శాతం, బీ-10, సీ-01, డీ-7, ఈ-క్యాటగిరీకి 4శాతం చొప్పున రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం పెంచబోయే 13 % రిజర్వేషన్‌ను ఈ క్యాటగిరీలవారీగా ఎంతెంత పెంచబోతుందనే వివరాలను అసెంబ్లీలో పెట్టబోయే బిల్లులో పేర్కొనే అవకాశం ఉంది. అయితే ఇక్కడ మరో అంశం ఉంది. ఇప్పటికే సబ్ క్యాటగిరీల వారీగా ఉన్న రిజర్వేషన్లను కూడా సమీక్షిస్తారా, లేక వాటిని అలానే ఉంచి.. అవి ప్రస్తుతం ఏ నిష్పత్తిలో ఉన్నాయో.. వాటి ప్రకారమే పెంచబోయే శాతాన్ని వర్తింపజేస్తారా అన్నది చూడాల్సి ఉంది. ఉదాహరణకు ప్రస్తుతం బీసీ-ఏ క్యాటగిరీలో ఉన్న కులాలన్నింటికి కలిపి 7శాతం రిజర్వేషన్ అమలవుతోంది. దాని నిష్పత్తి ప్రకారమే ఆ సబ్‌క్యాటగిరీకి రిజర్వేషన్ పెంచుతారా, లేక ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసింది కాబట్టి అందులో తేలిన వివరాల ప్రకారం సబ్ క్యాటగిరీల్లో ఉన్న కులాలకు సంబంధించి జనాభా, వారికి ఇప్పటివరకు దక్కిన అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం, వెనుకబాటుతనాన్ని పరిశీలించి మొత్తంగా మార్పు చేస్తారా.. అన్నది చూడాల్సి ఉంది.

అసెంబ్లీలో ఆమోదించి.. చట్టం చేసినా..

బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలనుకుంటున్న ప్రభుత్వ నిర్ణయం మేరకు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఆ బిల్లును సభ ఆమోదిస్తే.. దానిపై గవర్నర్ సంతకం చేశాక చట్టంగా మారుతుంది. బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కలుగుతుంది. కానీ, మొత్తం రిజర్వేషన్లు 50% మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో ఎవరైనా కోర్టుకు వెళితే చట్టం రద్దయ్యేందుకూ అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో బిల్లు పెట్టి.. చట్టం చేసి దానిని పార్లమెంటుకు పంపాలని ప్రభుత్వం యోచిస్తోంది. పార్లమెంటులో చట్టాన్ని ఆమోదింపజేసి ఆ వెంటనే రాజ్యాంగంలోని ఆర్టికల్ 31 ప్రకారం షెడ్యూల్ 9లో పొందుపరిచేలా చూడాలని భావిస్తోంది. దీనిని షెడ్యూల్-9లో చేరిస్తేనే రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లను పెంచి అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ, రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బిల్లు లేదా చట్టాన్ని పార్లమెంటుకు పంపిన తరువాత దానిపై పార్లమెంటు సమీక్ష చేస్తుంది. ముఖ్యంగా బీసీలకు రిజర్వేషన్లను పెంచాలనుకుంటున్న విధానం, విద్య, ఉద్యోగాలతోపాటు వెనకబాటుతనంపై వివరాలన్నింటినీ పరిశీలిస్తుంది. ఈ వివరాలతో కూడిన నివేదికను పార్లమెంటుకు బీసీ కమిషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంటు సమీక్షించి, ఆమోదించి.. షెడ్యూల్-9లో చేర్చినా ఇబ్బందులు రాకుండా పోవు. షెడ్యూల్ 9లో ఉన్న చట్టాల పైనా న్యాయ సమీక్ష జరిపేందుకు అవకాశం ఉంటుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పెంచాలనుకుంటున్న 42 శాతం రిజర్వేషన్ల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది.

బీసీ రిజర్వేషన్లపై మూడు బిల్లులు

» విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలకు వేర్వేరుగా పెట్టాలి

» తప్పుల తడకగా కులగణన సర్వే

» సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించింది బీఆర్ఎస్సే: కవిత



ఖమ్మం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఒకే బిల్లు ప్రవేశపెడితే సరిపోదని, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలకు వేర్వేరుగా మూడు బిల్లులు పెట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ విషయంలో బీసీ వర్గాలను చైతన్యం చేసేందుకు తెలంగాణ జాగృతి పని చేస్తుందని ప్రకటించారు. ఖమ్మంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్సీ కవిత.. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం, స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసం వద్ద విలేకరులతోనూ మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో కవిత మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌పై ఒకే బిల్లుపెడితే విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లపై కోర్టుల్లో ఇబ్బందులు ఎదురై రిజర్వేషన్ అమలు నిలిచిపోయే అవకాశం ఉందని అన్నారు. బీసీ జనాభా 46శాతం ఉన్నందున వారికి 46 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు పెట్టడమే కాక, అదే రోజున ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్ గాంధీ చెప్పినందున చట్టసభల్లో దానిని అమలు చేసి విద్య, ఉద్యోగాల్లో మాత్రం 46 శాతం అమలు చెయ్యాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మైనార్టీలకు వేరుగా రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లలో మైనారిటీలను ఎలా కలపుతారని బీజేపీ నేతలు అనడం సరికాదన్నారు. ఇక, కులగణన సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరారు. కులగణన తప్పులతడకగా సాగిందని, గ్రామాల వారీగా ఏ కులంలో ఎంత జనాభా ఉందో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతిని తొలిసారి అధికారికంగా నిర్వహించిన ఘనత కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కవిత పేర్కొన్నారు.

అనుమతులు లేకుండా ప్రాజెక్టులు కట్టేందుకు చంద్రబాబు యత్నం

గోదావరి, కృష్ణా జలాల పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలగా వ్యవహరించడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు అనుమతులు లేకుండా గోదావరి జలాలను వాడుకునేందుకు ప్రాజెక్టులు కట్టేందుకు ప్రయత్నిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు.

మోదీ, రాహుల్ కులంపై.. రెఫరెండానికి సిద్ధమా?

» అదే ఎజెండాగా ఎమ్మెల్సీ ఎన్నికలకు వెళదామా.. సీఎంకు బండి సవాల్

» రాహుల్ గాంధీకి మతం, జాతి, దేశం లేదంటూ నిప్పులు



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీ బీసీకనా..? కాదా..? రాహుల్ గాంధీ కులం, మతం, దేశం ఏంటి..? ఈ రెండు అంశాలపై రెఫరెండాన్ని కోరుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు వెళదామా..?' అని కేంద్ర మంత్రి బండి సంజయ్.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ చేశారు. 'రాహుల్ కులం, మతం, దేశం ఏంటి..?' రేవంత్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్‌కు కులం, మతం, జాతి, దేశం లేదంటూ సంజయ్ నిప్పులు చెరిగారు. మోదీని బీసీ అని దేశం గుర్తించిందని, రాహుల్ కుటుంబంపై చర్చ జరగాలన్నారు. రాహుల్ తాత ఫిరోజ్‌ఖాన్.. తల్లి క్రిస్టియన్, ఇటలీ దేశస్థురాలని పేర్కొన్నారు. కుల గణన తప్పుల తడక అని, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతోనే సీఎం రేవంత్, మోదీ కులంపై అవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో సంజయ్ శనివారం, మీడియాతో మాట్లాడారు. 1994లో గుజరాత్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే మోదీ కులాన్ని బీసీ జాబితాలో చేర్చిందని సంజయ్ గుర్తుచేశారు. రాష్ట్రంలో 10శాతం ఉన్న ముస్లింలను బీసీల్లో చేర్చితే ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. అదే జరిగితే స్థానిక ఎన్నికల్లో బీసీల స్థానాల్లో ముస్లింలే గెలుస్తారని, వారిదే రాజ్యమవుతుందని చెప్పారు. ఒకే కులానికి జిల్లా అధ్యక్ష పదవులు ఎక్కువ ఇచ్చారంటూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సంజయ్ అన్నారు.

మార్చిలోపు ఎనిమీ ఆస్తుల లెక్క తేల్చండి..

తెలంగాణలో కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ) సంరక్షణలో ఉన్న ఆస్తులను మార్చి నెలాఖరులోపు క్షేత్రస్థాయి పరిశీలన చేసి లెక్కతేల్చాలని కేంద్ర, రాష్ట్ర అధికారులను బండి సంజయ్ ఆదేశించారు. శనివారం ఆయన టూరిజం ప్లాజాలో హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, కొత్తగూడెం జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్‌పై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. ఏళ్ల తరబడి పొజిషన్‌లో ఉన్న రైతులకు అన్యాయం జరక్కుండా చూడాలని చెప్పారు. తెలంగాణలో రూ.10వేల కోట్ల విలువైన ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నట్లు గుర్తించామని సంజయ్ తెలిపారు. 'పాకిస్తాన్‌తో యుద్ధం సందర్భంగా ఇక్కడి వాళ్లు కొంతమంది తమ ఆస్తులను వదిలిపెట్టి పాకిస్తాన్‌కు వెళ్లారు. అలాగే, పాకిస్తాన్ వాసులు ఇక్కడికి వచ్చారు. ఒప్పందం ప్రకారం, వీరి ఆస్తులను ఆయా దేశాలు రక్షించాల్సి ఉంటుంది. అయితే, దీనిని పాక్ ఉల్లంఘించింది. అందుకే, మన దేశంలోని ఎనిమీ ప్రాపర్టీలను విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది' అని సంజయ్ వివరించారు. ఇందులో భాగంగా తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్‌పై మార్చి నెలాఖరులోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కాగా, త్వరలోనే హైదరాబాద్‌లో సెపీ అనుబంధ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. కాగా, బండి సంజయ్‌ని టీఎన్జీవో నాయకులు టూరిజం ప్లాజాలో సన్మానించారు. ఆదాయ పన్ను మినహాయింపును పెంచడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

స్థాయికి మించి రేవంత్ మాటలు

» ప్రధాని మోదీ కులంపై అవాస్తవాలు

» హామీలను నెరవేర్చే శక్తి కాంగ్రెస్‌కు లేదు : కిషన్‌రెడ్డి



నల్లగొండటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థాయికి మించి వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మోదీ కులంపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. 1994లో గుజరాత్‌లో కాంగ్రెస్ హయాంలోనే మోదీ కులాన్ని బీసీల్లో కలిపారని చెప్పారు. నల్లగొండ బీజేపీ కార్యాలయంలో శనివారం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌పైనే ఎక్కువ వ్యతిరేకత ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై పదేళ్లకు వ్యతిరేకత వస్తే.. కాంగ్రెస్ సర్కారు, రేవంత్‌రెడ్డి పాలనపై ఏడాదికే వ్యతిరేకత మొదలైందని చెప్పారు. రేవంత్‌రెడ్డి నిత్యం అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, అందుకే ఏడాదిలోపే అపఖ్యాతి మూటగట్టుకున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలు అమలుకావడం లేదని, వాటిని అమలు చేసే స్తోమత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. గతంలో ఎమ్మెల్సీలుగా గెలిచిన వారంతా మూకుమ్మడిగా అధికార బీఆర్ఎస్‌లో చేరడంతో ఉపాధ్యాయులు, నిరుద్యోగుల పక్షాన మాట్లాడే వారు కరువయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఏడాది పూర్తయిందని.. అసలు అది ఎటు పోయిందని నిలదీశారు. బీసీ సంఘాల డిమాండ్‌కు తాము అండగా ఉన్నామని పేర్కొన్నారు.



కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, పక్కన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన రేవంత్

» కాంగ్రెస్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత

» మోదీ కులంపై మాట్లాడే స్థాయి.. రేవంత్‌కు లేదు: ఎంపీ లక్ష్మణ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన సీఎం రేవంత్.. తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్నారని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రధాని మోదీ కులం గురించి మాట్లాడే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదని మండిపడ్డారు. కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పడుతుందని ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్‌లో లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్కారు చేపట్టిన కుల గణన ఓ బోగస్ ప్రక్రియ అని విమర్శించారు. హిందూ ముస్లిం, బీసీ ముస్లిం అని ఎక్కడైనా ఉందా..? అని ప్రశ్నించారు. సర్వే లెక్కలు బోగస్ అని తేలడంతోనే మళ్లీ సర్వేకు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పాల్గొన్నారు.



ఝార్ఖండ్ మంత్రి రాధాకృష్ణ కిశోర్ నుంచి ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న తెలంగాణ పోలీసు బృందం

జాతీయ పోలీసు క్రీడా పోటీల్లో తెలంగాణ జట్టుకు ఓవరాల్ చాంపియన్‌షిప్

» 18 పతకాలతో అగ్రస్థానం..సీఎం, డీజీపీ అభినందనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్‌లోని రాంచీలో ఈ నెల 10వ తేదీ నుంచి శనివారం వరకు జరిగిన జాతీయ పోలీసు క్రీడా పోటీల్లో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. ఈ క్రీడా పోటీల్లో రాష్ట్ర పోలీసులు మొత్తంగా 18 పతకాలు గెలుచుకుని ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. వివిధ క్రీడలు, శాస్త్రీయ పోటీల్లో ఆరు బంగారు పతకాలతో పాటు నాలుగు రజత, 8 కాంస్య పతకాల గెలుచుకున్నట్లు పోలీసు డ్యూటీ మీట్ నోడల్ అధికారి షికా గోయల్ తెలిపారు. క్రీడల ముగింపు కార్యక్రమంలో ఝార్ఖండ్ ఆర్థికమంత్రి రాధాకృష్ణ కిశోర్ పాల్గొని తెలంగాణ పోలీసు బృంద నాయకుడు రాంరెడ్డికి ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీ అందజేశారు. తెలంగాణ పోలీసులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించడంపై సీఎం రేవంత్, డీజీపీ జితేందర్ హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు వారు అభినందనలు తెలిపారు.

స్వర్ణ విమాన గోపురానికి ముహూర్తం ఖరారు

» 19నుంచి 23 దాకా సంప్రోక్షణ..23న ప్రతిష్ఠా మహోత్సవం

యాదాద్రి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి స్వర్ణ విమాన గోపురానికి మహా కుంభ సంప్రోక్షణ కార్యక్రమానికి ముహూర్తం ఖరారైంది. దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వర్ణగోపురం పనులు యాదాద్రిలో పూర్తి కావొచ్చాయి. ఫిబ్రవరి 19 నుంచి 23వ తేదీ వరకు సంప్రోక్షణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 23న ఉదయం 11.54గంటలకు సుదర్శన లక్ష్మీ నారసింహ దివ్య స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని వానమామలై మఠం 31వ పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. కాగా, గోపురానికి బంగారం తాపడం అమర్చే పనులు ఈ నెల 19లోగా పూర్తి చేయనున్నారు. తాపడం అమర్చే పనులకు మొత్తం 60కిలోలకు పైగా బంగారాన్ని వినియోగించారు. సంప్రోక్షణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు హాజరుకానున్నారు.



సంతుసేవాలాల్ దేవాలయ భూమి పూజలో పాల్గొన్న మంత్రి తుమ్మల

సేవాలాల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జంతుబలులు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా గిరిజనులను చైతన్య పరిచిన నేత సంత్‌సేవాలాల్ మహారాజ్ అని, ఆయన ఆశయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సంత్‌సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంత్‌సేవాలాల్‌కు తుమ్మల ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ స్ఫూర్తితో బంజారాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగారని.. విద్యా, వైద్యం, ఐటీ వంటి రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా బంజారాలను ఆదుకుంటుందని తెలిపారు. బంజారాలు ఆధునిక వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని, ఉద్యాన పంటలు సాగుచేయాలని సూచించారు.

ఎంత ఎదిగినా జాతి వేష, భాషలు మరవొద్దు

» సేవాలాల్ జయంతి కార్యక్రమంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చరిత్ర పునాదుల మీదే జాతి నిర్మితమవుతుందని, ఎంత ఎత్తుకు ఎదిగినా జాతి మూలాలు, వేష, భాషలను మరవకూడదని మంత్రి సీతక్క అన్నారు. శనివారం సంత్‌సేవాలాల్ జయంతి సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలకు హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడారు. సేవాలాల్ శాంతి బోధనలు, సమానత్వం, అహింస స్ఫూర్తితో ముందుకు నడవాలని, ఆయన చూపిన సమాజ శాంతి కోసం బంజారాలు పనిచేయాలన్నారు. బంజారాలను సంచార జీవితాల నుంచి విముక్తి కల్పించి వారికి స్థిర నివాసాల కోసం తండాలను ఏర్పాటు చేసిన వ్యక్తి సేవాలాల్ అని తెలిపారు. ఆ మహనీయుడి ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించడమే ఆయనకు ఇచ్చే నివాళి అన్నారు. గత ప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయని, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం రూ.17వేల కోట్లు కేటాయించిందని చెప్పారు. తండాల అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. గిరిజనుల విజ్ఞప్తి మేరకు వచ్చే ఏడాది ఎల్బీ స్టేడియంలో సేవాలాల్ జయంతిని నిర్వహించేలా సీఎంను కోరుతానన్నారు. సేవాలాల్ జయంతి నిర్వహణకు కోరినన్ని నిధులిచ్చిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

యాదాద్రి జిల్లాలో 1000 కోళ్ల మృతి

» బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవన్న వైద్యులు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 15: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని కోళ్ల ఫాంలో శనివారం వెయ్యి బ్రాయిలర్ కోళ్లు మృతి చెందాయి. ఆకస్మికంగా కోళ్లు మృత్యువాతపడడంతో ఆందోళనకు గురైన రైతు పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చాడు. పశువైద్యాధికారి ఫాంకు చేరుకుని కోళ్ల నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ల్యాబ్‌కు పంపించారు. అయితే మృతి చెందిన కోళ్లలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదని ఆయన ప్రాథమికంగా నిర్ధారించారు. మూడు రోజుల్లో ల్యాబ్ రిపోర్టు వస్తుందని, అప్పటి వరకు కోళ్ల విక్రయాలు నిలిపివేయాలని రైతును ఆదేశించారు. మృతి చెందిన కోళ్లను సమీపంలోని తన వ్యవసాయ భూమిలో రైతు పాతిపెట్టాడు.

కోళ్లు చనిపోతే సమాచారం ఇవ్వండి

» నంబర్‌ను ప్రకటించిన పశుసంవర్ధక శాఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పౌల్ట్రీ ఫాం బ్రాయిలర్ కోళ్లలో ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ లక్షణాలు అక్కడక్కడా బయటపడుతున్న నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ అప్రమత్తమైంది. అన్ని పౌల్ట్రీఫాంలపై నిఘా పెట్టాలని జిల్లాల పశుసంవర్ధక అధికారులకు శనివారం అత్యవసర ఆదేశాలు జారీచేసింది. అలాగే తమ చుట్టుపక్కల కోళ్లలో అసాధారణ వ్యాధి లక్షణాలు కనిపించినా, కోళ్లు మృతి చెందినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పశుసంవర్ధక శాఖ కమిషనర్ ప్రజలను కోరారు. వాట్సాప్ నెంబర్ 91007 97300కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నిర్ణీత వ్యవధిలోగా ప్రాజెక్టులు పూర్తి కావాలి: ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల నిర్మాణాలను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జలసౌధలో నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెల 18, 19 తేదీల్లో రాజస్థాన్‌లో అఖిల భారత నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర సాగునీటి రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలపై సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. అనంతరం ఎస్‌ఎల్‌బీసీ, డిండి, పాలమూరు-రంగారెడ్డి, దేవాదుల తదితర ప్రాజెక్టుల పురోగతిపై మంత్రికి అధికారులు నివేదిక ఇచ్చారు. రాష్ట్రంలో నీటి నిల్వల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్

రాహుల్ మాటే వేదవాక్కు!

(మొదటిపేజీ తరువాయి)

ఆశీర్వదించడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, తనకు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించిందని తెలిపారు. ఇక ప్రజలకు ఏం చేయాలన్నదే తనకు తొలి ప్రాధాన్య అంశమని చెప్పారు. రేపు ఏం చేశావని ప్రజలు అడిగేది తననేనని అన్నారు. పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకున్నపుడు కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత రావడం సహజమని రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యతిరేకతను అధిగమించి రాజభరణాల రద్దు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, తెలంగాణ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ చేసి చూపించిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణన కూడా అలాంటివేనన్నారు. తనది కాంగ్రెస్ పార్టీ అని, రాహుల్‌గాంధీ ఏం చెబితే అది చేస్తానన్నారు. వర్గీకరణ, కులగణన దేశానికి రోడ్ మ్యాప్ లాంటివని చెప్పారు. కుల గణన ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు.

ప్రధాని హోదాకు భంగం కలిగేలా మాట్లాడలేదు

ప్రధాని నరేంద్ర మోదీని కించపరిచేలా తానేమీ మాట్లాడలేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పానన్నారు. తేదీల్లో ముందు వెనుక తేడాలు ఉండొచ్చేమో కానీ ప్రధాని గురించి తప్పుగా మాట్లాడలేదని చెప్పారు. మోదీకి బీసీల పట్ల నిజంగానే ప్రేమ ఉంటే జనగణనలో కుల గణనను జత చేయాలని సవాలు విసిరారు. మోదీ విషయంలో తన వ్యాఖ్యలను ఖండిస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే స్వయంగా 1994లో మోదీ బీసీగా మారారని అంగీకరించారన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్ వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటే, కుదరదు చట్టం చేయాల్సిందేనని బీజేపీ నేతలు పట్టుబట్టారని, అందుకే, దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మార్చిలోనే పార్లమెంటులో చట్టం చేయించే బాధ్యత కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌దేనన్నారు. కేసీఆర్‌లా తామేమీ కళాశాల పిల్లలతో మొక్కుబడి సర్వే చేయించలేదని, ప్రభుత్వ ఉద్యోగులతో సమగ్ర సర్వే చేశామని చెప్పారు. ఒక కుటుంబానికి సంబంధించిన వివరాలు రెండుసార్లు నమోదయ్యే అవకాశమే లేదన్నారు. జనగణనలో కులగణన చేసి తమ లెక్కలు తప్పని నిరూపించాలని బీజేపీకి సవాల్ విసిరారు. 1931తర్వాత దేశంలో కుల గణన జరగలేదని, అలాంటప్పుడు ఏ కులానికి చెందిన జనాభా ఎంతో ఎలా చెబుతారని ప్రశ్నించారు.



ఢిల్లీలో విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కేసీఆర్ సర్వే తప్పుల తడక

కేసీఆర్ సర్వేలో బీసీలు 51శాతం, ఓసీ 21 శాతం, ఎస్సీలు 18శాతం, ఎస్టీలు 10శాతం ఉన్నట్లు తేల్చారని రేవంత్ ప్రస్తావించారు. అందులో మైనారిటీలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. తాము బీసీలను ఐదు కేటగిరీలుగా లెక్కించి, ముస్లిములతో కలిపి 56.33 శాతం బీసీలుగా తేల్చామన్నారు. కేసీఆర్ లెక్క కంటే తమ లెక్కలో ఐదున్నర శాతం మంది బీసీలు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. ముస్లింలను బీసీల్లో తాము కొత్తగా చేర్చలేదని, ఎప్పటి నుంచో బీసీ-ఈగా ముస్లింలు ఉన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ సర్వేలో ఎస్సీ ఉపకులాలు 82 అని చెప్పారని, క్షేత్ర స్థాయిలో ఉన్నది 59 మాత్రమేనని ప్రస్తావించారు. అవగాహన లేని వాళ్లతో చేయించిన కేసీఆర్ సర్వేలో మూచీ కులం అని అచ్చుతప్పు టైప్ చేసి, చివరికి దాన్నికూడా ఒక కులంగా మార్చారని అన్నారు. తెలంగాణలో ముస్లింలు 17 శాతం ఉన్నారని చెప్పుకొనే వాళ్లని, తాము సర్వే చేసి అది 12.56 శాతమేనని తేల్చామని గుర్తు చేశారు. కేసీఆర్ సర్వే చేసి పదేళ్ల వివరాలన్నీ దాచి పెట్టారని, దానికో చట్టబద్ధత కూడా కల్పించలేదని విమర్శించారు. తొలి దశలో ఏ కులం ఎంత మందో తేల్చామని, రెండో దశలో కులాల వారీగా ఉద్యోగాలు, పదవుల లెక్కలు కూడా తేలుస్తామని అన్నారు. దీనికోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మార్చి మొదటి వారంలో కులగణన నివేదిక వస్తుందని, తర్వాత రిజర్వేషన్లు ఎలా వర్తింపజేయాలో స్పష్టత వస్తుందని తెలిపారు.

మార్చి 31 లోపు 100% రైతు భరోసా

మార్చి 31లోపు వంద శాతం రైతు భరోసా ఇస్తామని రేవంత్ ప్రకటించారు. కేసీఆర్ రూ.10 వేలే ఇస్తే తాము రూ.12వేలు ఇస్తున్నామని చెప్పారు. రియల్ ఎస్టేట్ భూములకు రైతుబంధు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 హామీని కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని కేసీఆర్, కేటీఆర్ కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. సబిత, తలసాని ఏ పార్టీ తరఫున గెలిచి ఏ పార్టీ మంత్రివర్గంలో పని చేశారని ప్రశ్నించారు. ప్రజలకు అన్నీ గుర్తుంటాయన్నారు. చట్టసభ సభ్యుల ఫిరాయింపులకు సంబంధించి నిర్ణయం తీసుకోవడానికి సభాపతికి నిర్దేశిత గడువు పెట్టాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని, అది కేంద్రం చేతిలో ఉందని చెప్పారు.

మంత్రివర్గ విస్తరణపై అన్నీ ఊహాగానాలే

మంత్రివర్గ విస్తరణపై అన్నీ ఊహాగానాలేనని, అదే నిజమైతే రాహుల్‌తో తానొక్కడినే ఎందుకు మాట్లాడతానని ప్రశ్నించారు. తనతోపాటు పీసీసీ అధ్యక్షుడు, ఇతరులు ఉంటారన్నారు. కులగణనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, దీనిపై రాహుల్‌కు సమగ్రంగా వివరించానని తెలిపారు. యమునా నదిని ప్రక్షాళన చేస్తామని చెబుతున్న బీజేపీ మూసీని ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు సహకరించదని ప్రశ్నించారు.

రూ.4,500 కోట్ల రుణానికి కేంద్రం నిరాకరణ!

» జనవరి నాటికే రూ.53,678 కోట్ల అప్పు తీసేసుకున్న రాష్ట్రం!

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో తీసుకోవాలనుకున్న రూ.10 వేల కోట్ల అప్పులో రూ.4,500 కోట్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వం ఈ నెల 18న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించే వేలం పాటలో పాల్గొనడం లేదు. రుణాల కోసం ఎలాంటి ఇండెంట్లూ పెట్టలేదు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ.30 వేల కోట్ల అప్పు తీసుకుంటామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి ప్రతిపాదించింది. జనవరి, ఫిబ్రవరి, మార్చిలో రూ.10 వేల చొప్పున రూ.30 వేల కోట్ల అప్పు కోసం ఇండెంట్లు సమర్పించింది. కానీ, జనవరిలో కేంద్ర ప్రభుత్వం అనుమతించిన రూ.5,500 కోట్ల అప్పును మాత్రమే తీసుకోగలిగింది. మిగతా రూ.4,500 కోట్లు తీసుకోలేకపోయింది. ఈ ఫిబ్రవరిలో తీసుకోవాల్సిన రూ.10వేల కోట్లలో 4న రూ.3000 కోట్లు, 11న రూ.2000 కోట్లు, 18న రూ.2500 కోట్లు, 25న రూ.2500కోట్ల చొప్పున అప్పు తీసుకుంటామని ప్రతిపాదించింది. ఈనెల 4న రూ.3000 కోట్లు తీసుకుంది. 11న తీసుకోవాల్సిన రూ.2000 కోట్లు, 18న తీసుకోవాల్సిన రూ.2500కోట్ల అప్పునకు ఇండెంట్లు పెట్టలేకపోయింది. కేంద్రం నుంచి అనుమతి రాకపోవడంతో అప్పు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 25న తీసుకోవాలనుకున్న రూ.2500 కోట్ల అప్పునకు కేంద్రం అనుమతి ఇస్తుందా.. లేదా? అనేది వేచి చూడాలి. వాస్తవానికి 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ ద్వారా రూ.49,255.41 కోట్ల మార్కెట్ రుణాలను సేకరిస్తామని బడ్జెట్‌లో పొందుపర్చింది.కానీ, జనవరి నాటికే రూ.53,678.93 కోట్ల రుణం తీసుకుంది. అంటే పరిమితికి మించి రూ.4,423 కోట్ల అప్పు తీసుకుంది. అయితే, ఈ నెల 25న మరో రూ.2,500 కోట్లు, మార్చిలో రూ.10 వేల కోట్ల అప్పు తీసుకుంటామని ఆర్‌బీఐకి తెలంగాణ ప్రతిపాదించింది. అయితే, ఇందుకు కేంద్రం అనుమతిస్తుందా అన్నది ప్రశ్నార్థకమే. ఈ విషయంపై ఆర్థిక శాఖ అధికారులు పెదవి విప్పడం లేదు.

నేడు, రేపు మండనున్న సూరీడు !

35 డిగ్రీలపైగా ఉష్ణోగ్రత నమోదయ్యే చాన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగిపోతుంది. ఫిబ్రవరిలోనే సూర్యుడి ప్రతాపం చూపిస్తున్నాడు. ఆది, సోమవారాల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం హెచ్చరించింది. ఆదివారం 14 జిల్లాలకు, సోమవారం 21జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 35 నుంచి 37 డిగ్రీల మధ్య నమోదవుతాయని హెచ్చరించింది. ఇక, శనివారం కూడా రాష్ట్రంలో ఎండల తీవ్రత కనిపించింది. ఖమ్మంలో అత్యధికంగా 37.6, కొత్తగూడెం, గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్‌లో 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



హరిత సదస్సులో పాల్గొన్న భట్టి, బిల్డర్లు

బిల్డర్లు, డెవలపర్లకు సంపూర్ణ సహకారం

» వారిని ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

» హైదరాబాద్‌ను 'గ్రీన్ సిటీ'గా మారుస్తాం

» ప్రపంచ గమ్యస్థానంగా ఫోర్త్ సిటీ: భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బిల్డర్లు, డెవలపర్లు సంపద సృష్టికర్తలని, వారిని గౌరవప్రద పౌరులుగా చూస్తామని, సంపూర్ణ సహకారం అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్‌లో శనివారం బిల్డర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన హరిత తెలంగాణ సదస్సులో డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బిల్డర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేసి, బిల్డర్లు, డెవలపర్లను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్డర్లు, డెవలపర్లకు హైదరాబాద్ స్వర్గధామమని అభిప్రాయపడ్డారు. 'రైజింగ్ తెలంగాణ' దిశగా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఢిల్లీలో కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజధానిలోని డీజిల్ వాహనాలను దశల వారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తామన్నారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ప్రపంచ గమ్యస్థాన కేంద్రంగా ఫోర్త్ సిటీని తీర్చిదిద్దుతామని అన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును చేపట్టడం రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయి అని అన్నారు. 2029-30కల్లా 20,000మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా కొత్త పాలసీని రూపొందించామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా హైదరాబాద్ అభివృద్ధికి రూ.10వేల కోట్లను కేటాయించామన్నారు.

వక్ఫ్ బోర్డుకు రెగ్యులర్ సీఈవోను నియమించేదెప్పుడు?: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వక్ఫ్‌బోర్డుకు పూర్తిస్థాయి సీఈవోను ఎప్పుడు నియమిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు డివిజన్ బెంచ్ ప్రశ్నించింది. వచ్చే విచారణ నాటికి ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై సీఈవోగా ఉన్న అసదుల్లాకు ఊరట కల్పించింది. ఆయనను తొలగించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై సస్పెన్షన్ విధించింది. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 23 ప్రకారమే ప్రస్తుత సీఈవో అసదుల్లాను డిప్యుటేషన్‌పై నియమించారని తెలిపింది. తదుపరి విచారణను జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలాదేవి ధర్మాసనం మార్చి 12కు వాయిదా వేసింది.

కోడ్ లేని జిల్లాల్లో ఇళ్ల పనులు ప్రారంభించండి

శాటిలైట్ టౌన్‌షిప్‌లపై దృష్టి పెట్టాలి.. సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. సచివాలయంలో శనివారం రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార-పౌర సంబంధాల శాఖలకు సంబంధించి బడ్జెట్ ముందస్తు సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కోర్టు కేసుల్లో ఉన్న ప్రభుత్వ భూములను సాధించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఇలాంటి భూవివాదాలపై ప్రభుత్వ న్యాయవాదులతో నిరంతరం చర్చించాలని అన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న భట్టి, పొంగులేటి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సినిమా కళాకారులను ప్రోత్సహించడంతోపాటు సమాజ వికాసానికి దోహదపడే లఘు చిత్రాలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు, పథకాలకు లఘు చిత్రాల ద్వారా ప్రచారం కల్పించడానికి తగిన చర్యలు చేపట్టాలని సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డుకు ఇరు వైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. డిజిటల్ భూసర్వేకు సంబంధించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల జాబితా తయారు చేసి, ప్రతి నెలా అద్దెలు చెల్లించడానికి వీలుగా ఆర్థిక శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కాలుష్య రహిత హరిత ఇంధనాన్ని(గ్రీన్ ఎనర్జీ) ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున... అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయ భవనాలపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

భట్టికి మాల జేఏసీ సంఘాల వినతిపత్రం

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ మాల సంఘాల జేఏసీ నాయకులు బేర బాలకిషన్, జి.చెన్నయ్య, చెరుకు రాంచందర్, తాళ్లపల్లి రవి, గురువుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్ పేర్కొన్నారు. మాలలను కాంగ్రెస్ నుంచి దూరం చేసేందుకు, రాష్ట్రంలో బీజేపీ బలపడేలా మనువాదులు చేస్తున్న కుట్రలకు కాంగ్రెస్ ప్రభుత్వం బలికాకూడదని అన్నారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వర్గీకరణ బిల్లు అశాస్త్రీయంగా ఉందని, ఇది పూర్తిగా కాంగ్రెస్‌కు నష్టమని అన్నారు. వర్గీకరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అన్ని వర్సిటీల్లో ఒకే పాఠ్యాంశం!

» ప్రతి పట్టభద్రుడికీ ఉద్యోగమే లక్ష్యం

» ఉన్నత విద్య పాఠ్యాంశాల్లో మార్పులు

» 2025-26 నుంచి కొత్త సిలబస్

» సీఎం ఆదేశాల నేపథ్యంలో సంస్కరణలు

» ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం.. లైఫ్‌సైన్సెస్, ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో ప్రపంచస్థాయిలో పేరుగాంచింది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తయ్యే మొత్తం వ్యాక్సిన్లలో మూడో వంతు హైదరాబాద్‌లో తయారవుతుండగా.. దేశం మొత్తం ఫార్మారంగ ఉత్పత్తుల్లో హైదరాబాద్ వాటా 35 శాతం ఉంది. ఇలా నగరం 'ఫార్మా క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా పేరు పొందింది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. ఫార్మా కంపెనీల్లో పనిచేసే నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. హైదరాబాద్‌లో మొత్తం 900కు పైగా ఫార్మా కంపెనీలు ఉండగా.. మానవ వనరుల కొరత వేధిస్తోంది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోనూ లైఫ్ సైన్సెస్ ప్రధానాంశంగా కోర్సుల్లేవు. రాష్ట్రంలో ఏటా వేలాదిమంది పట్టభద్రులు అవుతున్నా.. వారికి ఉద్యోగాల్లేవు. ఒక వైపు కంపెనీలు.. మరోవైపు నిపుణుల కొరత. ఈ రెండింటి మధ్య అంతరాన్ని భర్తీ చేసేందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి సిద్ధమైంది. రాష్ట్రంలో డిగ్రీ పూర్తిచేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు రచించాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు.. సంస్కరణలకు సన్నద్ధమైంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కోర్సుల పాఠ్యప్రణాళికను మార్చనుంది. అలాగే ప్రస్తుతం వర్సిటీల వారీగా వేర్వేరుగా ఉన్న సిలబస్‌ను రద్దుచేసి.. రాష్ట్రమంతటికీ ఒకే సిలబస్‌ను సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించిన తొలి సమావేశం శనివారం ఉన్నతవిద్యామండలిలో జరిగింది. చైర్మన్ బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు మహమూద్, పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్‌లతోపాటు అన్ని యూనివర్సిటీల నుంచి 50 మందికిపైగా సబ్జెక్టుల నిపుణులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త సిలబస్‌ను అమలు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

సిలబస్ కమిటీల ఏర్పాటు

అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) కోర్సులకు కొత్త సిలబస్ రూపొందించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఇది రూపుదిద్దుకోనుంది. ఇందుకోసం కొత్తగా నాలుగు కమిటీలను ఏర్పాటు చేశారు. మేనేజ్‌మెంట్, లా కోర్సుల సిలబస్ కమిటీకి చైర్మన్‌గా బాలకిష్టారెడ్డి, బీఎస్సీ సైన్స్ కోర్సులకు మహమూద్, ఆర్ట్స్ కోర్సులకు పురుషోత్తం, ఇంజనీరింగ్ కోర్సులకు శ్రీరాం వెంకటేష్ నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీల్లో విషయ నిపుణులు, పారిశ్రామిక వర్గాల ప్రతినిధులు, సీసీఎంబీ, ఎన్ఐఎ లాంటి కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థల ప్రతినిధులూ ఉంటారు. కొత్త సిలబస్‌పై త్వరలోనే కమిటీలు నివేదిక అందిస్తాయి. అలాగే వచ్చే సంవత్సరం నుంచి రాష్ట్రం మొత్తానికి ఒకే సిలబస్ అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఉపాధికి అవకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సులపై ఉన్నత విద్యామండలి గత కొద్ది నెలలుగా అధ్యయనం చేస్తోంది. ఈ దిశగా గత ఏడాది బీఎస్సీ (బయో మెడికల్‌సైన్స్) కోర్సును కొన్ని వర్సిటీల్లో ప్రవేశపెట్టగా.. విశేష స్పందన వచ్చింది. దీంతో ఈ కోర్సును అన్ని వర్సిటీల్లో ప్రవేశపెట్టనున్నారు. ఇదే తరహాలో ఈసారి కొత్తగా ఐదు కోర్సులు ప్రారంభిస్తున్నారు. ఇందులో బీఎస్సీ అనలటికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫోరెన్సిక్ సైన్స్, ఫారెస్ట్రీ, కంప్యుటేషనల్ ఫార్మకాలజీ, ఆస్ట్రో ఫిజిక్స్ కోర్సులు ఉన్నాయి. వీటిని వచ్చే ఏడాది అన్ని వర్సిటీల్లో ప్రవేశపెట్టాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ మేరకు అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనుంది. అలాగే డిగ్రీ ప్రవేశాల్లో దోస్త్ ద్వారా ఓ కోర్సులో ప్రవేశాలు తీసుకున్నా..ఇతర కోర్సుల్లో ఆసక్తి ఉన్న సబ్జెక్టులు ఎంచుకునే అవకాశం ఉంది. ఇందులోనూ కొన్ని మార్పులు చేయాలని, విద్యార్థులకు మరిన్ని ఆప్షన్స్ ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. సీఎం రేవంత్ ఆదేశాల మేరకు సంస్కరణలు తెస్తున్నామని బాలకిష్టారెడ్డి తెలిపారు.

ఎస్బీఐ చేతికి రూ.30.71 కోట్ల
శీతల్ రిఫైనరీస్ స్థిరాస్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులను మోసం చేసిన కేసులో హైదరాబాద్‌కు చెందిన శీతల్ రిఫైనరీస్ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసిన రూ.30.71 కోట్ల స్థిరాస్థులను ఎస్బీఐకి ఈడీ అధికారులు అప్పగించారు. నకిలీ బ్యాంకు గ్యారంటీలు సమర్పించి శీతల్ రిఫైనరీస్ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ.190 కోట్ల రుణం తీసుకుంది. అయితే బ్యాంకు అధికారుల విచారణలో మోసం జరిగినట్లు వెల్లడికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 21 నకిలీ బ్యాంకు గ్యారంటీల ద్వారా ఈ మొత్తం సొమ్ము బదిలీ అయినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించి బ్యాంకులను మోసం చేసిన డబ్బును షెల్ (డొల్ల) కంపెనీలకు మళ్లించి వాటి ద్వారా శీతల్ రిఫైనరీస్ యాజమాన్యం ఆస్తులు కొన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో 2016 నుంచి 2022 వరకు విడతల వారీగా శీతల్ రిఫైనరీస్‌కు చెందిన రూ.52.77 కోట్ల ఆస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. అయితే ఇటీవల ఎస్బీఐ.. ఈడీ న్యాయస్థానంలో ఒక పిటిషన్ దాఖలు చేసి ఈడీ ఆధీనంలో ఉన్న శీతల్ రిఫైనరీస్ ఆస్తులను వేలం వేసేందుకుగాను తమకు అప్పగించాలని అభ్యర్థించింది. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల్లో రూ.30.71 కోట్ల స్థిరాస్తులను ఎస్బీఐకి అప్పగించాలని ఆదేశించింది.

గొలుసు దొంగను పట్టుకోబోయి... రైలు ఢీకొని

- ఢిల్లీలో 'అనంత' జవాన్ మృతి



బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భార్య మెడలోని తాళిబొట్టు గొలుసును తెంచుకు వెళుతున్న దొంగను పట్టుకునే క్రమంలో రైలు కిందపడి జవాన్ లక్ష్మన్న(32) మృతి చెందారు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన లక్ష్మన్న 2014లో బీఎస్ఎఫ్ జవానుగా ఉద్యోగంలో చేరారు. లక్ష్మన్నకు ఐదేళ్ల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు తాలూకా జయంతినగర్‌కు చెందిన లక్ష్మితో వివాహమైంది. వీరికి కూతురు జియ(4), కుమారుడు ఇయాన్(3) ఉన్నారు. నెల క్రితం లక్ష్మన్న సెలవుపై సొంతూరికి వచ్చారు. 16న కశ్మీర్‌లో విధుల్లో చేరాల్సిఉండడంతో బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. నిజాముద్దీన్ ఈస్ట్ రైల్వేస్టేషన్‌కు 50 కి.మీ. దూరంలో రైలు నెమ్మదిగా వెళుతోంది. ఆ సమయంలో లక్ష్మి మెడలోని బంగారు మంగళ సూత్రాన్ని ఒక దొంగ లాక్కొని పరుగులు తీశాడు. దొంగను పట్టుకునేందుకు రైలు నుంచి లక్ష్మన్న కిందకు దూకగానే పక్క ట్రాక్‌పై వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో లక్ష్మన్న అక్కడికక్కడే మృతి చెందారు.

వక్ఫ్‌బోర్డు చట్టానికి సంస్కరణలు అవసరం: జస్టిస్ నరసింహారెడ్డి

- పార్లమెంట్ భవనాన్ని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించుకుంది
- వక్ఫ్‌బోర్డు 8 లక్షలకు పైగా ఎకరాలను సమకూర్చుకుందన్న నరసింహారెడ్డి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు చట్టంలో పూర్తి స్థాయిలో సంస్కరణలు అవసరమని పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. కాచిగూడ మున్నూరు కాపు భవన్‌లో వక్ఫ్ బోర్డు చట్టం- పరిణామాలు అనే అంశంపై గోపాల్ రావు ఠాగూర్ స్మారక ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ నరసింహారెడ్డి హాజరయ్యారు. 3 లక్షల ఎకరాల ఆస్తులున్న వక్ఫ్‌బోర్డు నేడు 8 లక్షలకు పైగా ఎకరాలను సమకూర్చుకుందని, ఢిల్లీలోని పార్లమెంట్ భవనం, మహాకుంభమేళా జరుగుతున్న ప్రయాగ, తమిళనాడులో 1500 ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయాన్ని వక్ఫ్‌బోర్డు ఆస్తులుగా ప్రకటించుకుందని నరసింహారెడ్డి చెప్పారు. సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా కేంద్ర ప్రభుత్వం 2024 వక్ఫ్‌బోర్డు చట్ట సంస్కరణలు తీసుకువస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ నిర్ధారిస్తే తప్ప వక్ఫ్ ఆస్తి కాదని ప్రస్తుత కొత్త సంస్కరణల్లో ఉందని, గతంలో ఇది లేదన్నారు. రక్షణ శాఖ, రైల్వే శాఖ తర్వాత మూడవ స్థానంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులు ఉన్నాయని లక్ష్మీనారాయణ అన్నారు.

రూ. 100 కోట్లకు పైనే ఏడీఈ సతీశ్ ఆస్తులు!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ గచ్చిబౌలి సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) కొట్టె సతీష్ ఆస్తులు కోట్లలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏసీబీ అధికారుల విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. శంకర్‌పల్లిలో 6 ఎకరాలు, కరీంనగర్‌లో 16 ఎకరాల వ్యవసాయ భూమి, నగర శివారులో ఒక విల్లా, పలు ప్రాంతాల్లో అపార్టుమెంట్‌లో 4 ఫ్లాట్లు, కిలో బంగారం, ఇతర బ్యాంకు బ్యాలెన్సులు సహా పలు ఆస్తులు గుర్తించినట్లు తెలిసింది. వాటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.80-100 కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై ఏసీబీ అధికారికంగా ఎలాంటి వివరాలు ప్రకటించలేదు. స్థిర, చర ఆస్తులు ఉద్యోగంలో చేరిన తర్వాత సంపాదించాడా లేదా గతంలో ఏమైనా ఉన్నాయా అనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. సతీష్ 2006లో విద్యుత్ శాఖలో ఏఈగా చేరాడు. ఇంతకుముందు చర్లపల్లి సబ్ డివిజన్‌లో ఆపరేషన్స్ ఏడీఈగా పనిచేసిన అతను గత ఏడాది అక్టోబరులో చేపట్టిన బదిలీల్లో పైరవీ చేసి గచ్చిబౌలి ఏడీఈగా వచ్చాడు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్ తెచ్చుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్థుల విద్యుత్ కనెక్షన్లకు అంచనాలు, కనెక్షన్లు మంజూరు చేసేందుకు సతీష్ ఆఫీసులోనే దర్జా డబ్బులు తీసుకునేవాడనే ప్రచారం ఉంది. గచ్చిబౌలి ఏడీఈగా వచ్చిన తర్వాత సబ్ డివిజన్‌లో జరిగే ప్రతి పని తన దృష్టిలోకి వచ్చిన తర్వాతే జరగాలంటూ నిబంధనపెట్టాడనే విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వచ్చే ఫైళ్లను పక్కన పెట్టి..50 వేల నుంచి రూ.లక్ష డిమాండ్ చేసేవాడని ప్రచారం ఉంది.

భర్త ఎదుటే భార్యపై అత్యాచారం

- గిరిజన మహిళపై తమిళనాడు వాసి దుశ్చర్య
- అడ్డుకోబోయిన బాధితురాలి భర్తపై దాడి
- సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాదిలో దారుణం

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దేవుడి మొక్కు తీర్చుకుని కాలినడకన ఇంటికి తిరిగొస్తూ మార్గమధ్యలో ఓ చెట్టు కింద భర్తతో కలిసి నిద్రిస్తున్న వివాహితపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన ఆమె భర్తను కొట్టి అతని కళ్ల ముందే దుశ్చర్యకు తెగబడ్డాడు. సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాదిలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దారుణం ఘటన జరగ్గా నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని ఓ తండాకు చెందిన దంపతులు సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా మొక్కులు చెల్లించడానికి ఈ నెల 2న తమ స్వగ్రామం నుంచి అనంతపురం జిల్లా నేరడిగొండకు కాలినడకన వెళ్లారు. అక్కడ మొక్కులు చెల్లించిన తర్వాత కాలినడకన ఇంటికి తిరుగు ప్రయాణమైన ఆ దంపతులు శుక్రవారం రాత్రికి సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాది గ్రామానికి చేరుకున్నారు. ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో భోజనం చేసి పక్కనే ఉన్న ఓ చెట్టు కింద నిద్రపోయారు. అయితే, నిర్మాణంలో ఉన్న విద్యాపీఠం ఆలయంలో పెయింటింగ్ పనులు చేస్తున్న తమిళనాడుకు చెందిన మాధవన్ (34) సదరు వివాహితపై కన్నేశాడు. అర్ధరాత్రి సమయంలో భర్త కళ్ల ముందే ఆమెపై అత్యాచారం చేశారు. అడ్డుకోబోయిన భర్తను రాయితో కొట్టి గాయపరిచాడు. నిందితుడి నుంచి తప్పించుకున్న భర్త 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు నిందితుడు మాధవన్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగ్గురి అరెస్టు.. రిమాండ్

- చక్రధర్‌గౌడ్ ఫిర్యాదుతో గతంలో కేసు

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. సిద్దిపేటకు చెందిన బాధితుడు జి.చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుతోపాటు మరికొందరిపై పోలీసులు గతేడాది వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ కేసులో సిద్దిపేటకు చెందిన తోడుపునూరి సంతోష్‌కుమార్, బండి పరశురాములు, తెల్జీర్ వంశీకృష్ణను పంజాగుట్ట పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేటలో డీఎస్పీ ప్రణీత్‌రావు సహాయంతో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసి 2023 నుంచి తన ఫోన్‌తోపాటు, తన భార్య, కుటుంబ సభ్యులు, డ్రైవర్ సహా అందరి ఫోన్లనూ ట్యాప్ చేశారని గతంలో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో చక్రధర్‌గౌడ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమ కేసులు పెట్టి పలు రకాలుగా వేధించారని తెలిపారు.

ఎన్నికలు లేవు.. నిధులు రావు

పంచాయతీలకు సర్పంచులు లేక.. నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీల పాలకమండళ్ల గడువు ముగిసి ఏడాది దాటిపోయింది. అయినా.. వాటికి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో కూడా తెలియని పరిస్థితులున్నాయి. పలు కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నా.. దీని ఫలితంగా పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది ఫిబ్రవరిలో పంచాయతీల సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగా.. అప్పటినుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో తెలంగాణలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం రూ.1,514 కోట్లను కేటాయించింది. కానీ, పంచాయతీల్లో పాలకమండళ్లు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని మార్గదర్శకాలు చెబుతున్నాయి. దీంతో ఏడాదిగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. మరోవైపు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,152 కోట్లను కేటాయించగా.. ఈ నెల 7వ తేదీ నాటికి రూ.2,109 కోట్లు విడుదలయ్యాయి. కర్ణాటకకు రూ.1,120 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మాత్రమే సర్పంచ్‌లు లేనికారణంగా నిధులు విడుదల కాలేదు. ఈ నిధులను కోల్పోవాల్సి వస్తుందన్న కారణంతోనే రాష్ట్ర ప్రభుత్వం మార్చి 10వతేదీ నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావించింది. కానీ, రాష్ట్రంలో మారిన రాజకీయ, సామాజిక పరిస్థితులతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో ఈ ఏడాది కేంద్రం నుంచి అందాల్సిన ఆర్థికసంఘం నిధులపై సందిగ్ధం నెలకొంది.

నిధుల విడుదలలో నిక్కచ్చిగా కేంద్రం..

నిధుల విడుదలలో కేంద్రం నిక్కచ్చిగా వ్యవహరిస్తోంది. 15వ ఆర్థిక సంఘం నుంచి గడచిన నాలుగేళ్లలో (2020-21 నుంచి 2023-24 వరకు) తెలంగాణలోని పంచాయతీలకు రూ.6,051 కోట్లు రాగా, ఈ ఆర్థిక సంవత్సరం మాత్రం ఒక్క రూపాయి రాకపోవడమే ఇందుకు నిదర్శనం. 2024 ఫిబ్రవరిలో పాలకమండళ్ల పదవీకాలం ముగియడంతో.. ఆ తరువాత నుంచి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమయ్యే నాటివరకే లెక్కించి నిధులను కేంద్రం విడుదల చేసింది. దీని ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.1,430 కోట్లలో రూ.6 కోట్లను తగ్గించి రూ.1,424 కోట్లనే విడుదల చేయడం గమనార్హం. కాగా, దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న 15వ ఆర్థిక సంఘం 2026 వరకు ఉంటుంది. ఈ ఐదేళ్ల (2021 నుంచి 2026 వరకు) కాలానికి పంచాయతీల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం కేంద్రం రూ.2,36,805 కోట్లను కేటాయించింది. ఇందులో తెలంగాణకు రూ.7,565 కోట్లు రావాల్సి ఉంది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఢిల్లీ మినహా మిగిలిన 28 రాష్ట్రాలకు కలిపి రూ.60,750 కోట్లను కేటాయించింది. వీటిలో తెలంగాణకు రూ.1,514 కోట్లను ప్రకటించింది. కానీ, పంచాయతీల్లో పాలకమండళ్లు లేని కారణంగా ఇవి అందలేదు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపే.. అంటే మార్చి 31లోగా పాలకమండళ్లు ఏర్పడితే ఆర్థిక సంఘం నిధులు వస్తాయని సర్కారు భావించింది. అందుకోసమే మార్చిలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినా.. కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాలతో ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో 2024-25కు సంబంధించి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులు రాష్ట్రానికి అందే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇస్తారా.!

రాష్ట్రంలోని పంచాయతీల్లో పాలకమండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం ఈ ఏడాది ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయలేదన్నది స్పష్టమవుతోంది. వచ్చే మార్చి 31తో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఆ తరువాతే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం గడువు కూడా వచ్చే మార్చితోనే ముగియనుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి విడుదల చేయని నిధులు వచ్చే ఏడాదికి బదిలీ అవుతాయా? అందుకు అవకాశాలున్నాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఒక ఏడాదికి కేటాయించిన నిధులు నిలిచిపోతే.. తర్వాత ఏడాదికి బదిలీ చేసే వెసులుబాటు కేంద్రానికి ఉంటుంది. అది కేంద్రం విచక్షణపై ఆధారపడి ఉంటుంది. కానీ, రోజురోజుకూ మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలంగాణకు ఇలా నిధులను కేంద్రం బదిలీ చేస్తుందా అన్నది ప్రశ్నార్థకమే.

ఇప్పటివరకు 15వ ఆర్థిక సంఘం కింద విడుదలైన నిధులు.. రూ.కోట్లలో

సంవత్సరం	కేటాయింపు	విడుదల
2020-21	1,847	1,847
2021-22	1,365	1,365
2022-23	1,415	1,415
2023-24	1,430	1,424
2024-25	1,514	------

మిస్టరీగా మారిన యువకుడి మిస్సింగ్

- హత్య చేశానంటూ ఒకరి లొంగుబాటు
- దొరకని మృతదేహం


దశరథ్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో ఓ యువకుడి మిస్సింగ్ కేసు మిస్టరీగా మారింది. కనిపించకుండా పోయిన అతణ్ని తానే హత్య చేశానని ఒకరు పోలీసులకు లొంగిపోగా, బాధిత వ్యక్తి కుటుంబసభ్యులు తమకు మృతదేహం అప్పగించాలని ఆందోళనకు దిగారు. నిజాంపేట మండలం నాగ్‌దర్ రాంచెందర్ తాండాకు చెందిన దశరథ్ (30) సంగారెడ్డిలోని గణపతి షుగర్స్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం తన సొంత ఊరైన రాంచెందర్ తండాకు వెళ్తానని చెప్పి తాను పనిచేస్తున్న యజమాని వద్ద బైకు తీసుకొని దశరథ్ బయల్దేరాడు. అయితే ఇంటికి చేరలేదు. విషయం తెలుసుకున్న దశరథ్ భార్య శుక్రవారం సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే నారాయణఖేడ్ మండలం మేఘ్యానాయక్ తండాకు చెందిన గోపాల్ అనే వ్యక్తి దశరథ్‌ను తానే హత్య చేసి, మృతదేహాన్ని దహనం చేశానని శనివారం నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. దశరథ్‌కు ఓ మైనర్ బాలికతో వివాహేతర సంబంధం ఉందనే కారణంతోనే హత్య చేసినట్లు అతడు తెలిపాడు. అతడిని అదుపులోకి తీసుకుని పరిసర ప్రాంతాల్లో పోలీసులు వెతకగా దశరథ్ మృతదేహం మాత్రం లభించలేదు. విషయం తెలుసుకున్న దశరథ్ కుటుంబసభ్యులు నిజాంపేట-నారాయణఖేడ్ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. దశరథ్ హత్యకు గురైతే మృతదేహం అప్పగించాలని, నిందితుడ్ని కఠినంగా శిక్షించాలంటూ రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

వంశీ ఇంట్లో సుదీర్ఘ సోదాలు

- గచ్చిబౌలిలో ఫోన్ల కోసం పోలీసుల గాలింపు
- మైహోమ్ భూజాలో సీసీటీవీ ఫుటేజీల పరిశీలన
- సత్యవర్ధన్‌ను ఇక్కడికే తరలించినట్లు గుర్తింపు



విజయవాడ/రాయదుర్గం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇంట్లో విజయవాడ పోలీసులు శనివారం సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. అరెస్టుకు ముందు పోలీసుల నుంచి నోటీసు అందుకున్న తర్వాత తన సెల్ ఫోన్లను ఆయన మాయం చేశారు వాటి కోసం విజయవాడ పటమట పోలీసులు వేట మొదలుపెట్టారు. ఇన్‌స్పెక్టర్, ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లతో వెళ్లిన బృందం రాయదుర్గం పోలీసుల సహకారంతో గచ్చిబౌలిలోని మైహోమ్ భూజా గేటెడ్ కమ్యూనిటీ 11వ అంతస్తులోని వంశీ ఇంట్లో తనిఖీలు నిర్వహించింది. గంటన్నర సోదాలు జరిపి కీలక ఆధారాలు సేకరించింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ దాడి కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించి.. ఫిర్యాదుతో తనకు సంబంధం లేదంటూ ఆయనతో న్యాయాధికారికి అఫిడవిట్ ఇప్పించాక.. ఆయన్ను కారులో హైదరాబాద్‌కు తరలించారని పోలీసులు కోర్టుకు ఇచ్చిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. సత్యవర్ధన్‌ను తీసుకెళ్లిన కారును ఇప్పటికే వారు గుర్తించారు. మైహోం భూజాలోకి ఏ మార్గంలో తీసుకెళ్లారో ఆరా తీస్తున్నారు. సెల్లార్‌కు వెళ్లే.. వచ్చే మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. వంశీ ఇంట్లో ఫోన్లను ఎక్కడ రహస్యంగా ఉంచారో తెలుసుకునేందుకు సోదాలు నిర్వహించారు. ఏడీసీపీ జి.రామకృష్ణ ఈ నెల 13న హైదరాబాద్‌లో వంశీ ఇంటికి వెళ్లి ఆయనకు 47ఏ నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. అది అందుకున్నాక.. వంశీ డ్రెస్ మార్చుకొని వస్తానని చెప్పి బెడ్ రూమ్‌లోకి వెళ్లి సుమారు 45 నిమిషాలు ఫోన్‌లో పలువురితో మాట్లాడారు. తర్వాత దానిని మాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసుకు సంబంధించిన కీలక సమాచారం ఫోన్ ద్వారా తెలిసే అవకాశం ఉండటంతో పాటు ఇంకా విలువైన సమాచారం ఇంట్లో లభించే అవకాశం ఉండడంతో పోలీసులు గచ్చిబౌలిలో తనిఖీలు నిర్వహించారు. ఇంట్లోని సీసీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆయన ఐదు ఫోన్లు ఉపయోగిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపితే కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. కాగా, సత్యవర్ధన్ వాంగ్మూలాన్ని విజయవాడ పటమట పోలీసులు నమోదు చేశారు. వల్లభనేని వంశీ అనుచరులు తనను ఎలా ట్రాప్ చేశారు.. ఎవరెవరు ఎక్కడెక్కడ తిప్పారో ఆయన వివరించారు. ముఖ్యంగా కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగారావు పేర్లను చెప్పినట్లు తెలిసింది.

ఫిషింగ్ మెయిల్‌తో 'మేఘా'కు టోకరా!

- 5.47కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు
- నెదర్లాండ్స్ కంపెనీ పేరిట మెయిల్
- 2 విడతల్లో సొమ్ము కాజేసిన వైనం
- సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు వ్యక్తులనే కాదు.. బడా సంస్థలనూ బురిడీ కొట్టిస్తున్నారు. అన్ని మార్గాలనూ వాడుకుంటూ అందినకాడికి దోచుకుంటున్నారు. రూ.కోట్లు కొట్టేస్తున్నారు. తాజాగా మేఘా ఇంజనీరింగ్ సంస్థ కూడా వీరి వలలో చిక్కింది. సైబర్ నేరగాళ్లు ఈ సంస్థ నుంచి రెండు విడతల్లో రూ.5.47 కోట్లు కాజేశారు. ఫిషింగ్ ఈ మెయిల్ ద్వారా మేఘా సంస్థకు చెందిన ఈ-మెయిల్ వ్యవస్థలోకి చొరబడ్డ నేరగాళ్లు.. ఈ మోసానికి పాల్పడ్డారని కేసు దర్యాప్తు ప్రారంభించిన సైబర్ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. నేరగాళ్లు మేఘా కంపెనీ లావాదేవీలను ఫిషింగ్ ఈ-మెయిల్ ద్వారా గమనిస్తూ ఏయే కంపెనీలతో లావాదేవీలు జరుగుతున్నాయో గుర్తించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత డబ్బు అందుకున్న కంపెనీ నుంచి మేఘా సంస్థకు కన్ఫర్మేషన్ మెయిల్ వచ్చేది. దీన్నే సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకున్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన ఒక కంపెనీ నుంచి కొన్ని పరికరాల కోసం మేఘా సంస్థ ఆర్డర్ పెట్టింది. ఆ పరికరాలు అందిన తర్వాత నెదర్లాండ్ కంపెనీ నుంచి ఇన్‌వాయిస్ రావడంతో అందుకు తగ్గ మొత్తాలను మేఘా ప్రతినిధులు చెల్లించారు. ఈ క్రమంలో నెదర్లాండ్ కంపెనీ పంపించే ఈ-మెయిల్ మాదిరిగానే ఒక్క అక్షరం మార్చి సైబర్ నేరగాళ్లు మేఘాకు మెయిల్ చేశారు. తమ బ్యాంకు ఖాతా మారిందని, తదుపరి చెల్లింపులు ఈ ఖాతాకు చేయాలని పేర్కొన్నారు. మేఘా కంపెనీ ప్రతినిధులు ఈ-మెయిల్‌లో అక్షరం మారిన విషయాన్ని గమనించకుండా రెండు విడతల్లో రూ.5.47 కోట్లను కొత్త ఖాతాకు పంపారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఈ సొమ్ము అందినట్లుగా కన్ఫర్మేషన్ మెయిల్ వచ్చింది. కానీ, తమకు డబ్బు అందలేదని నెదర్లాండ్స్ కంపెనీ నుంచి మెయిల్ రావడంతో మేఘా ప్రతినిధులు అవాక్కయ్యారు. తాము మోసపోయినట్లు గుర్తించి సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశారు.

సమాజ సేవకు అంకితం కావాలి

మనుషులు లేకపోయినా వారి ఆశయాలు కొనసాగాలి.. ఎన్టీఆర్ ట్రస్ట్, బసవతారకం ఆస్పత్రి శాశ్వతంగా ఉంటాయి

- యుఫోరియా మ్యూజికల్ నైట్‌లో ఏపీ సీఎం
- నా వంతుగా రూ. 50 లక్షల విరాళం ఇస్తున్నా
- హంగామా లేకుండా ట్రస్ట్ సేవలు: పవన్
- ప్రజలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్: మంత్రి లోకేశ్
- అమరావతిలో తలసీమియా సెంటర్: బాలకృష్ణ
- అందరూ రక్తదానం చేయాలి: నారా భువనేశ్వరి


ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న భువనేశ్వరి, చిత్రంలో ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

విజయవాడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పేదరికం, అసమానతలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు జీవితాంతం సమాజ సేవలో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ 28 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తలసీమియా బాధితుల సహాయం కోసం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం రాత్రి యుఫోరియా సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మంచి సమాజం కోసం ఎన్టీఆర్ నిరంతరం తపించారన్నారు. ఆయన శ్రీమతి బసవ తారకం క్యాన్సర్‌తో చనిపోయినప్పుడు ఎన్టీఆర్ చాలా బాధపడ్డారన్నారు. ఒక విషాదం ఒక మంచికి విత్తనం వేసిందని, అదే బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి అని వివరించారు. మనుషులు మన వద్ద లేకపోయినా వారి ఆశయాలు కొనసాగాలన్నారు. ట్రస్ట్, క్యాన్సర్ ఆసుపత్రి శాశ్వతంగా ఉంటాయని వెల్లడించారు. ఫ్యాక్షన్ రాజకీయాల్లో కార్యకర్తల కుటుంబాలు అనాథలు కాకుండా ఉండేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్ ఏర్పాటు చేశామన్నారు..

ట్రస్ట్ ద్వారా ప్రజల గుండెల్లో ఎన్టీఆర్: పవన్

ఎటువంటి హంగామా లేకుండా ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు చేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విదేశాల నుంచి ప్రముఖ వైద్యులు వచ్చి ఇక్కడ సేవ చేస్తున్నారంటే ట్రస్ట్‌పై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుందన్నారు. ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. తన వంతుగా ట్రస్ట్‌కు రూ. 50 లక్షల విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. చిరునవ్వు, భరోసా, నమ్మకానికి ఎన్టీఆర్ ట్రస్ట్ చిరునామాగా ఉంటుందని మంత్రి లోకేశ్ అన్నారు. త్వరలో పెద్ద ఎత్తున రక్తనిధి కేంద్రాలు, రక్త పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో అధునాతన సదుపాయాలతో కొత్త వార్డును ప్రారంభించామని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చెప్పారు. హైదరాబాద్‌లో ఎనిమిది పడకలతో తలసీమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన సెంటర్‌ను 25 పడకలకు పెంచుతున్నామని వెల్లడించారు. త్వరలో అమరావతిలో తలసీమియా సెంటర్ నిర్మిస్తామని చెప్పారు.

బాధితుల కష్టాలు చూసి..: నారా భువనేశ్వరి

భయంకరమైన తలసీమియా వ్యాధి బాధితుల కష్టాలు చూసి తలసీమియా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఒక్కో సెంటర్ ఏర్పాటుకు రూ. 40-50 లక్షలు ఖర్చవుతుందన్నారు. దానికి నిధులను సమీకరించడానికి ఈ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశామన్నారు. యాంకర్ సుమ, సంగీత దర్శకుడు తమన్ ఏమీ ఆశించకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. అందరూ రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా చేసిన సేవలను వివరించారు. కాగా, తలసేమియా వ్యాధిగ్రస్తుల వైద్య చికిత్స కోసం అమెరికాలోని అట్లాంటాకు చెందిన సజ్జా సురేష్ రూ. 5 లక్షల విరాళాన్ని భువనేశ్వరికి అందజేశారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.